హాస్యకథలు

TPLAI2UB128
1873
G.212
G 212
శ్రీ వేమన గ్రంథాలయమ్
తేలప్రోలు. (కృష్ణా జిల్లా.)

● మునిమాణిక్యం ●

వెరైటి ఏజన్సీస్,
బుక్ సెల్లర్సు,
బెజవాడ.

వెల

పన్నెండు అణాలు.

హాస్యకథలు

శ్రీ అక్కినేపల్లి జానకిరామారావుగారు అని హైదరాబాద్‌లో ఒక జాగీర్‌దార్‌గారు ఉన్నారు. వారికి నవ్యసాహిత్యమందు అపారమైన ఆదరణ చాలా మంచివారు. వారి ఆదరణ పొంది నేను ఈ పుస్తకాన్ని అచ్చువేయించగలిగాను. వారికి నా కృతజ్ఞత తెలుపుకుంటున్నాను.

ఈ పుస్తకం పేరునుగురించి ఒక్కమాట. శ్రీ దీక్షితులుగారుకూడా హాస్యకథలు అనేపేరుతో ఒక కథలపుస్తకం అచ్చువేయించినట్లు తెలుస్తుంది. అయితేనేమి? ఇవి నా హాస్యకథలు. ఈ కథలలో మంచి టెక్నిక్ ఉందనే నాఉద్దేశం. రచన చేయలేకపోయినా కథను ఎక్కడ పురిపెట్టాలో, ఎక్కడ మలచాలో శ్రీ ఉప్పువ గోపాలకృష్ణ గోఖలేగారికి బాగా తెలుసు. ఆయన మంచి విమర్శకుడు. ఆయన చూపిన కొన్నిచోట్ల నేను నగిషీలు చెక్కాను. వారికి నా నమస్కారములు.

ఇక ఒక్క విషయము. ఈ కథలలో 'ఎవరిని చూసినా ఏమిటిది' అనే కథనుగురించి ఒక్కమాట చెప్పవలసిఉంది. ప్రపంచకథలు అనే పుస్తకంలో 'ముద్దు' అని ఒకకథ ఉన్నది. అది ఒక ఇంగ్లీషు కథను అనువాదము. ఆకథ చాలా తమాషాగాఉంది. ఒక విశిష్టమైన శిల్పచాతురి అందులో ప్రదర్శింపబడ్డది. ఆ పద్ధతిని నేను అవలంబించాను. ఆ కథలోని ఒకటి రెండు వాక్యాలుకూడా నా కథలోకి దొంగతనంగావచ్చి నా వాక్యాలచాటున దాక్కొన్నవి. నేను వాటిని పట్టుకొని బైటికి లాగివేయాలిసింది. కాని దాక్కొని ఉండటంమూలాన వాటిని గుర్తించలేకపోయినాను. జాకోబీన్ పబ్లిషింగు హౌస్‌వారు నన్ను క్షమింతురుగాక.

మునిమాణిక్యం.

ఫస్టు కేస్

ఏజెంట్ల మీటింగు అయిపోయింది. అందరూ ఎవరిదారిని వారు వెళ్ళిపోతున్నారు. తాము ఆ సంవత్సరములో చేయించిన బిజినెస్‌కు, తమకు రావలసిన కమిషన్ తీసుకొని, సంతోషంగా వెళ్ళిపోయినారు చాలామంది.

ఈశ్వరరావు మటుకు ఒక్క దమ్మిడీ అయినా తీసుకోకుండా ఒట్టిచేతులతో వస్తున్నాడు. అందుకనే అతడు చాలా విచారంగాకూడా ఉన్నాడు.

జనరల్ మేనేజరు పిలుస్తున్నారని ఈశ్వరరావుకు కబురు వచ్చింది. అతడు వెళ్ళి ఆయనకు ఎదురుగా కూర్చున్నాడు.

మేనేజరు అన్నాడు, 'ఏమండీ, మీరు ఏజెన్సీ పుచ్చుకొని అయిదారు నెలలు అయింది. ఒక్క కేసుఅయినా పంపలేదు. ఏమిటి సంగతి?'

'నా లోపంలేకుండా కృషిచేస్తున్నాను. కాని కలిసిరావటంలేదు. అదృష్టంలేదు' అన్నాడు రావు.

'మిస్టర్ రావు ఇన్స్యూరెన్సులో అదృష్టమూ, దురదృష్టమూ అంటూ ఏమీలేదు! నీవు బాగా పనిచెయ్యాలి?'

'ఏమి చేయమంటారు?'

'నీవు ప్రతి నిమిషమూకూడా ఇన్స్యూరెన్సును గురించి ఆలోచించాలి!'

'ఇన్స్యూరెన్సును గురించి పుస్తకాలు చదువుతున్నానండి!'

'చదువుతున్నావా? అయితే ఆపేసెయ్యి. అల్లాంటి పిచ్చిపనులు ఏమీచేయకు. పుస్తకాలు చదవటంవల్ల బిజినెస్ వృద్ధిగాదు. మానవజీవితాన్ని తెలుసుకో. తెలిసిందా?'

ఈశ్వరరావు తెలిసినట్లు తలఊపాడు. మేనేజరు మళ్ళీ ఇట్లా అన్నాడు: 'మనిషి తన భవిష్యత్తునుగురించి సాధారణముగా ఆలోచించడు జరిగిపోతున్నంతకాలం. ఆ విషయంనీది. అతని భవిష్యత్తునుగురించి ఆలోచించవలసిన పనినీది. తెలిసిందా?'

'తెలిసిందండి. ప్రతివాడూ తన ముందుగతినిగూర్చి ఆలోచించడు. వాడుచస్తే వాడిపెళ్ళాం, వాడి బిడ్డలగతి ఏమౌతుందా అని నేను దిగులుపడి వాడికేదో ఒకఉపాయం ఆలోచించి చెప్పాలె!'

'ఇన్సూ్యరెన్సు ఏజెంటు పనే అది!' అన్నాడు మేనేజరునవ్వుతూ.

ఈశ్వరరావు చిన్నవాడు. పనికొచ్చేవాడు. అతనికి తగినంత ప్రోత్సాహమిచ్చి ఎట్లాగైనా అతనిద్వారా బిజినెస్ రాబట్టాలని మేనేజరు గట్టిగా పట్టుపట్టాడు.

'మిస్టర్ ఈశ్వరరావ్ పట్టుదలతో పనిచేయాలె మీరు. ప్రొద్దున లేచినప్పటినుండి అదే ఆలోచనలో ఉండాలె.'

'రైల్లో ప్రయాణంచేస్తున్నావనుకో, ఆకాలం వృధాచేయకూడదు. ఇన్సూ్యరు చేయటంవలన కలిగేలాభాలూ, ఇన్సూ్యరు చేయకుండాపోయిన వాళ్ళ పెళ్ళాం బిడ్డలు పడ్డబాధలూ ఈ విషయాలనుగురించి కథలు చెప్పాలె. అందులో ఒకడికో, ఇద్దరికో నీవు చెప్పింది నచ్చుతుంది. నీకృషి ఫలిస్తుంది. పట్టుదల ఉండాలె.' అని ఇల్లాగ ఎంతోసేపు ప్రోత్సాహకరమైనమాటలు

చెప్పాడు. పాపం ఈశ్వరరావు ఒట్టిచేతులతో వెళ్ళుతున్నాడే అని జాలికూడా కలిగింది ఆయనకు. అందుకని అతనికి ఒక యాభై రూపాయలు ఎడ్వాన్సుకూడా ఇప్పించి, దీవించి పంపాడు.

ఈశ్వరరావు సంతోషించాడు. బి. ఏ. ప్యాసుఅయిన కుర్రవాడు. తెలుగులోకూడా బాగా మాట్లాడగలడు.

ఇప్పుడు అతడికి బాగా ప్రోత్సాహం కలిగింది. పట్టుదల అతని గుండెల్పైన పీఠంవేసుకొని కూర్చున్నది. ఏమైనాసరే రోజుకు ఒక కేసు అయినా పట్టంది భోజనం చేయకూడదని నిశ్చయించుకొని స్వగ్రామం వెళ్ళిపోవటానికి బయలుదేరాడు.

ఈశ్వరరావు ఉతభా గట్టి పట్టుపట్టాడు. బెజవాడ చేరటంతోనే మెడలువిరిచి అయినాసరే ఎవరినో ఒకరిని ఇన్సూర్ చేయిస్తాడు. అంత పట్టుదల అతనిముఖంలో స్పష్టంగా కనిపిస్తూ వేఉంది.

౨

ఈశ్వరరావు గబగబా పరుగెత్తుకుంటూవెళ్ళి రైలు ఎక్కాడు. ఖాళీగాఉన్న ఒక పెట్టెలోఎక్కి ఒక బెంచీపై కూర్చున్నాడు.

మేనేజరు చెప్పినమాటలు, అతని చెవుల్లో గింగురుమంటూనే ఉన్నాయి. ఇది రైలుపెట్టెగదా అని ఊరుకో కూడదు. ఇక్కడకూడా తన వేట సాగించాలె.

తనకు ఎదురుగాఉన్న బెంచీపైన ఇరవై ఏండ్ల కుర్రవాడు ఒకడు కూర్చొనిఉన్నాడు. విచారంగా దిక్కులుగాచూస్తున్నాడు. అతనేదో చిన్న ఉద్యోగిలాగ ఉన్నాడు. బీదవాడుకూడా ఏతే కావచ్చు. అయితేమటుకేం ఆలోచించాలసిన విషయమే!

ఈశ్వరరావు బాగా ఆలోచించాడు. తన ప్రయత్నాలు ఇప్పుడే ఆరంభిస్తే చాలా మంచిది. ఈతణ్ణి పట్టుకొని కొద్ది మొత్తానికైనా సరే ఇన్స్యూర్ చేయిస్తే ఎల్లాగుంటుందీ అన్న ఆలోచన తట్టింది.

ఈ ఆలోచనే చాలా బాగుంది. ఇది అతని మొదటి కేసు. మొదటి ప్రయత్నంలోనే నెగ్గాలె.

ఈశ్వరరావుకు ఈ బిజినెస్ అంటే మొదటినుంచీ ఇష్టం. తన భవిష్యత్తును గురించి బాగా ఆలోచించే చివరకు ఇన్స్యూరెన్సు ఏజెంటుగా కుదురుకున్నాడు.

ఇన్నాళ్లబట్టీ ఒక్క కేసుఅయినా చేయించలేక పోయిన మాట నిజమేకాని ఇవ్వాళ అట్లాకాదు. ఆ ఎదురుగాఉన్న కుర్రవాడిని చూచేచూడటంతోనే తెలిసింది ఈశ్వరరావుకు తన అదృష్టరేఖ బైటపడ్డదని.

అతడు తనకు కలుగబోయే అదృష్టాన్ని గురించి ఎక్కువగా ఊహించుకొంటూ పోయినాడు. ఇది తప్పకుండా నెగ్గుతుంది. ఆ తరువాత అతడు పట్టిందల్లా బంగారం కావచ్చు. బిజినెస్ వృద్ధి అవుతుంది. నెలకు వందా, రెండు వందలుకూడా సంపాదిస్తూ ఉంటాడు. తరువాత రిన్యూయల్ ప్రీమియమ్ యొక్క కమిషనుమీదనే హాయిగా జీవించే రోజులు రావటానికి కూడా ఎంతోకాలం పట్టకూడదు.

ఇంతెందుకూ తనకు పట్టబోయే అదృష్టమంతా ఈ మొదటి కేసులో తనకు విజయం కలగటంపైనే ఆధారపడియున్నది. ఎట్లాగయినాసరే కుర్రవాణ్ణి పట్టితీరాలె.

3

ఈశ్వరరావు ఆ కుర్రవాడి దగ్గరజేరి అతన్ని మెల్లగా మాటలలోకి దించాడు. అతని సంగతి అంతా తెలుసుకోంటానికి ఎంతోసేపు పట్టలేదు.

ఆ అబ్బాయి ఒక బడిపంతులు. కొద్ది జీతంమీదనే ఎల్లాగో జీవిస్తున్నాడు.

ఇక ఆ అబ్బాయి భవిష్యత్తునుగురించి బాగా ఆలోచించవలసిన బాధ్యత తనది, మానేజరుగారు చెప్పినట్లు.

సంసారం కొద్దే కాబట్టి ఇప్పుడెట్లాగో గడుస్తున్నది ఆ అబ్బాయికి. ముందు ముందు ఎల్లాగు?

బ్రతికివుంటే తల తాకట్టుపెట్టి అయినా సరే ఎల్లాగో పెళ్ళాముబిడ్డలను పోషిస్తాడు అనుకోందాము. కర్మంచాలక అతడు కాస్తా హరీఅంటే వాళ్ళగతి ఏమికావాలె! కాబట్టి ఈ విషయం నచ్చచెప్పి అతనొక పాలసీ పుచ్చుకొనేటట్లు చేయక తప్పదు.

అయితే ఆ కుర్రవాడు ఏమంత తెలివైనవాడులాగ కనిపించలేదు. ఏదో మందమతిలాగా ఉన్నాడు. ఎందుకూఅంటే ఆ జవాబులు ఏదో పరధ్యాన్నంగా, ఎక్కడో చూస్తూ, ఏదో ఆలోచిస్తూ చెప్పాడు.

అయితేనేమి? అల్లాంటివాణ్ణే కాస్త దారికి తీసుకొనివచ్చి ఒక పాలసీ తీసుకొనేలాగునచేస్తే ఒక బీదసంసారాన్ని రక్షించిన పుణ్యం దక్కుతుంది.

ఈశ్వరరావు పట్టుదలతో, పని ప్రారంభించి ఆ పంతులును క్రమంగా సంభాషణలోకి లాగి జీవితం అశాశ్వతం అనే విషయంలోకి దింపాడు.

ఇల్లా అన్నాడు. ‘చూడండి. ఈబ్రతుకు శాశ్వతం కాదు. ‘అనిత్యానీ శరీరాణి’ అన్నాడు. ఇప్పుడు ఇల్లాగ కులాసాగా మాట్లాడుతున్నాము, కాని ఇంకా కాసేపటికి ఏమి జరుగుతుందో ఏమీ చెప్పలేము.’

ఆ అబ్బాయి ఊరుకొన్నాడు, వినీ విననట్లు. అవునన లేదు’ కాదనలేదు. ఏదో తియ్యనిమత్తులో ఉన్నట్లు చూస్తూ కూర్చున్నాడు.

‘చూశారూ, పంతులుగారూ! బండి ఇప్పుడు ఈవంతెనమీదుగా పోతున్నది. కాని ఈవంతెన ఠపీమని విరిగిపోయి, రైలు పడిపోయి రైలులోని ప్రయాణీకులలో కొందరు చనిపోవచ్చు! అల్లా చాలాచోట్ల జరిగింది!’

అటు చూస్తూన్న పంతులు ఇటుతిరిగి ఈయన చెప్పే మాటలు వింటానికి కొంత ఆసక్తి కనపరచాడు.

ఈశ్వరరావు ధైర్యంతో మళ్లీ ఇట్లాఅన్నాడు. ‘నిత్యం సన్నిహితో మృత్యుః’ అన్నాడు. మృత్యువనేది ఎల్లప్పుడూ మనలను అనుసరిస్తూ గబుక్కున మీదపడుతుంది ఎప్పుడో ఒకప్పుడు! ఏ రూపంతో వస్తుందో చెప్పలేము. ఒకసారి, దారిని పోతూఉన్న రెండెడ్లబండి విరిగి ఒక శూద్రవాడిమీద పడ్డది. వాడి ప్రాణాలు అక్కడే పోయినాయి.’

పంతులు ఈ మాటలు విని చాలాఆశ్చర్యపడ్డాడు. అంత పని జరిగిందా అన్నట్లు తెల్లపోయిచూశాడు.

ఏజెంటు మహాశయునికి పట్టుదల ఎక్కువ అయింది. పంతులు వలలోపడేటట్లే ఉన్నాడు. ముఖంచూస్తే అల్లాగే ఉంది. అందుకనే అతడొక చిన్న ఉపన్యాసం సాగించాడు మధ్య మధ్య అతని ముఖంలోని మార్పులను గుర్తిస్తూ. ఉపన్యాసం అంతా విన్నాడు ఆ కుర్రవాడు ఒకమాటైనా పలకకుండా.

చివరకు ఉపన్యాసకుడు అన్నమాట ఇది.

'సైకిల్ మీదనుంచిపడి అక్కడే అక్షణంలో, ప్రాణాలు విడిచినవాళ్ళుకూడా ఉన్నారు!'

ఆ అబ్బాయి ఏడ్పుముఖం పెట్టాడు. అతని బుర్రలోకి ఈతని మాటలు ఎక్కినవి. ఏజెంటు ఈశ్వరరావు చాలా సంతోషించాడు. ఇంతకూ మేనేజరు చెప్పినట్లు పట్టుదలఉంటే సరి, అదృష్టం అదే కలిసివస్తుంది. తనమాటలు ఆ కుర్రవాడికి బాగా నచ్చినట్లు తెలుస్తూనేఉంది. ఇక అతనిచేత పాలసీ కొనిపించటానికి ఎంతోసేపు పట్టదనికూడా గ్రహించి, ఈశ్వరరావు కొంచెం గంభీరంగా ముఖంపెట్టి ఇట్లా అన్నాడు.

'పంతులుగారూ, ఒక్కమాట చెబుతాను వినండి. మీరు ఏమీ అనుకోవద్దు. మీకు ఆస్తి ఏమీలేదు. ఏదో పల్లెటూరులో బడిచెప్పుకొని బ్రతుకుతున్నారు. ఏ ఆపదోవచ్చి అంటే ఇల్లాంటి ప్రమాదంకలిగి, మీ ప్రాణాలుకాస్తా గుటుక్కు మంటే, మీ పెళ్ళాంగతి ఏమికావాలె! నీ బిడ్డలగతి ఏమి కావాలె! వాళ్ళు అన్నంలేక మాడిచస్తారు! అవునా, కాదా?'

దీనికి జవాబుగా పంతులు ఏమంటాడోనని ఈశ్వరరావు అతనివంకే చూస్తున్నాడు. పంతులు, అతడు అడిగినదానికి జవా

బుగా అవుతని తలవూపుతూ చూస్తూఉంటంగానే గొల్లుమని ఏడ్వటం సాగించాడు.

అరె! ఇంతపని జరుగుతుందని ఆ ఏజెంటుఅయినా ఎప్పుడూ అనుకోలేదు. అతను ఆశించినదిఅయినా ఏదో అయిదు వందల పాలసీ! నెలకు రెండురూపాయిలు ప్రిమియమ్ కడితే చాలు.

ఈ పాలసీమాట ఎత్తకముందే ఈ పంతులుగారు ఇట్లాగ ఏడుస్తాడని ఆయన కలలోనైనా అనుకోలేదు. ఇదిచాలా విచిత్రంగాఉంది. అదీకాక అతనికి ఏమిచేయటానికీ తోచలేదు.

ఆ ఏడ్పుచూచి, ఆ పెట్టెలో ఉన్నవాళ్లంతా అంతకుముందు మాట్లాడుతూ ఉన్నవాళ్ళల్లా చప్పున ఆగిపోయి ఆ కుర్రవాడివంకా, ఆ ఏజెంటువంకా చూడటం మొదలుపెట్టారు. వాళ్ళకు ఏమీ తెలియలేదు. ఇద్దరూ కుర్రవాళ్ళలాగే కనపడ్డారు. వాళ్ళకు పిల్లిద్దరూకూడా మాటా మాటా అనుకున్నారేమోనని అనుమానం కలిగింది.

ఆ పంతులు ఏడ్పు ఆపలేదు. 'అంతే, నీవు అన్నదినిజం! నిజం కాకపోతే ఎందుకు అంటావులే!' అనిఅంటూ ముఖాన గుడ్డ అడ్డుపెట్టుకొని ఏడ్వటం సాగించాడు.

ఆ అబ్బాయిమీద అందరికి చాలా జాలికలిగింది. ఈ ఏజెంటు ఏదో మాటఅంటే ఆ కుర్రవాడు ఏడుస్తున్నాడు. ఇదీ అంతా అనుకొన్నది.

'ఎందుకయ్యా, ఆ అబ్బాయిని ఏడ్పించటం,' అన్నారు కూడా ఒకరిద్దరు పెద్దవాళ్ళు. పాపం; ఈశ్వరరావు మటుకు ఏమంటాడు! తెల్లపోయిచూస్తూ కూర్చున్నాడు.

ఆయనేకాదు. అందరూకూడా నిశ్శబ్దంగా కూర్చున్నారు. ఒక చిన్నవాడు అల్లాగ వెక్కి వెక్కి ఏడుస్తూఉంటే ఎవరికి బుద్ధిపుడుతుంది కులాసాగా మాట్లాడుకోటానికి!

ఈశ్వరరావు తెల్లముఖంతో, భయంతో కూర్చోటం చూచి అంతా అనుకొన్నారు. 'వీడేదో అచే ఉంటాడు. లేకపోతే ఆ కుర్రవాడు ఎందుకు ఏడుస్తాడు!' అనే గ్రహింపు కల్గించింది తానేనని అంతా అనుకోటం ఈశ్వరరావుకు చిన్నతనంగానే ఉన్నది.

నాలుగు నిమిషాలు గడచిన తరువాత పంతులు కాస్త తెప్పరిల్లాడు. ఆయన ఏడ్పు ఆపటం చూచి ప్రక్కనే కూర్చున్న ముసలమ్మ అన్నది 'నాయనా ఎవరో చిన్నవాడవు. నీదుఃఖం చూస్తే నాకడుపు తరుక్కుపోతున్నది. ఏమిటి, నాయనా? ఎందుకూ ఏడుస్తావూ ?' అని ఆమె కళ్ళనీళ్ళుకూడా తుడుచుకొన్నది.

పంతులుబాబుకు నోటమాటరాలేదు. కళ్ళనిండా నీళ్ళు పెట్టుకున్నాడు. దుఃఖపూరితమైన గొంతులోనుంచి అతికష్టము మీద ఒక్కమాట పెగిలింది.. ఏడుస్తూనేఅన్నాడు 'నాభార్య చచ్చిపోతుంది.' ఇక ఆపైన ఒక్క ముక్కఅయినా అనలేక ఆ ముసలమ్మగారిని కౌగలించుకొని గొల్లు గొల్లున ఏడ్వటం మొదలుపెట్టాడు.

ముసలమ్మగారికీకూడా దుఃఖం ఆగలేదు. అకస్మాత్తుగా లభించిన ఈమనవణ్ణి కౌగలించుకొని 'ఊరుకో నాయనా' అమ్మాయికి జబ్బు ఎక్కువగా ఉందా ? ఫరవాలేదులే నాయనా. ఊరుకో, అని ఓదారుస్తూ, తానుకూడా పెద్దగానే ఏడ్చింది.

ఇల్లా ఓదార్పుమాటలు అంటూ ఉన్నప్పుడుమాత్రం కాస్త ఊరుకొని మళ్ళీ ఏదో జ్ఞాపకం రావటం, ఏడ్వవడం, ఇదీ అతని వరస!

ఈశ్వరరావు ప్రాణాలు ఎక్కడపోయినయ్యో! అతను ఎక్కడున్నాడో, ఏమి వింటున్నాడో, ఏమి చూస్తున్నాడో కూడా తెలిసికోలేని స్థితిలో ఉన్నాడు.

౪

ఆపెట్టెలో కూర్చున్న వాళ్ళందరికీ ఆకుర్రవాడు ఎందుకు అంతగా ఏడుస్తున్నాడో సరిగ్గా తెలియదు. మొదటబెంచీలో వాళ్లు ఆయనభార్యకు ప్రాణంమీదికి వచ్చిందని అనుకున్నారు. మూడోబెంచీలోవాళ్లు ఆమె పోవటానికి కారణాలు కూడా పోగుచేస్తున్నారు!

కొంతమందికి ఈశ్వరరావుపైన కోపంకూడా వచ్చింది. అతనివైపు కొరకొరచూశారు. ఈవెధవ కబురు ఇక్కడే ఇప్పుడే చెప్పకపోతేనేం! రైలుదిగిన తరువాత చెప్పకపోయినాడా అని వాళ్లనుకున్నారు.

ఈశ్వరరావుకూడా ఆ అబ్బాయి ఎందుకు ఏడుస్తున్నాడని కొంచెం ఆలోచించాడు. అతనికి ఒకవిధంగా తోచింది. అతని భార్యకు బహుశః చాలాజబ్బుగా ఉండిఉంటుంది. ఇంతకు పూర్వమే ఆయన ఈవిషయమై ఆలోచిస్తూ దిగులుపడి కూర్చునిఉంటాడు. మొదట్లో తన మాటవినకుండా పరధ్యాన్నంగా, దిగులుగా, ఉండటానికికూడా అదేకారణం అయి ఉండాలే!

నీ భార్యా, బిడ్డలు అన్నంలేక మాడి చచ్చిపోతారు అన్నాడే, ఆమాటలు, ఎందుకుఅన్నా అనసీ, ఏసందర్భంలో అన్నా అనసీ, అతన్నిమాత్రం చాలా కష్టపెట్టిఉంటవి. చాలా బాధకలిగిఉంటుంది. అతనికి ఇదివరకేఉన్న విచారానికి ఇది తోడుకాగా, అతడు దుఃఖాన్ని ఆపుకోలేకపోయి ఉంటాడు. ఏజెంటు మహాశయుడు తనకుఉన్న సైకో యనాలిసిస్ శాస్త్ర జ్ఞానం అంతా వినియోగించి, ఈనిశ్చయానికి వచ్చాడు.

ఇంతలో పంతులు కాస్త దారికొచ్చాడు. ఏడ్వటం మాని దిగులుగా కూర్చున్నాడు. దుఃఖం కాస్త తగ్గిందికదా అని ముసలమ్మగారు ఇట్లాఅన్నది. 'అట్లా ధైర్యంగాఉండు, నాయనా! ఏడిస్తే ఏమిలాభం?' ఆ కుర్రవాడు పిచ్చిచూపులు చూస్తూ ఊరుకొన్నాడు.

'వాళ్ళిద్దరూ బావమరదులేటమ్మా!' అని చివర బెంచీలో ఎవరో అన్నారు. వాళ్లకు ఈసంగతి ఎట్లా తెలిసిందో! ఎట్లాగు ఊహించారో మరి!

ముసలమ్మగారు ఇది నిజమో కాదో తెలుసుకొందామని అడిగింది 'ఏం నాయనా, అయితే ఆయన అక్కను నీకిచ్చారా, నీ అక్కను ఆయనకిచ్చారా?'

ఈమాటలు వినేసరికి ఈశ్వరరావుకు పైప్రాణాలు పైన పోయినయ్. ఆ అబ్బాయికీ తనకూకూడా బంధుత్వం కలుపుతున్నారు వీళ్ళంతా కలిసి! దీనికి సమాధానం ఆయనే చెబుతాడో, తననే చెప్పమంటారో, అని భయపడి చూస్తున్నాడు.

ఆ అబ్బాయి తలే ఊపాడో, చెయ్యే ఊపాడో, ఏమి చేశాడో, తెలియదు కాని, మొత్తంమీద అందరికీ ఇట్టే అర్థమైంది, వాళ్ళిద్దరూ బావమరుదులే నని!

ఇన్సూరెన్సు వ్యాపారం చేయటంలో ఇల్లాగ అనివార్యంగా క్రొత్తక్రొత్త బాంధవ్యాలు ఏర్పడుతాయని పాపం ఈశ్వరరావుకు తెలియదు. అందుచేతనే అతడు చాలా గాభరా పడుతూ, కూర్చున్నాడు.

౫

కొత్తగా ఏర్పడిన ఈ బాంధవ్యాన్ని సమన్వయపరచుకొంటూ ఈ ఏజెంటూ, ఆయనకెదురుగా ఆ పంతులూ కూర్చున్నారు. ముసలమ్మగారు మళ్ళీ అడిగింది 'నాయనా నీకేమన్నా బిడ్డలా?' అని.

పంతులు మాట్లాడకుండా ఒక వేలుఎత్తి చూపాడు. 'ఒక్కబిడ్డా నాయనా? చిన్నతనంలోనే బిడ్డ కలిగింది,' అంటూ ఆ అబ్బాయితల నిమిరింది. బిడ్డమాట ఎత్తేసరికి పంతులు, ఇందాకటికంటే కూడా పెద్దగా, భోరున ఏడ్వటం మొదలుపెట్టాడు.

ముసలమ్మగారు అన్నది. 'ఊరుకోవయ్యా ఆ బిడ్డను చూచుకొని అయినా బ్రతకాలా?' 'ఆ బిడ్డకూడా బ్రతకదు!'— అని అంటూ పంతులు ఏజెంటుగారి మెడను వాటేసుకొని భుజం మీద తలవాల్చి ఏకపటమే ఏడ్వటం!! ఎవ్వరు, ఏమి చెప్పినా వినక ఘోరంగా ఏడ్వటం సాగించాడు.

పంతులు తనను కౌగలించుకొని ఏడ్వటం తనకెంతో కష్టంగాఉన్నా, అక్కడున్న వాళ్ళెవ్వరికీ ఏమీ కష్టంగాలేదు.

బావమరిదిని కౌగలించుకొని ఏడ్వటంలో విపరీతం ఎవ్వరికీ కనపడలేదు. కాని తను కూడా ఏడ్వకపోవటమే అందరికీ బహుశః విచిత్రంగా ఉండిఉండాలె! ఎందుచేతనూ అంటే ఆ జబ్బుగానున్న మనిషి సాక్షాత్తు తన అక్కేనాయె!

తాను కఠిన హృదయుడని అప్పుడే అందరూ అనుకొంటున్నారు! కాదంటానికి తనకు ధైర్యం ఎప్పుడూ లేదు! చచ్చినట్లు, ఆ ఏడుస్తూ ఉన్న కుర్రాడు తన అక్క మొగుడని ఒప్పుకొంటానికి ఈశ్వరరావు నిశ్చయించుకొనే ఉన్నాడు కాని, తాను కూడా ఏడవవలసిన పరిస్థితి వస్తుందని అతడు ఎప్పుడూ ఊహించలేదు.

దీనిదుంపతెగ, ఈ ఇన్సూరెన్సు ఇంత అవస్థలోకి దింపుతుందని తెలిసినట్లయితే మొదట్లోనే తప్పుకొనేవాడు.

కాని ఇప్పుడేమిచేస్తాడు? ఏడవక తప్పిందికాదు. అక్క కూడా పోయిందాయె! ఏడవకుండా ఎల్లాగ! పంతులును కౌగలించుకొని తప్పనిసరిగా ఏడ్చాడు.

అయితే ఒక్కసంగతి: అది బొల్లిబొల్లి ఏడ్పుమటుకు కాదు. ఏజంటుగాడికి ఎందుకైనా కానీ, నిజమైన దుఃఖము వచ్చింది. హృదయపూర్వకంగా ఏడ్చాడు!

ఉన్నవాళ్ళంతా, 'ఊరుకోండి నాయనా ఊరుకోండి! ఎందుకు ఏడ్వటం! ఏమిలాభం! అయిపోయిందాయె!' అంటూ బావమరదుల నిద్దరినీ కూడా ఓదార్చారు. !

ముసలమ్మగారు ఈపర్యాయము ఈశ్వరరావును దగ్గరకు తీసుకొని తల నిమురుతూ, అన్నది. 'పిచ్చిపిల్లవాడా! నీవు కూడా ఏడిస్తే ఎల్లాగ? కాస్త ధైర్యంతెచ్చుకో! మీబావ

శ్రీ వేమన గ్రంథాలయము
తెలప్రోలు. (కృష్ణా)

దిగులుపడిపోయినాడు! ఆయనకు కాస్త ధైర్యంచెప్పాలిసింది పోయి ఏడిస్తే ఎల్లాగ చెప్పు !'

ఏజెంటు మహాశయుడు ముసలమ్మ మాటలు విని, ఏడ్వటం మానేశాడు.

పంతులుకూడా మానాడు కాని పూర్తిగా మానలేదు. కాసేపు ఊరుకొంటాడు. ఏదో జ్ఞాపకంవస్తుంది. మళ్లీ ఏడుస్తాడు. ఇదీ అతని వరుస!

దుఃఖంవచ్చినవాడు తాను ఒక్కడే, తన ఇష్టంవచ్చినట్లు ఏడవక ఏజెంటు మహాశయుని కౌగలించుకొని ఏడుస్తూఉండడం మూలాన, ఆయన ఏడ్చినప్పుడల్లా తానుకూడా ఏడ్వవలసిన అగత్యం కలగటమే ఈశ్వరరావుకు ఇప్పుడువచ్చిన క్రొత్త సంకటం!

దిగి పారిపోతే ఎల్లా ఉంటుందీ అని ఈశ్వరరావు ఆలోచించకపోలేదు. ఎట్లా దిగిపోవటం! అవతల బావను వదలి!

అంతగా మూర్ఛించిదిగితే, అంతా నీకేమైనా బుద్ధిఉందా లేదా? అని చీవాట్లు వేస్తారు. అంతటితో ఊరుకోరుకూడాను. అవతల ఆ అబ్బాయి కుళ్ళికుళ్ళి ఏడుస్తూంటే నీవు ఎట్లాగ వెడతావయ్యాఅని లాగి కూలేస్తారు! ఇంకా పెంకెతనంచేస్తే తలొక మొట్టికాయు మొట్టినా దిక్కులేదు. ఈశ్వరరావు ఈ విషయమై చాలా బాగా ఆలోచించే, దిగిపోవటానికి వీలులేదని నిశ్చయించుకొని అక్కడే కూర్చున్నాడు వీలైనప్పుడల్లా ఒకఏడుపు ఏడుస్తూ. స్టేషనులు వచ్చిపోతున్నయి. పంతులు ఎక్కడా దిగిపోవాలని ప్రయత్నం చేయటమేలేదు.

బెజవాడ దగ్గరలోకి వస్తున్నది. ఏదో ఒకస్టేషనులో బండి ఆగింది. ఆగే ఆగటంలోనే ఎవరో ఒకాయన వీళ్ళపెట్టె దగ్గరకువచ్చి, తొంగిచూచి, 'ఇక్కడున్నాడర్రా!' అని పెద్దకేక పెట్టాడు. మరుక్షణంలో ఒక ముసలాయనకూడా పరుగెత్తుకుంటూవచ్చి ఈ పెట్టెలోనే ఎక్కాడు.

ఆ వచ్చినవాళ్లు ఇద్దరూ పంతులుకు చెరోప్రక్కనా కూర్చున్నారు. ఒకాయన అన్నాడు. 'ఓరి నీ దుంపతెగ! నీకోసం వెదకలేక చస్తున్నాం, ప్రతిస్టేషనులోనూదిగి!' ఇంకో ఆయన 'ఇక్కడి కెప్పుడువచ్చావురా సన్యాసీ!' అన్నాడు.

వాళ్ళనుచూచి పంతులు మళ్ళీ ఏడ్పు సాగించాడు.

ముసలమ్మగారు అడిగింది, వాళ్ళల్లో ఒకాయనను, 'నాయనా, ఆ అబ్బాయి మీకేమౌతాడు?'

'మా అబ్బాయి' అన్నాడు ఆ ముసలాయన.

'ఆయనా?' అని రెండోవ్యక్తినిచూపి అడిగింది! 'వాడి మేనమామ!' అని జవాబు చెప్పాడు ఈ ముసలాయన.

ఈ జవాబులతో ముసలమ్మ తృప్తిపడి ఆ వచ్చిన వాళ్ళతో మళ్లీ అన్నది. 'ఇందాకటినుంచీ ఒక్కటే ఏడ్పు మేమెంతచెప్పినా వినటంలేదు. అబిడ్డను ఒంటరిగా వదిలేశారేం బాబూ?'

ఆ ముసలాయన పిల్లవాణ్ణి కసురుకుంటూ అడిగాడు 'ఎందుకురా ఏడ్పు!' పిల్లవాడు పాపం బిక్కముఖం పెట్టాడు.

ఈ బిక్కమొఖంజూచి ముసలమ్మ జాలిపడిఅన్నది 'కోప్పడబోకండి బాబుగారూ? ఏడ్పు అంటే ఏడ్పుగాక

ఏముంది! పాపం ఒక్క బిడ్డఆమెను! ఆబిడ్డకి ఇల్లాంటి ఇబ్బంది వచ్చిందేనని తల్చుకొని ఏడుస్తున్నాడు. చిన్న వయస్సుఆమె! మనసుమల్లె డక్కా ముక్కలు తిన్నాడా ఏమన్నానా ?'

ఆ ముసలాయన ముసలమ్మవంక విపరీతంగాచూచి 'వాడికి కూతురెక్కడిదమ్మా' అన్నాడు విసుగ్గా.

'లేదూ? . అయితేపాపం, భార్య చావుకే కాబోలు ఏడుస్తున్నాడు' అన్నది ముసలమ్మ మళ్లీ.

'ఛా ఛా ఏమిటమ్మా నీమాటలు !. భార్య పోవటం ఏమిటి ?'

'ఆ అబ్బాయి తన భార్య పోయిందనేగా ఇందాకటి నుంచీ ఏడుస్తూవుంటా ?'

'ఛా, ఛా ఏమిటమ్మా అసహ్యపుమాటలు ! వాడికింకా పెండ్లికాందే !' అన్నాడు ఆ అబ్బాయి మేనమామ.

పెండ్లికాకపోతే, ఈశ్వరరావు అక్క మొగడెట్లా అయి నాడు ! ఈశ్వరరావు కూడా ఎందుకు ఏడ్చాడు ? ఈ ప్రశ్నలకు సమాధానం ఏదొంటుగానే చెప్పాలిసి ఉంది. అంతా ఆయన వంక వింతగా చూస్తున్నారు.

ఈశ్వరరావు చాలా చిక్కులో పడిపోయినాడు. ఇంత దరిద్రపు అవస్థలో అతడు ఎప్పుడూ పడలేదు. ఇప్పుడు తాను ఎవరని చెప్పాలె ! ఎందుకు ఏడ్చినట్లు !!

జరిగినవిషయమంతా పూసగుచ్చినట్లు చెప్పితే, అంతా నవ్వుతారు. హేళనచేస్తారు. చాలా అవమానం జరుగుతుంది. వాళ్లు ఒకసారినవ్వి ఊరుకోరు. తనపేరూ, తన ఇంటిపేరూకూడా అడిగి తెలుసుకొని అందరికీకూడా చెబుతారు. ఊరంతా తెలు

మ్తుంది. ఊరూర చెప్పుకొంటారు ఫలాని ఇన్సూరెన్సు ఏజెంటుఅని ఇల్లాగ జరిగిందీ అని !

ఇంతగొడవ జరుగుతుంది! కాబట్టి ఏంచెయ్యాలె? ఒక్కక్షణం ఆలోచనలో పడ్డాడు.

ఈశ్వరరావు ఇట్లా అనుకొంటూ ఉండగానే ముసలమ్మ మళ్ళీ అడిగింది. 'అయితే, పెళ్ళామూలేను, బిడ్డాలేదు గదా ఎందుకుబాబూ మరి అల్లాగ ఒక్కతీరున ఏడ్చాడు'

ముసలాయన చీదరింపుగా అన్నాడు. 'వీడు ఏడ్వటానికి ఏంలే! వీడికి ఏదో గుబులు.'

పిల్లవాడి మేనమామ అన్నాడు: 'వాడికి నెలరోజుల నుంచీ వంట్లో ఏమీ బాగుండటం లేదమ్మా...ఏదో ఒకరకం పిచ్చిపట్టుకొంది: కూర్చుంటే ఎవ్వరితోనూ మాట్లాడకుండా గంటలకొద్దీ కూర్చుంటాడు. లేకపోతే ఎవ్వరినైనా కోప్పడ్డా వాడికి కష్టంకలిగేమాట అన్నా, ఏడుస్తాడు. వాణ్ణి విశాఖపట్నం తీసికెడుతున్నాము, మందు ఇప్పించటానికి!'

పంతులు ఈ మాటలు విని అప్పటికి నోరువిప్పి మాట్లాడాడు. 'పిచ్చి ఏమిటి నాన్నా! నేను ఎందుకు ఏడ్చానంటే, నాకు పెళ్ళిఅయినాగూడా, నాపెళ్ళాం చచ్చిపోతుందనీ, నాకు బిడ్డపుట్టినా తరువాత అదీగూడా పోతుందనీ ఈయన చెప్పాడు!'

అంతాగూడా ఈశ్వరరావువంక విపరీతంగా చూశారు, ఎందుకు అల్లాటి అభాగ్యపు మాటలు చెప్పాడా అని ఆశ్చర్యపోతూ!

'నేనుకూడా పోతానుట నాన్నా! ఈ రైలు విరిగో, వంతెనమీదినుంచి రైలుబండి పడిపోయో, నామీదుగా ఒక

కారుపోయో, నా మీాద ఒక ఎద్దుబండి విరిగో నేనుపోవటం నిశ్చయమేనట నాన్నా, అని మళ్ళీ ఏడ్చాడు ఆ పిల్లవాడు.

ఈశ్వరరావు ప్రాణాలు పైనే ఎగిరి పోతున్నాయ్. ఏమి జబాబు చెప్పగలడు, ఎందుకు అల్లాంటిమాటలు అన్నావంటే?

శివ, శివ! ఈశ్వరరావు మనస్సులో పడుతున్న బాధ ఇంతా అంతా కాదు.

ముసలమ్మ అన్నది ఈశ్వరరావును చూస్తూ 'నీకేం పొయ్యేకాలంరా పాపం, పసిబిడ్డను పట్టుకొని అప్రాచ్యపు కూత లన్నీ కూశావు!'

ఒకాయన అన్నాడు. 'అక్కయ్య చచ్చిపోయిందని ఏడ్చావు! అదేమిటి?'

అందరూ తనవైపే చూస్తున్నారు. ఇక లాభంలేదని బండి ఇంకా బాగా ఆగకమునుపే, ఈశ్వరరావు బెజవాడ ప్లాట్ ఫారంమీాదికి దూకి, మహాజనంలో కనపడకుండా కలిసి పోయినాడు.

ముసలమ్మా, ఆ పెట్టెలోఉన్న ఇతర పెద్దమనుష్యులూ అంతాగూడా అతనికి గూడా 'పిచ్చి'—అని నిర్ణయించారు.

పరిచయుడు

ఆనాడు నేను చాలా పెందలాడే ఇంటిదగ్గరనుంచి బయలు దేరి కాఫీహోటలుకు వెళ్లాను. ఇంకా నేను ఏమీ పుచ్చుకోలేదు. ఇంతలోకే 'ఏమోయ్, ఇక్కడున్నావా? చాలా మారి పోయినావే!' అంటూ ఎవరో ఒకాయన నన్ను పలుకరించాడు.

నేను ఆయన ముఖంవంక తేరిపార జూశాను. ఎవరో పోల్చుకోలేకపోయినాను. ఖద్దరుబట్టలు కట్టుకొన్నాడు. చామన చాయ. దృఢంగా ఉన్నాడు. మీసంపుటుకు కాస్త నెరిసింది. చూడటంతోటే ఆయన చదువుకొన్నవాడని, చాలా పెద్ద మనిషి అని అభిప్రాయం కలుగుతుంది ఎవరికైనా.

ఆయన ఎవరైందీ నాకు జ్ఞాపకంరాలేదు ఎంత ప్రయత్నించినా. ఎవరో చిన్ననాటి స్నేహితుడు అయిఉంటాడు అనుకొన్నాను. బహుశః నాసహాధ్యాయి అయిఉంటాడు. లేకపోతే అంత చనువుగా ఏమోయ్ అని సంబోధిస్తాడా? మరచి పోయి ఉంటాను. నేను కాలేజీవదలి ఇప్పటికి ఇరవై అయి దేండ్లు అయింవాయె!

అయితే ఆయనను చిన్నప్పుడు చూచినట్లు అయినా లేదు. బొత్తిగా క్రొత్తముఖంలాగు ఉంది. అయినా తెలివి తక్కువగా ఎవరండీ మీరు, అని అడగటం నాకు ఇష్టం లేక పోయింది. ఆయన ఎవరైందీ మెల్లగా నేర్పుగా ఆయన నోటి

వెంటనే రాబట్టాలెనని నిశ్చయించాను. ఉపాధ్యాయుడైన వాడికి ఈనేర్పు కాస్త ఉంటుంది ప్రశ్నలువేసి కావలసిన జవాబు రాబట్టటం.

కాసేపు ఏదో జ్ఞాపకం తెచ్చుకొంటున్నట్లు నటించి చివరకు ఈప్రశ్న వేశాను. 'మనం క్రిందటి తఫా ఎక్కడ కలుసుకొన్నామోయ్ ?'

ఆయన విరగబడనవ్వి 'అరె! నీకు ఇంతమాత్రం జ్ఞాపకం లేదురా ?' అన్నాడు.

ఆమాత్రం ఏమిటి, అసలు ఏమాత్రం జ్ఞాపకంలేదాయె నాకు! అందుకని నేను ఏదో పెద్దతప్పు జేసినవాడిలాగ బిక్కముఖం పెట్టి చూశాను.

ఆ పెద్దమనిషికి నామీద చాలా జాలికలిగి ఉంటుంది. ఎందుకంటే ఆయన వెంటనే నామీదపైన లక్ష్మి మధురమైన కంఠంతో అడిగాడు మళ్ళీ 'ఒరే, బాబూ నేనెవరో అసలు నీకు జ్ఞాపకం ఉందా !' అని.

నిజానికి ఏమీ జ్ఞాపకంలేదు. ఐనా నేను వెకిలిగా నవ్వి 'ఎంతమాట! అసలు జ్ఞాపకం లేకపోవటం ఏమికర్మం గాని—' అని, ఇంకా ఏమో అనబోయి ఊరుకొని సందేహంగా ఆయన వంక చూశాను నవ్వుతూ.

బాబూ నీవు ఎవరో నాకు జ్ఞాపకంలేదు అని ఒక్కమాట అంటె ఏబాధా ఉండదు. కాని అల్లా అనటం అవినయమని మన అభిప్రాయం. అందుకని మనము వినయాన్ని ప్రకటించటానికిపడే బాధలు ఇన్నీ ఇన్నీ కావు.

నా మరుపూ, నా అనుమానమూ అన్నీ నాముఖంలో

ఆయనకు కనపడేఉంటవి. నా అవస్థఅంతా ఆయన గ్రహించాడు. గ్రహించి నేను రామారావునురా అని స్పష్టంగా చెప్పేశాడు.

కాని ఆయన ఏ రామారావో ఏటుటో నాకు జ్ఞాపకము రాలేదు. నా చూపుల్లో అసంగతికూడా ఆయన పట్టేసి, వెంటనే తన ఇంటిపేరు చెప్పాడు. అప్పటికీ నాకు జ్ఞాపకమురాలేదు. చివరకు ఆయన ముఖం చిట్లించి విసుగ్గా అన్నాడు. 'నేను సుబ్బారావు తమ్ముణ్ణిరా !' అని. అప్పటికీ నాకు గుర్తుకు రాలేదు.

కాని ఇంకా నేను జ్ఞాపకములేనట్లు చూస్తినా, నేను వట్టి తెలివితక్కువవాణ్ణేకాక ఒక విధంగా సామాన్య మానవత్వాన్ని పోగొట్టుకొన్నవాడిని అవుతానని తోచింది.

అందుకని ఇక లాభంలేదని అప్పటికి చటుక్కున జ్ఞాపకం వచ్చిన వాడిలాగ వెర్రిగాచూచి, ఇంతసేపూ ఇంత చిన్నవిషయం స్ఫురణకు రానందుకు సిగ్గుపడ్డట్టు నటించి, అప్పటికైనా దాని ధర్మమా అంటూ జ్ఞాపకం వచ్చినందుకు అపరిమితమైన సంతోషాన్ని పైకి ఆర్భాటంగా చూపిస్తూ చివరకు తెములుచ్చుకొని ఇల్లాగ అన్నాను. 'అరె! నీవురా ! నేను ఎవరో అనుకొంటు న్నాను ! సుబ్బారావు తమ్ముణ్ణి అని మొదట్లో చెప్పినట్లు అయితే ఎంత బాగుండేది ! ఎంత అల్లరి పెట్టావురా ! కూర్చో, కూర్చో.'

ఈ మాటలువిని ఆయనబాగా తృప్తిపడ్డట్లు మృదువుగా నవ్వాడు. ఏదోవిధంగా ఈవిచిత్ర సంఘటనలోనుంచి బైట పడ్డందుకు నేనూ సంతోషించి ఆయనను స్నేహపురస్సరంగా కౌగిలించుకొని కూర్చోబెట్టి కాఫీ తెప్పించి ఇచ్చాను. ఆయన నా ముఖం వంకచూస్తూ తన హృదయంలోని ప్రేమను వెచ్చ వెచ్చని కాఫీతో దోహదం చేయటం సాగించాడు.

పెద్ద గాలిదుమారంలో చిక్కుకొని నానా అవస్థపడి బైట పడ్డంత పని అయింది. ఎదుట కనపడుతున్న ఈ మనిషి ఎవరైందీ తెలియక నేను సతమతం అవుతూఉంటే పైగా ఆ అప్రత్యక్ష వ్యక్తి సుబ్బారావు ఒకడు తయారైనాడు.

సుబ్బారావు నాకు ఏదో మహా ఆప్త మిత్రుడైనట్లు నటించి, ఇప్పుడు అతని క్షేమసమాచారం అడగకుండా ఎల్లాగ ఉంటాను. అందుకనిసుబ్బారావు కులాసాగాఉన్నాడాఅనిఅడిగాను.

ఆయనగారు బిక్క ముఖంపెట్టి 'బాగానే ఉన్నాడు, కాని ఈ మధ్యనే వాడిభార్య పోయింది' అన్నాడు.

ఇప్పటిదాక కొత్తచిక్కు వచ్చిపడ్డది. ఆ సుబ్బారావుభార్య మరణంకోసం నేను విచారం నటించాలె. స్నేహితుడి భార్య పోయిన సంగతి హఠాత్తుగా విన్నప్పుడు ఎంత గాబరాపడి, బిక్క ముఖంపెట్టి విచారపడాలో అంతా పడ్డాను. మరి తప్పిందికాదు.

కాని ఆ సుబ్బారావు ఎవరో నాకు అప్పటికీ జ్ఞాపకము రాలేదు. ఊహా మాత్రంచేత ఆప్తమిత్రుడైన ఆ వ్యక్తికోసం, అంతెకంటే తెలియని ఆయనభార్య మరణంకోసం చచ్చినట్లు విధిగా ఆవేదన పడ్డాను.

కాని ఇదొక విధంగా లాభించింది. ఎందుకంటే ఆ తరువాత నేను ఏమీ మాట్లాడకపోయినా ఆయన ఏమీ అనుకోడు. ఆ విచారకరమైన వార్త విన్నమీదట దుఃఖభారంతో మౌనము వహించానని ఆయన అనుకొంటాడు. నేను తదనుగుణ్యంగానే ప్రవర్తించాను. దిగులు ముఖంపెట్టి కప్పులో కాఫీ కొద్ది కొద్దిగా తాగుతూ మధ్యమధ్య ఆయనవంక చూస్తూ కూర్చున్నాను. ఆయనా నాలాగేచూస్తూ కూర్చున్నాడు.

ఈ యుగితక్షణాలు గడపటం చాలా కష్టమైనది. ఆయననుకూడా ఒక కుశలప్రశ్న వేయాలె. వెయ్యకపోతే మర్యాదగా ఉండదు. అందుకని ఆయనవంక తిరిగి 'నీవూ పిల్లలూ కులాసాగా ఉన్నారా' అన్నాను.

ఈ ప్రశ్నవిని ఆయనొక చూపుచూశాడు. గుండెల్లోకి దూసుకుపోయింది ఆచూపు. గుండె దడదడ లాడింది. మళ్ళీ ఇంకో దుఃఖవార్త చెప్పేలాగున్నాడు. చెప్పాడో, నేనొక నాటకము ఆడాలె. ఏమిరా కర్మము అని దిగులుపడ్డాను.

కాని ఆయన ధర్మనూ అంటూ నాకేమీ దుఃఖవార్త చెప్పలేదు కాని, ఒక నీచమైన వస్తువును, నికృష్టమైన జీవిని, ఉన్మత్తుని, చూస్తున్నట్లు జాలిగా చూశాడు.

'నిజమేరా బాబూ, జ్ఞాపకశక్తి బొత్తుగా నశించింది. వృద్ధాప్యంవల్లకావచ్చు. లేక జీవితంలోపడ్డ కష్టాలవల్లకావచ్చు.' అన్నాను నేను.

'నీముఖం' అయితేమటుకు ఇంత అన్యాయమా! మనం నాలుగేండ్ల క్రితం మద్రాసులో తిరువళ్ళిక్కేణిలో కలిశాము.' అని నాముఖంలో మార్పును గమనించటానికి కొమూలు కాస్త ఆగాడు.

నేను ముఖంలో ఏవిధమైన మార్పూ చూపించలేకపోయినమాట నిజము. సంవత్సరానికి ఒకటి రెండుసార్లు ఏదో పనిమీద మద్రాసు వెళుతూఉంటాను. అల్లాంటి సమయములో ఆయనను కలిస్తే కలిసే ఉండవచ్చు కాని ఏమీ జ్ఞాపకం వచ్చి చావందే! కళ్లు ఒప్పజెప్పి ఊరుకొన్నాను.

ఆయనకు నాపై జాలికలిగి మళ్ళీ ఇల్లా అన్నాడు. 'మనము అప్పుడు బీచ్ దగ్గర కలుసుకొన్నాము. అప్పుడే చెప్పాను. నేను, పెండ్లిచేసుకోలేదని. ఈ జన్మకు బ్రహ్మచారిగానే ఉండి పోవాలని నిశ్చయించుకొన్నాను.'

నేను అప్పుడు – 'ఓహో అవును. నిజమే ఇప్పుడు జ్ఞాపకం వచ్చింది.' అని అనాలె నిజానికి కానీ ఏమీ అనక ఊరకొన్నాను. నేను నాబలహీనతకూ జ్ఞాపకశక్తి పోగొట్టుకొన్నందుకూ సిగ్గుపడి ఆయనను క్షమించమని ప్రార్థేయపడ్డాను.

ఇంతకూ నాకు జ్ఞాపకశక్తి పోయినమాటనిజము. ఆయన బ్రహ్మచర్యవ్రత నిష్ఠాగరిష్ఠుడు కాబట్టి, ఆయన జ్ఞాపకశక్తి అంత పటుత్వముగా ఉంది అని అనుకొని నాకు నేను సమాధానము చెప్పుకొని, ఆయనను లోలోపల మెచ్చుకున్నాను.

అప్పటికే మేము ఇద్దరంకూడా వేడికాఫీని గుటకలు గుట గుటకలుగా తాగేశాము. చెరో సిగిరెట్టు వెలిగించాము. ధూమఖండాలు మేఘదూతలై మా యిద్దరిమధ్యా, రాయబారాలు జరిపినై. నన్ను అతడు మనఃపూర్వకముగా క్షమించాడు. అతని చిరునవ్వు మెలికల్లో మా సంధిషరతులు గొలుసుకట్టు అక్షరాలతో లిఖితరూపాన్ని పొందినవి. ఆ తరువాత నిశ్శబ్దత బరువైంది.

కొంచెముసేపు అయిన తరువాత ఆయన నా క్షేమ సమాచారాన్ని గురించి అడగటము మొదలుపెట్టాడు. నాకు అపుడు ఒకటి తోచింది. ఏమిటి అంటే:–

మద్రాసులో మేము ఇద్దరము కలిశాము అంటున్నాడు. ఆ సందర్భంలో నా సంగతిఅంతా ఆయనకు చెప్పే ఉంటాను

గదా! చెప్పిన సంగతులన్నీ జ్ఞాపకం ఉంచుకొన్నాడో లేదో ఇప్పుడు తెలుస్తుంది. ఆయన జ్ఞాపకశక్తి అంతంత మాత్రమేనని తెలిసిందా నీకుమటుకు ఏమి జ్ఞాపకం ఉండి ఏడ్చింది, అని ముఖం వాచేటట్లు చీవాట్లు వేద్దామని సంకల్పించుకొని కూర్చున్నాను.

'నీకు క్రాఫింగు పూర్వము ఇంతకంటే పెద్దదిగా ఉండేది కదూ?'

ఇది ఆయనగారి మొదటి ప్రశ్న! 'చాల్లే, నా క్రాపింగు ఎప్పుడూ ఇల్లాగే ఉంది' అని అంటానికి వీలులేదు. పట్టుకొని ఝూడించటానికి అవకాశం ఇచ్చే ప్రశ్న కాదు అది. ఎందుకంటే క్రాపింగ్ కాస్త పెరిగిఉన్నదేమో ఆయనగారు చూచినప్పుడు! ఈ సిల్లీప్రశ్న వేశాడేమా అని మనస్సులో కించపడి 'అవును' అని ఊరుకొన్నాను.

నేను అవును అనేసరికి అయన ఫక్కున నవ్వాడు.

'నువ్వు అంతా మారిపోయినావు. చిన్నప్పుడు నీవు దృఢంగా ఆరోగ్యముగా ఉండేవాడివి' అన్నాడు.

ఇదికూడా కాదంటానికి వీలులేని ప్రశ్న. ప్రతివాడూ చిన్నతనములో దృఢంగా ఉంటాడు. ఆ ఏడుకాయేడు పైన బడ్డకొద్దీ బలహీనుడు కావటం సహజం.

అందుకని అవునన్నట్లు తల ఊపి ఊరుకొన్నాను నేను.

ఆయన మళ్లీ ఫెళ్ళున నవ్వాడు.

ఒక్కనిమిషం ఆగి 'నీవు పూర్వంకంటే చాలా నల్ల బడ్డావు' అన్నాడు. ఈమాటలు అన్నపద్ధతిలో; 'నీవు నన్ను కాదనలేవు. నేను ఏమన్నా నీవు చచ్చినట్లు అంగీకరించాలిసిందే' అన్న ధ్వని ఉన్నది.

అయినా నేను 'నేను ఒకప్పుడు తెల్లగా ఉన్నానా?' అన్నాను నవ్వుతూ.

ఆయన గట్టిగానవ్వి, అన్నాడు.

'అల్లాగ కాదు. పూర్వము నీ దేహము చామన చాయలో మెఱుస్తూ ఉండేది. ఇప్పుడు బాగా నల్లబడ్డావు.'

సత్యమో అసత్యమో ప్రియమైన మాటఅన్నాడు. నేను ఒకప్పుడైనా అందముగా ఉండేవాడిననీ అనుకోడము నాకు ఇష్టమే! కాబట్టి గట్టిగా కాదని అనలేకపోయినాను.

వీడి తెలివి తేటలకు సంతోషించి, తెల్లబోయి చూస్తూ ఊరుకొన్నాను.

వాడువేసిన ప్రశ్నలలో ఒక్కటీ వాడి స్మృతిదార్ఢ్యాన్ని పట్టి ఇచ్చిందిలేదు. ఎదురుతిరిగి అనటానికి ఎక్కడా అవకాశము చిక్కలేదు. అంపశయ్య, యుద్ధములో పరాజయము పొందిన ప్రతిపక్షపతిలాగ, శత్రువును సమయముచూచి దెబ్బ కొట్టాలన్న నిశ్చయంతో మౌనము వహించి ఊరుకొన్నాను.

ఆయనకు నాపై జాలి కలిగింది. ప్రేమతో, జాలితో, నా వీపుపైన తట్టి ఆయన ఇల్లాగ అన్నాడు ఆఖరుకు.

'ఒరేయ్, నీ జుట్టు మారిపోయినది! కట్టు మారిపోయినది! రంగు మారిపోయినది! ఇంకొక్కమాట చెప్పనా! నీ మాటకూడా మారిపోయినదిరా, రంగారావ్రా!' అన్నాడు.

రంగారావ్రా అన్న సంబోధనవిని తెల్లబోయినాను.

వీడి దుంపతెగా! వీడెవడో నన్ను రంగారావు అని పిలుస్తున్నాడు! నన్ను ఎవరో అనుకొంటున్నాడు!

వీడికేదో జ్ఞాపకశక్తి ఉందనీ, నాకు లేకపోయిందనీ సిగ్గు పడి చచ్చాను.

ఇందాకటినుంచీ, వెధవ ప్రశ్నలన్నీవేసి చిక్కకుండా మాట్లాడాడు, సన్యాసి: చివరకు చిక్కాడురా మిడతంబొట్లూ! చచ్చేట్లు దెబ్బకొట్టాలె. తీవ్రమైన ఎదురు దాడి సాగించాలె అని నిశ్చయించుకొని 'నాపేరు రంగారావు కాదు!' అని గట్టిగా అని పకపక నవ్వాను.

రామారావుకు ఇది ఎలక్ట్రిక్ షాక్ లాగ తగిలి, ఆయన 'థాం' అని చావాలిసింది.

తనకేమో, అపూర్వమైన మేధాశక్తి ఉన్నదని అనుకొన్న ఆవ్యక్తికి ఇది అశనిపాతముకాక ఏంచేస్తుంది!

నేను అనుకొన్నట్లు వాడు విరిగి క్రిందపడనూ లేదూ, చావనూలేదు. ఒక్కసారి క్షణమాత్రం తెల్లపోయి, నామాటలు విని ఎంతో ఆశ్చర్యపోయిన వాడిలాగ నటిస్తూ అన్నాడు.

'అరె! అన్నీ మార్చుకున్నావు సరే పేరుకూడా ఎప్పుడు మార్చుకొన్నావురా?' అని వీపుపైన గట్టిగాచరిచి, నేను పేరు మార్చుకొన్నమాట సత్యమే అయినట్లు నేనుచేసిన ఆవెధవ దొంగ పనికి తాను ఉదారభావముతో క్షమిస్తున్నట్లు చూపులవల్ల తెలియజెప్పి, 'అదుగో బస్ వస్తున్నది వెడతాను' అని చెప్పి, పెద్దపెద్ద అంగలు వేసుకొంటూ నడిచిపోయినాడు రామారావు.

రామారావు ఎవరైనది నాకు ఇప్పటికీ తెలియలేదు. ఆయన అన్నమాట నన్ను నిశ్చేష్టుణ్ణిచేసింది. ఆయన ఎటు వెళ్ళిందికూడా నేను చూడలేదు. తలొంచుకొని ఊరుకొన్నాను. ఎవరా ఈవిచిత్రవ్యక్తి అని ఆలోచిస్తూ అల్లాగే కూర్చున్నాను.

అతడు నాకు చిరపరిచితుడూ, ప్రాణమిత్రుడూ అని నేను అనుకొన్నానుకదూ, అందుకని నేనూ అతడూ కలిసి ఏవేవో తీపి వస్తువ్రులూ అవీ తినేశాము. బిల్ ఎంత అయి ఉంటుందా అని ఆలోచించి అడిగాను ఆ కుర్రవాడిని. వాడు రూపాయి అని చెప్పి వెళ్ళిపోయినాడు.

రూపాయి అయింది అనేసరికి గుండెకొట్టుకొంది. అందులో అధము అర్థరూపాయి అయినా ఆయనతినేసి ఉంటాడు, అమిత్రుడు !

రామారావు టిఫిన్‌కోసము తయారైన మిత్రుడన్న మాట ! ఆవిచిత్రవ్యక్తి చాలాతెలివిగా ప్రవర్తించినా చివరకు మోసముచేసిపోయినాడు. ఛీ ఎంతనీచమైనపని చేశాడా అర్థ రూపాయిడబ్బులకోసము అని అనుకొన్నాను. తన తెలివినంతా నీచమైనపనికై వెచ్చించిన ఆవ్యక్తిపై నాకు పరమ అసహ్యం కలిగింది.

అప్పటికి చాలాసేపుఅయింది ఆయనవెళ్ళిపోయి. నేను లేచి మెల్లగా మేనేజర్ ఉన్న బల్లదగ్గరకువెళ్ళి జేబులోనుంచి రూపాయినోటుతీసి, ఆయనకిచ్చాను రూపాయి అయిందే అని విచారపడుతూ.

ఆయన ఆనోటుతిరిగి నాచేతికి ఇచ్చి మీమిత్రుడు చెల్లించి పోయినాడండి అన్నాడు.

మళ్లీ నిర్ఘాంతపోయినాను. ఇది మరీచిత్రంగాఉంది !!

నిజం నిజం!

పొద్దున ఎనిమిదిగంటలైంది. మా ఆవిడ ఇచ్చిన వెచ్చని కాఫీ త్రాగుతూ గదిలో కూర్చుని ఆవిడతో మాట్లాడుతున్నాను. ఆవిడ ఏదో తమాషా అయిన మాటలు చెపుతున్నది. వింటూ వింటూ చటుక్కున ఆమె బుగ్గపై చెయ్యి వేశాను. ఆమె ఎవరైనా ఉన్నారేమోనని గిరుక్కున తిరిగి చూసేసరికి మా సీను వెనకాల నుంచుని ఉన్నాడు.

సీను చిన్నవాడే, అయినా ఆవిడ సిగ్గుపడి అక్కడనుంచి వెళ్ళిపోయింది. సీను ఎర్రటి నిక్కరు తొడుక్కున్నాడు. తెల్లటి షర్టు నిక్కరులోకి దోపి పైన బెల్టుపెట్టి టీక్‌గా నుంచున్నాడు. వాడిని చూస్తే ముద్దొచ్చింది.

'ఏం కావాలెరా సీనూ?' అని అడిగాను.

'ఈ సెలవలు నాలుగు రోజులూ ఇంటిదగ్గర ఉండివస్తాను మామయ్యా' అన్నాడు.

'మళ్ళీ ఎందుకురా వెళ్ళటం?' అన్నాను. సీను బిక్కముఖంతో అక్కడే నుంచుని ఉన్నాడు.

'సీను అంటే ఎవరో కాదు. మా రంగయ్య కొడుకు. బంధుత్వం ఎల్లాగున్నా రంగయ్యా నేనూ చిన్నప్పటినుండీ స్నేహితులము. అందుకనే వాడు తన కుర్రవాణ్ణి నాదగ్గర వదలిపెట్టి కాస్త కనిపెట్టి చూస్తూవుండరా అని చెప్పివెళ్ళాడు. కుర్రవాడు నాదగ్గరవుంటే వాడికో ముక్క వస్తుందనీ, మంచి బుద్ధిమంతుడు అవుతాడని వాడి వుద్దేశం.

నేను నీనుకోసం పడుతున్న బాధ అయినా ఏమీలేదు. కాకపోతే ఎప్పుడైనా వాడు ఇంటికి ఆలస్యంగా ప్రొద్దుపోయి వస్తే కోప్పడటం. వేళకు భోజనంచేస్తున్నదీ లేనిదీ కనుక్కోటం. ఇవీ వాణ్ణిగురించి నాకుగల బాధ్యతలు.

మధ్యమధ్య వీడు ఏవో కుర్రతనపు చేష్టలు చేస్తుంటాడు. ఎంతజాగ్రత్తగా కనిపెట్టి చూస్తూఉన్నా! మొన్న దసరా సెలవలకు ఇంటికి వెళ్ళాడు. వెళ్ళినవాడు స్కూలు తెరవటంతోనే రాక నాలుగురోజులు ఆలస్యంగా వచ్చాడు. ఎందుకురా ఇంత ఆలస్యంగా వచ్చావురా అని అడిగితే. 'నాన్న ఉండమన్నాడు మాస్టారు' అన్నాడు. సెలవుచీటీ తెచ్చావురా అంటే తెచ్చాను గాని ఎక్కడో పారవేశానన్నాడు. నిజమో అబద్ధమో చెప్పలేను గాని మొత్తంమీద వాడేవో అబద్ధాలు ఆడుతున్నాడని మాత్రం నాకు అనుమానంకలిగింది.

చదువు వస్తేవస్తుంది లేకపోతేలేదు. కుర్రవాడి ప్రవర్తన బాగుపడాలె. అదీనా ఉద్దేశం. అందుచేతనే ఈచిన్నతనంలోనే నీనును కాస్త మంచిమార్గాన పెట్టాలని నేను ఆలోచిస్తున్నాను. ఈనాలుగురోజులూ ఇంటిదగ్గర ఉండివస్తానని నీను అడిగితే నేను వెంటనే ఒప్పుకోనిది అందుకనే!

'ఎందుకురా నీనూ, ఇప్పుడు నీవు మళ్ళీఇంటికివెళ్ళటం? మొన్ననేకదా వెళ్ళివచ్చావు! ఇంతలోనే ఏమి తొందర? హాయిగా ఇక్కడేవుండి చక్కగా చదువుకో, పరీక్షలుకూడా దగ్గరకువస్తున్నవి.' అన్నాను.

నీను బిక్కముఖంపెట్టి 'మానాన్న తప్పక రమ్మన్నాడు' అన్నాడు.

నాకు ఏమిచెప్పాలిసింది తోచలేదు. 'సరే అంత అవసరం అయితే వెళ్ళొద్దుగానిలే' అని అప్పటికి వాణ్ణి పంపివేశాను.

వాళ్ళ నాన్న నిజంగా రమ్మన్నాడేమో! పోవద్దని వాణ్ణి నిర్బంధించటం మంచిదిగాదు అనుకొని 'సరే పో' అని అందామనే అనుకొన్నాను.

తమాషాగా ఆరోజు సాయంత్రమే బజారులో హఠాత్తుగ మా రంగయ్య కనపడ్డాడు. ఆయన ఏదో తొందర పని మీద బెజవాడ వెడుతున్నాడు. మేమిద్దరం కొంచెమునేపే మాట్లాడాము. పిల్లవాడి చదువు సంగతి అదీ వచ్చింది. చదువు ఎల్లాఉన్నా కుర్రవాడు చెడ్డ సహవాసాలు చేస్తున్నట్లు నాకు అనుమానంగా ఉందనికూడా చెప్పాను.

ఆయన నా చెయ్యి పట్టుకొని ''కుర్రవాడిని బాగుచేసే బాధ్యత నీదిరా అబ్బాయి. మరి నీయింట్లో ఉంచింది ఎందుకూ! కాస్త మంచీ చెడ్డా చూస్తావనికాదూ! వాడిని ఒకదారిని పెట్టాలె నీవు. పన్నెండేళ్ల వెధవ. ఇప్పుడే నీవు వాడిని సన్మార్గంలోకి దింపు. అంతా నీదే భారం' అంటూ బస్సు ఎక్కాడు.

'అయితే చూడూ, స్కూలు మళ్ళీ నాలుగు రోజులు మూస్తారు. ఈ నాలుగు రోజులు ఇక్కడేఉండి చదువుకోరా అంటే, నాన్న రమ్మన్నాడంటాడు. నిజంగా రమ్మన్నావా ?'

'వద్దది! దొంగ! నేను రమ్మనలేదు. రానక్కరలేదు. ఇక్కడేఉండి చదువుకోమను' అని చెప్తూ ఉండంగానే కారు బయలుదేరి వెళ్ళిపోయింది.

ఒక్క విషయంమటుకు తేలిపోయింది. నీను అబద్ధం ఆడాడు. రేపు ఇంకా ఎన్నిఅయినా ఆడుతాడు! దాని తరు

వాత దొంగతనాలు నేర్చుకొంటాడు! ఇక ఆపైన స్కూలు ఎగగొట్టి ఎందుకూ పనికిరాకుండా పాడైపోతాడు. ఏదో శాస్త్ర గట్టి ఏర్పాటు చెయ్యాలె. చెయ్యి చేసుకోవలసిన అవసరం ఉండదనుకొంటాను. సీను ఇంకా భయభక్తులలోనే ఉన్నాడు. ఈతభాను గట్టిగా చీవాట్లు వేస్తే చాలుననుకొన్నాను.

నేను ఇంటికి వెళ్ళటంతోనే, 'ఒరే, సీనూ. మీనాన్న కనపడ్డాడు. నిన్ను రమ్మనలేదుట! అబద్ధాలాడుతున్నావు! వెధవా!' అని కోప్పడలేదు. ఏమి జరుగుతుందో, ఇంకా ఏమంటాడో చూద్దామని ఊరుకొన్నాను.

మరునాడు సాయంత్రం మూడుగంటలకు సీను నాగదిలోకివచ్చి పిల్లిలాగ నుంచున్నాడు. మాట్లాడటానికి వాడికి ధైర్యం లేకపోయింది. కాని వాడు ఎందుకు వచ్చిందీ నాకు తెలుసు. వాళ్ళ ఊరు వెళ్ళటానికి రెండురూపాయలు కావాలె వాడికి. నేనే మాట్లాడించాను.

'ఏంరా ?'

....

'వెళతావా ?'

తల ఊపాడు.

'ఏం వెళ్ళకపోతే ?'

'మానాన్న కోప్పడుతాడు.'

'ఉహూ. పాపం మీనాన్న కోప్పడుతాడేం ? నిన్ను రమ్మని చెప్పాడా ?'

'చెప్పాడు.'

వెధవ! సులభంగా బ్రహ్మాండమైన అబద్ధం ఆడేశాడు.

నాకు చాలా కోపం వచ్చింది. రెండు బాదుదామా అనిపించింది. కాని అంతచిన్నవాడిని కొడితే ఏమిప్రయోజనం? వాడికి అబద్ధం ఆడటం తప్పు అని నచ్చచెప్పాలి.

అదీకాక ఇంకొకటి తోచింది. వీడు ఒక్కడూ ఎప్పుడూ ప్రయాణం చేయలేదు. అది కారణంగా చూపి ప్రస్తుతం వాడి ప్రయాణం ఆపేద్దామనుకొని, అన్నాను 'ఒరే, నీవు ఒక్కడివీ, ఎల్లా వెడతావురా! ఎప్పుడన్నా వెళ్ళావుగనుకనా?—ఎవ్వరన్నా మీఊరువాళ్ళు వస్తే వాళ్ళతో పంపిస్తాను. అందాకా ఉండు.'

సీను ఒక్కనిమిషం కాస్త ఆలోచిస్తున్నట్లు చూచి 'మా ఊరి కుర్రాడొకడు మాస్కూలులో ఉన్నాడు. వాడుకూడా వెళ్ళుతున్నాడు, మేమిద్దరం కలిసి వెడతాము మామయ్యా' అన్నాడు.

'వాళ్ళ స్కూల్‌కు సెలవలు ఇవ్వట్లేదే!'—అన్నాను.

'వాళ్ళ మాస్టరును సెలవు అడిగి వస్తున్నాడు.'

'వాడి పేరు?'

'సీతయ్య.'

'ఏ క్లాసు?'

'ఫోర్తుఫారం.'

సరేవెళ్ళు. రేపుపొద్దున తొమ్మిదిగంటల బండికి వెళ్ళుదువు గానిలే. నీకు కావలసిన డబ్బు ఇస్తాను.

సీను సరేనని తలఊపాడు.

నీకు ఒకఉత్తరం ఇస్తాను. అది మీనాన్నకు ఇచ్చి దానికి జవాబు వ్రాయించుకొనిరా. తెలిసిందా?'

'..........'

'ఉత్తరం వ్రాయించుకొని రాకపోయినా, మీనాన్న యిచ్చిన ఉత్తరం ఎక్కడైనా పారేసినా నాకు చాలా కోపం వస్తుంది ?'

సీను మళ్ళీ అంగీకారాన్ని సూచిస్తూ తలఊపాడు. 'నేను చెప్పిన విషయాలన్నీ తెలిసినవా ?'

'తెలిసినవి'

'ఏం చెయ్యాలె చెప్పు ?' అని అడిగాను.

సీను ఏడ్పుముఖంతో అన్నాడు. 'మానాన్నచేత ఉత్తరం వ్రాయించుకొని రావాలె'

'ఉత్తరం లేకపోతే ?' ఈప్రశ్న పెద్దగొంతుకతో హడలి పోయేలాగున అడిగాను.

'నీకు కోపంవస్తుంది.' అని జబాబుచెప్పి సీను మెల్లగా నాగదిలోనుంచి జారిపోయినాడు.

2

మరునాడు పొద్దున తొమ్మిదింటికి సీను నాగదిలోకి వచ్చి తలవంచుకు నుంచున్నాడు.

'ఏంరా ? డబ్బు కావాలా ?'

సీను తలఊపి అక్కరలేదన్నాడు.

'ఏం?'

'వెళ్ళను మామయ్యా'

తన్నడికి ఈసంగతంతా తెలిసిపోతుందనీ తాను అబద్ధం ఆడినట్లు బైటపడుతుందనీ భయపడి, అసలు ప్రయాణమే మానుకొన్నాడు. వాడిని చీవాట్లు వేయటానికి అంతకంటేమంచి సమయం లేదని తోచింది.

'ఎందుకు వెళ్ళవురా?' అని అడిగాను.

సీను తల వొంచుకుని తెల్లముఖంవేశాడు. అప్పుడు నేను ఇట్లా అన్నాను 'వెధవా; నీవు ఆడుతున్న నాటకం అంతా నాకు తెలియదనుకున్నావా? వట్టి అబద్ధం. అవునా?'

'అవును.' అన్నాడు సీను భయపడిపోయి.

'వెధవ! చెడిపోతున్నావు. నీవేమీ బాగుపడే పనులు చేయటంలేదు. పచ్చి అబద్ధాలు ఆడటం నేర్చుకొన్నావు. నిజం దాగదు. ఎప్పుడో ఒకప్పుడు బైటపడుతుంది. అవునా?'

'అవును'

'ప్రాణం పోయినా సరే అబద్ధం ఆడకూడదు. తెలిసిందా?

'తెలిసింది'

'హరిశ్చంద్రుడి కథ తెలుసునా?'

'తెలుసు'

'ఏం జేశాడూ?'

'అబద్ధం ఎప్పుడూ ఆడలేదు.'

'ఎన్ని కష్టాలు వచ్చినా?'

'ఓర్చుకొన్నాడు'

'అంతే కాని?'

'అబద్ధం ఆడలేదు'

'చూశావా అదీ మన ఆదర్శం. నోటినెంట అబద్ధం రాకూడదు. ఇకనుంచి ఎప్పుడూ నిజం చెప్తావా?

'చెప్తాను.'

'ఇంకొకటి. చెడపిల్లలతో సహవాసము చేయకూడదు. అట్లాంటివాళ్ళు ఏంజేస్తారో తెలుసునా? సినిమాలకూ, నాట

కాలకూ తీసికెళ్ళి మనిషిని నిముషంలోకి పాడుచేస్తారు. చదువు పాడై పోతుంది. నిజమా అబద్ధమా?'

నిజమేనని సీను తలవూపాడు.

'నీవు ఇప్పటికే ఎంతో పాడై పోయినావు! ఏం అట్లా చూస్తావు? నిజమా అబద్ధమా?'

'నిజమే'—అన్నాడు సీను.

'కాకపోతే ఇద్దరు కలిసి వెడదామను కొంటారా?' అన్నాను నేను.

'కాదు మామయ్యా'

'కాదు ఏమిటి, నీ మొఖం! మీరు ఇద్దరూ కలిసి వెడదాం అని అనుకోలేదూ?'

సీను సిగ్గుపడి 'అనుకోలేదు' అన్నాడు.

'మరి నీవు అనలేదూ, మేముద్దరం కలిసి వెడతామని?'

'అన్నాను.'

'..........'

'ఐతే అదికూడా అబద్ధం అన్నమాట!'

'అవును'

'ఓరి సన్యాసి. ఎన్ని అబద్ధాలు ఆడావురా! మీనాన్న నిన్ను రమ్మన్నమాట అబద్ధమే! సీతన్నా నీవూ కలిసి వెడదామనుకొన్నమాట అబద్ధమే! రెండు అబద్ధాలాడావు! ఛీ, వెధవా!'

అని చీదరించుకునేసరికి సీనుకు పాపం ఎందుకు ఇన్ని అబద్ధాలు ఆడానా అని పశ్చాత్తాపం కలిగినట్లుంది. ఏడ్చాడు.

పొంగివస్తున్న దుఃఖాన్ని ఆపాలని వాడుఎంత ప్రయత్నంచేసినా అగలేదు. వాడు వెక్కి వెక్కి ఏడ్వటం సాగించాడు.

'ఛాపో, వెధవా, ఇక ఎప్పుడూ అబద్ధాలాడకు' అని చెప్పి వాడిని పంపేశాను.

3

సీనుకు పశ్చాత్తాపం కలిగినట్లు నాకుబాగా నమ్మకం కలిగింది. ఇక వాడు ఎప్పుడూ అబద్ధంచెప్పడు. ఒక కుర్రవాడిని సన్మార్గంలోకి తిప్పగలిగానని నాకు చాలాసంతోషం కలిగింది.

కాని ఒక్కవిషయం నన్నుచాలా బాధపెట్టింది. వాడు ఇన్ని అబద్ధాలు ఎందుకు ఆడినట్లు! ఈప్రశ్నకు సమాధానం కోసం నేను చాలాసేపు ఆలోచించాను. ఇంటికి వెళ్ళాలని ఆమర్ధావడి ఉంటాడు. అంతకుపూర్వము నాలుగురోజులక్రితమే పదిరోజులు తల్లితండ్రిలదగ్గర ఉండివచ్చినవాడికి అంత ఆరాటము ఎందుకో వాడినే అడగాలని అనుకొన్నాను.

పదిగంటలకు సీనుగదిలోకి వెళ్ళాను. వాడు ఖిన్నుడై కుర్చీలో కూర్చుని ఏదోపుస్తకంవంక చూస్తున్నాడు. నేనువెళ్ళగానే లేచి నుంచున్నాడు. వాడిమీద చెయ్యివేసి మెల్లగా వాణ్ణి నాగదిలోకి నడిపించుకొనివచ్చి, కుర్చీలో కూర్చోబెట్టి బుజ్జగించి అడిగాను.

'ఎందుకురా సీనూ అన్ని అబద్ధాలాడావు?'

సీను మాట్లాడలేదు.

'ఇంటికి వెళ్ళాలని ఉందా?'

అవునని తల ఊపాడు.

‘మొన్ననేగా వెళ్ళివచ్చింది? ఎందుకు ఇంతలో వెళ్ళాలని బెంగపెట్టుకొన్నావు? భయంలేదు. చెప్పు!’ అని బుజ్జగించాను.

వాడికి మాట పెగిలిరాలేదు. కాసేపు అయినతరువాత అన్నాడు. ‘నేనువచ్చేరోజునే అనుకొంటున్నారు; మా ఆవు ఆరోజో మరునాడో ఈనుతుందని...’

ఈ మాటలు దుఃఖంతో అని, తరువాత కాస్త దుఃఖం ఆపుకొని, మళ్ళీ అన్నాడు రుద్ధకంఠంతో ‘నాయినా సీనూ జున్ను తినకుండా వెడుతున్నావు! ఇంకొక్క రెండురోజులు ఉండరాదురా, పోనీ నాయినా! జున్ను నీకు పెట్టకుండా మేమందరం ఎట్లాతింటామురా! అని మా అమ్మ ఎన్నోసార్లు అనుకొన్నది. అందుకని..., సీను ఆపైన ఒక్కమాటైనా అనలేక పెద్దగా ఏడ్చాడు.

నాకు చాలా జాలివేసింది. రెండుచొక్కాలూ, రెండు లాగులూ వాడిపెట్టెలోనుంచి తీయించి ఒక సంచిలో పెట్టుకోమని, వాడిని వెంటబెట్టుకొని బస్‌స్టాండుకు బయలుదేరాను.

సీను విషయమైయే ఆలోచిస్తూ నడుస్తున్నాను. వీణ్ణి ఇక జన్మలో అబద్ధం ఆడకుండా చెయ్యాలె. బహుశః, వాడు ఆనిశ్చయానికే వచ్చివుంటాడని తోచింది. కాని వాడెవరో ఆసీతన్న స్నేహంలో పడ్డాడో నేనుచేసినపని అంతా వ్యర్థమై పోతుంది. అందుకని ఆసీతన్నతో ఇకముందు ఎప్పుడూకూడా సహవాసం చెయ్యవద్దని గట్టిగాచెప్పితే నేను ఈ కర్రివాడిని [illegible]చేసినవాడిని అవుతానని అనుకొన్నాను. అందుకని అన్నాను. ‘ఒరే సీనూ, నీవు ఇకనుంచి బుద్ధిమంతుడివిగా ఉండాలె. ఆసీతన్న వట్టి వెధవ! వీధులవెంటతిరిగే వెధవ! వాడు

వత్తి అబద్ధాలకోరు. వాడు మీవూరువాడు అయినాసరే ఎప్పుడుగాని వాడితో మాట్లాడకు.'

'అదికాదు మామయ్యా'

'ఏదికాదురా వెధవా! సీతన్నను నేను ఎరగనను కొన్నావా?'

ఈస్థితిలో నాకు ఒకటితోచింది. సీతన్నను నేను ఎరగను అనుకొని ఉంటాడు సీను. నిజానికి ఎరగను. అందుకనే వాడి విషయమై ఏమన్నా 'కాదు మామయ్యా' అంటున్నాడు. సీత న్నను నేను బాగా ఎరిగివున్నట్లు నటించి డబాయిస్తేనేగాని ఆవిష యమైకూడా ఉన్నసంగతి బైటపడదు. వీడికి ఇన్ని అబద్ధా లాడాలని తోచిఉండదు. ఆవెధవే బోధించిఉంటాడు. మీమా మయ్యతో ఇల్లాచెప్పిరారా అని. ఇల్లా అనుకొని నేను మళ్ళీ సీనును డబాయించాను పెద్ద గంభీరమైన గొంతుకతో.

'ఒరే సీనూ, నువ్వూ సీతన్నాకలిసి వెళ్ళదామనుకొన్న మాట అబద్ధమే నన్నావు. నీవు అంతవరకు నిజమే చెప్పిఉం టావు. నమ్మకమేకాని, ఒక్కఅనుమానం ఉన్నది. నిన్ను ఇల్లాగ అబద్ధాలు ఆడమనిచెప్పింది వాడే అయివుంటాడు. అవునా ?'

'కాదు మామయ్యా'

నాకు చాలాఆశ్చర్యం కలిగింది. కాదంటున్నాడు ! వీడికి ఈబుద్ధి పుట్టిందని నేనునమ్మలేక మరోసారి భయపెట్టాను ఇల్లాగ. 'ఆ సీతన్నవిషయమై నాకు తెలియదనుకొన్నావా? నాకు అంతా తెలుసు ! వాళ్ళమాస్టరుకూడా చెప్పాడు; సీతన్న వట్టి దుష్ట ర్గుడని వాడిసహవాసంవల్ల నీవుకూడా చెడిపోతున్నావనీ'!

సీను కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ అన్నాడు.

'వట్టిదే మామయ్యా'

నాకు వళ్ళు మండిపోయింది 'చెంపలు పగలగొడతాను వెధవా! మేస్టరుకూడా అబద్ధం చెప్పాడంటావా?' అని గర్జించాను.

'అదికాదు మామయ్యా, అసలు, సీతన్న అంటూ ఎవరూ లేరు మాఊరు కుర్రాళ్ళల్లో! ఊరికేనే నేను ఏదోపేరు అన్నాను!'

ఈమాట వినేసరికి నావళ్ళు ఝల్లుమన్నది. కాస్త తెప్పరిల్లి 'సరేలే, అయినా ఒకటి. సీతన్నబోటివాళ్ళు చాలామంది ఉంటారు. అటువంటి వాళ్ళతో సావాసం చెయ్యకేం!' అన్నాను.

సీను, విధేయతతో, తలవూపుతూ బస్సుపైకి ఎక్కాడు.

నేను క్రిందే నుంచున్నాను.

వాడు పైన...నేను క్రిందా ఉన్నాము.

'ఒరే నాయినా, వెళ్ళిరా. జున్నుతినిరా. నేనుచెప్పిన విషయం ఎప్పుడూ మరిచిపోకేం'

సీను తల ఊపాడు.

'ఏమిటి నేనుచెప్పింది?' అని అడిగాను.

'ఎప్పుడూ అబద్ధం ఆడకూడదు మామయ్యా!'—అన్నాడు సీను. ఆ మాటలువిని నేను 'నిజం. నిజం' అనుకొన్నాను.

బుర్రుమంటూ బస్సు వెళ్ళిపోయింది. నేను విచారంతో వచ్చేశాను. వాడు ముందుకు వెళ్ళాడు. నేను వెనక్కువచ్చాను.

ఎనిమిదీ-ఎనిమిది

ఒక అమ్మాయీ అబ్బాయీ. ఆ అమ్మాయి చాలా చక్కనిది. పదహారేండ్ల వయస్సులో, మాంచి యవ్వనంలో ఉంది. ఆ అమ్మాయికి పెండ్లి అయింది, కాని అత్తవారింటికి ఇంకా వెళ్ళలేదు.

ఆ పిల్లమొగుడికి ఇరవై ఏండ్లు. కొంచెం పొడుగ్గా చామనచాయగా అందంగా ఉంటాడు.

ఆ అబ్బాయి అత్తవారింటికి వచ్చాడు ఒక రోజున. అల్లుడు వచ్చాడని అత్తగారు మర్యాదచేసి మంచి భోజనం పెట్టింది. ఆ అత్తగారూ, మామగారూ ఎంత సంతోషించారో ఎట్లా మర్యాదచేశారో, అదంతా వివరించ నక్కరలేదు. ఆ చిన్నవాడు అత్తగారింట్లో ఉన్న మూడురోజులూ ఎట్లా ప్రవర్తించాడో వినాలి.

ఆ అబ్బాయి వచ్చినప్పటినుంచీ ఎవరికోసమో నిరీక్షిస్తున్నట్లు చూడటం మొదలుపెట్టాడు. ఫలహారం చేస్తున్నా, భోజనంచేస్తున్నా, అతనిచూపులు ఒకగది కిటికీలమీదకే ప్రసరించేవి. అక్కడా, ఇక్కడా, అంతటా వెతికేవి.

దాపరికం ఎందుకు? ఆ అమ్మాయి ఎక్కడుందో, ఒకసారి తనకళ్ళకు కనపడితే బాగుండునని అనుకొన్నాడు ఆ అబ్బాయి.

గదిలో కనక కంకణ ఝుణఝుణత్కార ధ్వనులు వినిపించేవి. అతని నేత్రాలు సముజ్జ్వలములు అయ్యేవి. వాటిలోనుంచి రకరకాల కిరణాలు ఉద్భవమై దిక్కుదిక్కులా ప్రసరించేవి.

అందులో కొన్ని నిశితమైనవి, కఠిన శిలానిర్మితములైన కుడ్యములను చీల్చుకొని అంతఃపురాలలో ప్రవేశించి తిరిగి వస్తూవుండేవి. ఆ పెద్దఇంట్లో ఆపిల్ల ఎక్కడ దాక్కుందో కనపడలేదు.

అతని మనోవీథి అంతా నిబిడాంధకార బంధురమైపోయింది. కాని మధ్య మధ్య శయ్యామందిరాంతర్భాగాలలోనో, నిష్కుట ప్రాంతాలలోనో, గవాక్షాలలోనో ఆపిల్ల తళుక్కుమనేది. అదికూడా లేకపోతే అతడు లక్షణం వెళ్ళిపోయేవాడు.

ఆ కుర్రవాడి తలలో విపరీతపు ఆలోచనలన్నీ వచ్చిపడ్డాయి. ఎవ్వరూ లేకుండాచూచి ఆపిల్లతో మాట్లాడాలనీ, ఆ అమ్మాయి కళ్ళల్లో ప్రణయజ్యోతులు వెలిగించాలనీ బుద్ధి పుట్టింది.

ఆ సాయంత్రమే ఆ అమ్మాయిని కిటికీలో నుంచి చూశాడు. ఆపిల్ల మళ్ళీచూచింది. పిల్లలు ఇల్లాగ ఒకరివంక ఇంకొకరు చూచుకొన్నారని విని నక్షత్రాలు ఆకాశంలోనుంచి తొంగిచూచి నవ్వుకొన్నవి. ఈ కబురువిని ఎక్కడో ఉన్న గాలిదేవుడుకూడా రయ్యిన పరుగెత్తుకుంటూ వచ్చాడు. వచ్చి ఆపిల్ల బుగ్గలనూ, ముంగురులనూ తాకి ముద్దెట్టుకొని వెళ్ళాడు ఆ ముసలితాత.

ఆరాత్రి ఒంటరిగా ఉండగా ఆ పిల్లను మాట్లాడిద్దామని ఆ అబ్బాయి అనుకొన్నాడు. స్నానంచేసి వస్తూ వస్తూ ఆగది కిటికీవంకే ఊరికే చూస్తూ నడిచాడు.

ఆరాత్రి ఆ కుర్రవాడికి సరిగ్గా నిద్రపట్టలేదు. ఆ పిల్లను మాట్లాడిద్దామని పట్టుదలమాత్రం ఎక్కువైంది. ఆరాత్రి అంతా

అల్లాగ అనుకొంటూనే నిద్రపోయినాడు. తెల్లవారింది. మళ్ళీ అనుకొన్నాడు సమయంజూచి ఆ పిల్లను పలకరిద్దామని.

రెండవరోజు రోజు రోజంతా ఎంత ప్రయత్నం చేసినా అతనికి ఆపిల్ల ఒంటరిగా చిక్కలేదు. ఆ శ్రాద్ధ స్మశానమూ ఆ చిరుత ప్రాణిని ఎంత తల్లడిల్లిందో నేను చెప్పలేను. చాలా జాలిని కలిగించే విషయము ఏమిటంటే పాపం ఆబిడ్డ అల్లాగే నిరుత్సాహంతో, నిస్పృహతో ఆ నిశీథంలో నిద్రపోయినాడు.

ఆరాత్రి అతడు సరిగా నిద్రపోయినాడని ఏ మర్త్యుడూనూ అనడు. అయితే ఒకటి రెండుసార్లు కాస్త కునికితే కునికియుండ వచ్చు. అదైనా కలత నిద్రే. మెలుకువ వచ్చినప్పుడల్లా, అనుకొనేవాడు ఆపిల్లను తప్పకుండా రేపు మాట్లాడించాలే అని.

రెండురోజులు, అంటే ఒకలక్ష సెకనులకాలం, వృధాగా గడిచిపోయింది. ఒక్క నిమేషమాత్రం ఒక్కమాట మాట్లాడటానికి అతనికి అవకాశం చిక్కలేదంటే ఏమనుకోవాలె! విధి అల్లా చేసింది! అవకాశం వచ్చినప్పుడు ఆపిల్ల, ఈ కుర్రవాణ్ణి చూచి చటుక్కున వెళ్ళిపోతూ వుండేది. పాపము ఆ అబ్బాయికి ఏమీ తోచలేదు. అంతేగాని అతడు ప్రయత్నమేమీ తక్కువ చేయలేదు.

ఇంతలో భళ్ళున తెల్లవారింది. అది మూడోరోజు. ఆ మరునాడు వెళ్ళిపోదామనికూడా అనుకొంటున్నాడు. ఆరోజున అయినా తనకు మంచి అవకాశం కలిగించవలసినదని భగవంతుణ్ణి ప్రార్థనచేశాడు ఆ అబ్బాయి. అతడు ఎంతగా బాధపడ్డాడో తెలిసికోగల దన్నలుకూడా లేరుగదా ఈ లోకంలో!

శ్రీ [illegible]

2

భగవత్కృపవలన ఆరోజున ఆ అబ్బాయికి మంచి అవకాశం వచ్చింది. ఎల్లాగంటే ఆ పిల్లవాడు మేడమెట్లు ఎక్కుతూ ఉంటే అదే సమయానికి ఆపిల్ల కిందికి దిగుతూఉన్నది. ఆ అబ్బాయి వస్తున్నాడని ఆపిల్లకూ తెలిసింది, ఆ అమ్మాయి కిందికి దిగుతున్నదని ఆ పిల్లవాడికీ తెలిసింది.

ఆ అబ్బాయి ఇల్లా అనుకొన్నాడు మనస్సులో. 'ఆపిల్ల నన్నుజూచి తప్పక వెనక్కుతిరిగి పారిపోవటానికి ప్రయత్నం చేస్తుంది. అప్పుడు నేను 'ఏయ్ మాట' అందామని నిశ్చయించుకున్నాడు.

సరిగ్గా ఆ సమయానికే ఆ పిల్లకూడా ఇల్లా అనుకొన్నది మనస్సులో. 'ఈ పిల్లవాడి సంగతి ఏమీ బాగుండలేదు. రెండు రోజులనుంచీ చూస్తున్నాను. పోనీ పోనీ అని ఊరుకొంటున్నాను. సరే! కానీ! వస్తున్నాడుకదా, నన్నుజూచి తొలగిపోయినాడో మర్యాదగా, సరే సరి. అల్లాగ కాక సరాసరి పైకివచ్చి నన్ను దాచుకొంటూ పోయినాడో నిలవేసి నాలుగు చీవాట్లూ వెయ్యాలె'

ఇల్లాగ ఇద్దరూ కృతనిశ్చయులై ఒకరికి ఎదురుగా ఒకరు నడిచారు. ప్రచండమైన వేగంతో పోతూవున్న రైళ్లు ఒకదానితో ఒకటి కొట్టుకోబోతున్నవి. ఒక పరమాణువు మరియొక పరమాణువుతో ఢీకొనబోతున్నది.

ఈ సంఘటనను గురించి చదువుతూ ఉన్నప్పుడు ఎవ్వరి

గుండెలు కొట్టుకోకుండా ఉంటయ్యో, ఎవ్వరు నిబ్బరంగా ఉండ గలరో నేను వూహించలేను.

ఒక స్త్రీ హృదయం, మరొక పురుష హృదయం సమాకర్షణపొంది ఉన్నట్లయితే ఇంతగా భయపడవలసి ఉండేదికాదు. ఇక్కడ ఒకదానిని ఒకటి ప్రతిఘటిస్తున్నది. శివ, శివ ఎట్లాంటి అపచారము జరుగబోతున్నదోకదా! ఆ పిల్లవాడు పైకి వస్తున్నాడు—! ఆపిల్ల మెట్లు దిగుతూఉన్నది!

అరరే, ఆ పిల్లవాడు రాబోయే ఉపద్రవాన్ని ఏమాత్రం తెలుసుకోలేకుండా ఉన్నాడుసుమా! 'అరే అబ్బాయీ, ఆపిల్ల పల్లెటూరులో పెరిగింది. కార్యము కాకముందు మొగుడితో మాట్లాడటం మహాపాపం అని అనుకొనే మనిషి. దానికితోడు పెంకె. నీవు మూర్ఖపు పట్టుదలతో ఆ అమ్మాయిని పిలిచినా, చెయ్యి పట్టుకొన్నా ఆపిల్ల పెద్దగా కేకలువేసి, వాళ్ళఅమ్మనూ, వాళ్ళనూ పిలిచి నిన్ను అల్లరి పెడుతుంది. మరీ మూరంచేస్తేనా నీ చొక్కా పట్టుకొనిలాగి, నిన్ను మెట్లమీదినుంచి క్రిందికి నెట్టుతుంది కూడాను!

ఏయ్! అమ్మాయి! నీవుమట్టుకూ ఏమిటా పెంకితనము! ఆ అబ్బాయి మొగుడుకదా, అతను వస్తున్నాడని తెలిసికూడా తగుదునని యెదురుగా పోవటం యేమంత మంచిపని!'

కాని ఆపిల్ల మెట్లు దిగుతునేవుంది. ఈఅబ్బాయి మెట్లు ఎక్కుతునే ఉన్నాడు.

అబ్బాయి తల వంచుకొన్నాడు. కొద్దిగా భయపడుతున్న ఉన్నట్లుకూడా స్పష్టంగా తెలుస్తూనేవుంది. కాని అమ్మా! అతను రెండురోజులనుంచీ ఆలోచించి ఆలోచించి, చివరకు బాగా

ధైర్యం చిక్కబట్టాడు. ఆ అమ్మాయిని పలకరిద్దామని చాలా గట్టిగా నిశ్చయించుకొన్నాడు.

ఆ పిల్లకూడా ఆ కుఱ్ఱవాణ్ణి అవమాన పరుద్దామని గట్టిగా అనుకొన్నట్లుంది. లేకపోతే ఎందుకు అల్లాగ భయం లేకుండా వస్తుంది?

'అరే, వస్తున్నాడు!' అనుకొన్నది ఆపిల్ల, కుఱ్ఱవాడు మలుపుతిరిగి ఆమె దృష్టిపథంలోకి రావటంతోనే. 'అదుగో వస్తున్నది, !' అనుకొన్నాడు ఆపిల్లవాడు, ఆమె మలుపు తిరిగి అతని దృష్టిపథంలోకి రావటంతోనే.

కొద్దిగా గమనవేగం తగ్గినా, ఇద్దరూ ఎదురుబొదురుగా నడుస్తునేఉన్నారు. మరీ సమీపంలోకి వచ్చారు.

తొణకకుండా నడుస్తున్నాడు కుఱ్ఱవాడు గంభీరంగా, ధైర్యంగా. ఆ పెంకెపిల్ల ఎదురుగా వస్తూనేఉంది సుస్థిరబుద్ధితో స్తిమిత మతితో.

అరిబాబా! ఎంతప్రళయం జరగబోతున్నది ! తప్పకుండా, ఇదేదో పెద్ద అల్లరి కావలసిన విషయమే !

అయితే తమాషా ఏమిటంటే ఏవిధమైన అల్లరీ జరగ లేదు ! ఆపిల్లదారిని ఆపిల్ల వెళ్ళిపోయింది, ఈ పిల్లవాడిదారిని పిల్లవాడూ వెళ్ళిపోయినాడు. అమ్మాయి అతగాడిని కన్నెత్తి అయినా చూడలేదు. ఆ పిల్లవాడు ఆ అమ్మాయిని నోరెత్తి అయినా పలుకరించలేకపోయినాడు.

అబ్బాయి నావంక చూచినట్లయితే ముక్కచీవాట్లు వేసే దాన్ని అనుకొన్నది ఆపిల్ల. ఆపిల్ల తలవంచుకొని వెళ్లిపోయింది

గాని ఒకకన్ను నామీద పారేసినట్లయితే తమాషా చేసేవాణ్ణి అనుకొన్నాడు ఈ ధీరహృదయుడు.

ఇల్లా జరిగింది ఆరోజున ప్రొద్దున ఎనిమిదిగంటల యాభై నిమిషములకు.

3

పదిగంటలకల్లా భోజనాలై పోయినవి. పదకొండింటికల్లా ఇంట్లోఉన్న ఆడవాళ్ళ భోజనాలుకూడా అయిపోయినవి. ఆపిల్ల వుండే గదికూడా ఆ అబ్బాయి గుర్తుపట్టి ఇక సాగించాడు తన దండయాత్ర.

ఆపిల్ల ఆ కిటికీదగ్గరకు ఎందుకో రావటంతోనే ఈ అబ్బాయి ధైర్యంగా ఆ అమ్మాయి వంకచూచి నవ్వాడు. నిజంగా ఆగుండె నిబ్బరాన్ని మెచ్చుకోక తప్పదు.

తనేదో ఘనకార్యం చేశానని ఆ అబ్బాయి అనుకొన్నాడు కాని ఆపిల్ల ఏమనుకొంటున్నదో తెలిస్తేనా? ఆ అమ్మాయి ఇల్లా అనుకొంటున్నది. 'ఈ అబ్బాయి నన్నుజూచి నవ్వటం కూడా మొదలుపెట్టాడు. నేను ఊరుకొన్నానా ఇది చాలా దాకా పోతుంది. ఎవ్వరైనా చూస్తే ఈపిల్ల మొగుడితో మాట్లాడుతున్నది, ఇదెక్కడి విడ్డూర్యమమ్మా అని ముక్కలూ మూతులూ విరుస్తారు. ఎందుకొచ్చిన అల్లరి! మొదట్లోనే ఏదో గట్టిగా చీవాట్లువేయాలె.'

మళ్ళీ కాసేపుండి అనుకొన్నదీ, 'నేను చేయదలచుకొన్నది ఏమంత కష్టమైన పనికాదు. మా అమ్మతో చెపితే ఆమె అల్లుడిగారిని పిలిచి నాలుగూపెడుతుంది.'

మరికొంతసేపు అయిన తరువాత ఇంకోవిధంగా అనుకొన్నది. 'ఛా ఛా ఎవ్వరితోనూ చెప్పకూడదు. ఆ అబ్బాయి ఏమన్నా అనుకొంటాడు. ఒకరికిచెప్పటం ఎందుకూ? నేనేం చిన్నదాన్నా! ఆ నాలుగు మాటలూ నేనే అంటాను. అయినా తొందరపడి అనివేయకూడదు. ఈ వ్యవహారం ఎందాకా పోతుందో కొంచెం చూడాలె. బహుశః నన్ను పిలుస్తాడు. పిలిచి ఏమంటాడో చూస్తాను! ఏమని పిలుస్తాడూ! నాపేరుపెట్టి పిలుస్తాడా? ఛీఛీ. పెళ్ళాన్ని పేరుపెట్టి పిలుస్తాడా? తప్పుకాదూ? అతడి గొంతుచాలా మధురంగా వుంటుంది. అతని మాటల్లో సంగీతం దాక్కునివుంది. అయితే ఏం! నేను ఆమాటలు వినిపించుకోను.'

'ఆ అబ్బాయి నాచెయ్యి పట్టుకొంటాడేమో! ఆ అబ్బాయి అల్లాగచేసేలాగునేఉన్నారు. అల్లాగచేస్తే తమాషాగా వుంటుందనుకొంటున్నారు. అమ్మ దొంగ! ఈఅబ్బాయి ఎంత తమాషా చెయ్యాలని ఆలోచిస్తున్నాడూ! ఒప్పుకుంటానా! అసలు ఆ అబ్బాయికి చిక్కుతానా? కార్యంకానిపిల్లలు అసలు మొగుడి సమీపంలోకే పోకూడదు. నాకు తెలియదా ఏమిటి ఆసంగతి! ఆ అబ్బాయికళ్ళు ఎల్లాగో మెరుస్తూవుంటవి. తళుక్కు తళుక్కుమంటూ వుంటవి. ఆ అబ్బాయి ముఖంవంకే చూడకూడదు.' అల్లాగ ఆ అమ్మాయి చెప్పుకొని గుండెగట్టిచేసుకొన్నది. అప్పుడు మధ్యాహ్నం పన్నెండు కొట్టారు.

అది మిట్టమధ్యాహ్నమే కావటానికి. కాని శ్రావణమాసం కావటంచేత ఆకాశం మేఘచ్ఛన్నమై చల్లగా హాయిగా వుంది. ఆ అబ్బాయితల దువ్వుకొని, తెల్లని చొక్కా తొడుక్కు

న్నాడు ఎవ్వరూ ఉన్నట్లులేదు ఆ చుట్టుప్రక్కల. అతడు యకా యకని వెళ్ళి ఆ కిటికీదగ్గర నుంచున్నాడు.

కిటికీలో పెద్ద అద్దం ఒకటి నిలబెట్టి, అందులో చూచుకొంటూ ఆపిల్ల తలదువ్వుకొంటున్నది. ఆపిల్లవాడు పిల్లను బాగా చూశాడు. 'ఎంత అందంగావుందీ ఆ పిల్ల ఒక్క మాటమాట్లాడితే బాగుండునే అనుకొన్నాడు.

ఆ అబ్బాయి నవ్వుముఖంచూచేసరికి ఆపిల్లకు ఏదో తమాషాగాఉంది. అందమైన కుర్రవాడులాగానే ఉన్నాడు. అక్కడే నుంచుని ఇంకా ఆ అబ్బాయిని చూద్దామనీ, ఏమైనా మాట్లాడితే విందామనీకూడా అనుకొన్నది:

అబ్బాయి ఎల్లాగయినా ధైర్యంచేసి 'ఇదిగో అమ్మాయ్' అని అయినా అందామని అనుకొంటున్నాడు. ఇంతలో ఆ పిల్ల 'ఛీ కార్యంకానిపిల్లలు ఎక్కడైనా మొగుడువంక చూస్తారా, తప్పుకాదా.' అని అనుకొని తుర్రున వెళ్ళిపోయింది. ఆకుర్రవాడు తెల్లపోయినాడు.

4

'అరెరె, మాట్లాడించటానికి ధైర్యం లేకపోయిందిగదా, ఎంత తెలివితక్కువపని చేశాను. ఇప్పుడు ఏం చెయ్యాలె!' అని ఇల్లాగ అనుకొంటూ అతడు గదిలోకి వెళ్ళిపోయి కుర్చీలోకూర్చున్నాడు. ఏమీ తోచలేదు. ఏదో పత్రిక చూడటం మొదలు పెట్టాడు. పత్రికలో తనను బాధిస్తూఉన్న సమస్యకు సమాధానం ఎక్కడా కనుపించలేదు. అసలు అతనికి అక్షరాలే కనిపించలేను !

ఇంతలో ఆపిల్ల అక్కడికి వచ్చింది ఎందుకో. ఆ అబ్బాయిని చూడటానికే వచ్చింది అనటంమాత్రము అన్యాయము.

అయితే ఒకటి. ఏదో పనిమీద వచ్చినమనిషి అయితే, అక్కడే తారట్లాడుతూ, నుంచుని ఉండటానికి కారణం ఏమిటీ అని అడగవచ్చు. దానికి సమాధానం చెప్పలేము. ఆపిల్ల మనస్సులో యేమి అనుకొంటూఉన్నదో, ఏమో! అక్కడ ఎవ్వరూలేరు కూడాను. వాళ్ళ అమ్మా వాళ్ళూ లోపలఎక్కడో ఉన్నారు. తండ్రి ఇంట్లోలేడు. అల్లాంటప్పుడు ఆపిల్ల అల్లాగ ఒంటరిగా రావటం చాలాతప్పు అన్న విషయం ఒప్పుకుంటాను. కాపురంచేస్తున్న పిల్లఅయినా అల్లాగ బరితెంచుకొని పట్టపగలు మొగుడికి యెదురుగా రాదు. అయితే ఆపిల్లకు తనమొగుడు అక్కడున్నాడని తెలియకపోవచ్చు. అసలు ఎందుకు వచ్చిందో ఏమో !!

చుట్టుపక్కల ఎవ్వరూ లేకపోవటం, ఆపిల్ల ఒక్కర్తే అక్కడ నిలబడి వుండటం, ఎంతప్రమాదం తెచ్చింది ఆ అబ్బాయికి. ఎట్లా ధైర్యం వచ్చిందో ఏమో చటుక్కున అనేశాడు 'ఏయ్ పిల్లా, మాట' అని.

ఆ అబ్బాయిని చీవాట్లు వేయటానికి మంచిసమయం దొరికింది ఆ పిల్లకు. 'ఏమిటది ? అమ్మతో చెప్పనా?' అనో 'తప్పు, పిలవకూడదు' అనో అందామని నిశ్చయించుకొన్నది. గుండె నిబ్బరంగల పిల్లకాబట్టి అల్లాగఅనాలని అయినా తోచింది. ఆ ధీరశీల అల్లా అందాము అనుకొన్నది. నోటిదాకా వచ్చినై మాటలు. కాని అనలేకపోయింది. ముక్కుపైన వేలువేసుకొని 'తప్పు' అనిమాత్రం అనగలిగింది. అదీ ధైర్యంగల పిల్లకాబట్టి !

అయితే ఈమాటలు గంభీరంగా కొట్టొచ్చినట్లు అనవలసింది. పాపం పసిపిల్ల కేమితెలుసు? నవ్వొచ్చింది ఆపిల్లకు. అందుకని ఈమాటలు అని పక్కునవ్వి ఆ అమ్మాయి వెళ్ళిపోయింది.

అప్పుడు మూడుగంటల పదినిమిషాలైంది.

5

తాను తప్పుపని చేశానేమోనని, ఆ తరువాత ఆ పిల్లవాడు చాలా భయపడ్డాడు. నోరుజారి అనేశాడు. దీనివల్ల ఏం ప్రమాదం వస్తుందో. ఈ సంగతి ఆపిల్ల తల్లితో చెపితే ఎంత నవ్వుబాట్లపని: ఏవో గుసగుసలు వినిపించినై. పాపం పిల్లవాడి గుండెలు తల్లడిల్లి పోయినై.

పాపం ఆపిల్ల అయినా ఎంతో హడలిపోయింది. ఎందుకో ఆ అమ్మాయిగుండెలు దడదడ కొట్టుకొన్నాయి.

ఆ పిల్లవాడు అక్కడా, ఈపిల్ల ఇక్కడా, భయభ్రాంతులై ఉంటూ ఉండగానే గడియారం నాలుగు, అయిదు, ఆరు, ఏడు. గంటలు కొట్టుకుపోయింది.

ఆ అబ్బాయికి బైటికి వెళ్ళటానికి ముఖంచెల్లక, కాళ్ళాడక ఇంట్లోనే ఉండిపోయినాడు. ఆ రోజున శ్రావణ శుక్రవారం అవటంమూలాన తల్లీ వాళ్ళూ పేరంటానికి వెడుతూ అమ్మాయినికూడా, రమ్మంటే, మస్తాబై కూడా, చివ్వరకు ఆ అమ్మాయికి నలుగురిలోకి పోవటానికి భయంవేసి, ఏదో నెపంచెప్పి వాళ్ళను పంపించి తాను ఉండిపోయింది.

సాయంత్రం ఏడు గంటల యాభై అయిదు నిమిషాలు అయింది. ఆ సమయంలో అబ్బాయికి గదిలో కూర్చోటం కష్టం అనిపించింది. గాలిలో డాబాపైన పచార్లుచేద్దామని బుద్ధిపుట్టింది.

ఒంటరిగా గదిలోకూర్చోటం కష్టంవేసి ఆ పిల్లకూడా అంతకుపూర్వమే డాబాపైన చాపవేసుకొని కూర్చున్నది. ఠాకూరు కథలు చదువుతున్నది. అబ్బాయి వెళ్ళాడు. ఆ అమ్మాయి అక్కడ కనుపించింది.

ఇందాక మాట్లాడిచ్చినందుకే హడలిపోయిన కుర్రవాడు, ఇప్పుడు ఆపిల్ల ఒంటరిగా అక్కడ ఉండటం చూచి 'ఛా మన కెందుకు, ఆపిల్లతో మాట్లాడటానికి మనమెందుకు ప్రయత్నం చెయ్యాలె?' అని అనుకొని క్రిందికి వెళ్ళిపోవచ్చునా? వెళ్ళిపోక ఆపిల్ల ఉన్నచోటికి వెళ్ళటానికి సాహసిస్తున్నాడు.

'ఇందాక ఆ అబ్బాయిని చూచి నవ్వటమేతప్పు అని నా అంతరాత్మ చెప్పింది. కార్యం కాని పిల్లను. మొగుడితో మాట్లాడటం మహాపాపం' అనుకొని ఆపిల్ల అయినా, వెళ్ళిపో కూడదూ? వెళ్ళలేదు.

ఇద్దరూ ఇద్దరే !

ఎవ్వరూ వెళ్ళిపోలేదు. కాని వాళ్ళు బుద్ధిపూర్వకంగా ఉండామని ఉండిపోలేదు. పాపం వాళ్ళ ఇద్దరికీకూడా మతి పోయింది. ఆ అమ్మాయి గుండె కొట్టుకొంటూఉన్నది. ఆ అబ్బాయి గుండెకూడా దడదడలాడుతూ ఉంది.

అయితే ఒక్క సంగతి. ఆపిల్ల ఈఅబ్బాయిని చూడ లేదేమో! ఎందుకంటే ఈపిల్లవాడు వచ్చేసరికి ఆ అమ్మాయి అటుతిరిగి పుస్తకం చూస్తున్నది.

ఆ అబ్బాయిమట్టుకు, ఒక్కక్షణం ఆలోచించి, కొద్దిగా వెనక్కుతగ్గి, ధైర్యంతెచ్చుకొని మళ్ళీముందుకు నడుస్తున్నాడు. ఆపిల్లవైపు ఆకర్షింపబడ్డాడు. దగ్గరకుకూడా వెళ్ళాడు. ఆపిల్ల మటుకు ఇతనివైపు తిరుగలేదు.

ఎందుకు తిరుగలేదూ ? తను అక్కడికి రావటం ఆపిల్ల చూడలేదని ఆ కుర్రవాడు అనుకొంటున్నాడు. ఇల్లాగ అనుకో వలెననే ఆపిల్ల ఉద్దేశంకూడానూ! అందుకని అటుతిరిగేఉంది.

నిజంసంగతి ఏమిటీ అంటే ఆపిల్లకు ఈ అబ్బాయి మేడ మెట్లు ఎక్కుతున్నప్పటినుంచీ జరిగినదంతా తెలుసు! ఆకుర్ర వాడు మేడమెట్లు ఎక్కుతున్నాడనీ, డాబాపైకి వచ్చాడనీ, తనవైపు చూస్తున్నాడనీ, దొంగలాగా నడుస్తున్నాడనీ, అన్నీ తెలుసు.

ఆ అమ్మాయి ఇల్లాగ అనుకొంటున్నది. 'ఈ పిల్లవాడు నా దగ్గరకు వస్తున్నాడు. నేను అతనివంక చూడకూడదు. చిన్నపిల్లలు మొగుడివంక చూడకూడదని నాకు తెలుసు. అందుకని అసలు అటుతిరగను. నేను ఆ అబ్బాయివంక చూడకపోతే అతడు నన్నేంజేస్తాడు. పాపం కాసేపు చూస్తాడు. తలలోపెట్టుకొన్న, ఈ మల్లెపూలు కనపడతవి. అవిమటుకు ఎందుకు కనపడాలె, : అని ఆ అమ్మాయి తన పమిటచెంగు జడ పైన కప్పుకొన్నది. ఆ సన్నని చీరచెరగు ముసుగులోనుంచి ఆ మల్లెపూలు నవ్వటం మొదలుపెట్టినవి.

ఆ అమ్మాయికి అప్పుడు కొత్త ఆలోచన వచ్చింది. ఆ అబ్బాయి తనను ముద్దు పెట్టుకొంటాడేమోనని తోచింది.

అటువంటి ఆలోచన ఆపిల్లకు ఇదివరకు ఎప్పుడూ రాలేదు. ఇప్పుడు ఎందుకువచ్చిందో తెలియదు.

అల్లాంటి ప్రయత్నం ఆ అబ్బాయిచేస్తే ఏంచెయ్యాలా అన్నది పెద్దసమస్య అయిపోయింది. ఆపిల్లకు అది తలకుమించిన ఆలోచన.

ఏంచెయ్యాలో ఆపిల్లకు చప్పున తోచలేదు. చాలాసేపు ఆలోచించింది. చివరకు భగవంతుడి దయవల్ల ఆ అమ్మాయికి ఒకఉపాయం తోచింది. అది ఏమిటీ అంటే, ఆ అబ్బాయి ముద్దు పెట్టుకోంటానికి ఎల్లాంటి ప్రయత్నంచేసినా, తానుమాత్రము అట్టిపనికి అవకాశం ఇయ్యకూడదనీ, ముఖం అటూ ఇటూ తిప్పి అతనికి అందకుండా చేద్దామనీ, ఈ ప్రయత్నాల వల్ల అతనిని వారించలేకపోతే ఆపిల్లవాడి చెంపమీద చిటికెక్కన కొడదామనీ! ఇల్లా చెయ్యిఎత్తి, ఇల్లాగ కొట్టాలె అని ఆ అమ్మాయి కొట్టేపద్ధతికూడా అభినయించి చూచుకొన్నది.

అయితే మొగుణ్ణి అల్లాగ చెంపమీద కొట్టటం తప్పు అని ఆపిల్లకు ఒకక్షణంలో తోచిందికూడా. చాలా వ్యాకుల పడ్డది. చివరకు ఇల్లా అనుకొని మనస్సులో సమాధానపడ్డది. 'ఆ అబ్బాయి నన్ను ముద్దుపెట్టుకోటం తప్పుగాదా? అతడు ఆ తప్పుపనిచేస్తే, అతనిని ఆ మహా పాపకార్యాన్నుంచి వారించటానికి ఇల్లాగచేయటం మంచిదే!'

ఇల్లాగ అనుకొని ఆపిల్ల ఆ కుర్రవాడి చెంపమీద చిటుక్కున కొట్టటానికీ, తన కన్యాత్వాన్ని కాపాడుకోంటానికీ, కృతనిశ్చయురాలై అందుకు కావలసిన ధైర్యంకోసం, అనసూయ,

అరుంధతి మొదలైనవారి పవిత్ర చరిత్రలలోని కొన్ని సంఘట
నలను జ్ఞాపకం తెచ్చుకొంటూ ఉన్నది.

ఆపిల్ల అల్లాగ చెయ్యదల్చుకోటం తప్పుకాదా అని ఆలోచ
టంలో విపరీతం ఏమీలేదు. కాని సత్యభామ మొగుణ్ణి ఎడమ
కాలితో తన్నింది అంటే చిరునవ్వునవ్వే మీరూ, ఈ పిల్ల
మొగుణ్ణి కాస్త చెంపమీద ఇట్లా అనాలని నిశ్చయించుకొన్నదీ
అంటే హడలిపోవటానికి కారణం ఏమిటో నేను ఊహించ
లేకుండా ఉన్నాను.

అయినా నేను ఆపిల్లను వెనకవేసుకొచ్చి ఆ అమ్మాయి
తప్పేమీ లేదని అనటములేదు. ఇంత చిన్నపిల్ల, ముగ్ధ,
వ్రీడావతి, ఇల్లాగ నిశ్చయం చేసుకొన్నదేమాసని నాకూ ఆశ్చ
ర్యంగాఉంది. అయితే ఒక్కటి.

ఆపిల్ల ఏది ఉచితమో, ఏది అనుచితమో తెలుసుకోలేని
వయస్సులోఉంది. కామసూత్రాలు చదివిన మనిషికాదు.
అందుకని ఆ అమ్మాయి క్షమించతగినదని మాత్రం నేను గట్టిగా
అంటాను.

అ అమ్మాయిని ఇంతవరకూ ఎవ్వరూ ముద్దెట్టుకోలేదు.
అందుకని ఈ కుర్రవాడు తనను ముద్దెట్టుకొంటే ఎల్లాగ
ఉంటుందా అని ఆపిల్లకు ఒక ఊహ వచ్చింది. ఎల్లాఉంటుందో
ఊహించలేక ఆప్రయత్నం మానేసి అతని చెంపమీద కొట్ట
టానికే, నిశ్చయించుకొన్నది ఆపిల్ల.

ఆ అబ్బాయిఊహాలు మరీ విపరీతంగా పోతున్నాయి. ఆ
పిల్లను కౌగలించుకొందామని తన హృదయానికి గట్టిగా ఆ
అమ్మాయిని అదుముకొందామనీ, ఆ అమ్మాయి మృదువైన

బుగ్గలను తాకుదామనీ, తలపైని చెయ్యివేసి నిమురుదామనీ, ఇల్లాంటి ఆలోచనలన్నీ అతని తలలో ప్రవేశించినవి. ఇల్లాంటి పాపపు ఆలోచనలు రాకుండా ఉండటానికే కళాశాలలో భగవద్గీతపాఠం చెప్పాలని పెద్దవాళ్ళు కొట్టుకొని గోలపెట్టేది.

ఈ పిల్లవాడు ఇల్లాగ అనుకొంటూ మెల్లిగా పోతున్నాడు. ఆ అమ్మాయి దృఢసంకల్పం ఏమాత్రం తెలిసినా ఆ అబ్బాయి బతికిపొయ్యేవాడు. పాపం, విధి లిరుముకొని తీసి కెళ్ళింది.

పైగా అతనికి ఏమితోచిందీ అంటే, 'ఈ సమయాన్ని జారవిడిస్తే ఈజన్మలో మళ్ళీ ఇల్లాంటి సదవకాశం దొరకదు. జన్మాంతం, తలచుకొన్నప్పుడల్లా, వళ్ళు గగుర్పాటు కలిగించే, తియ్యని తలపులనిచ్చే, సుకృతం ఏదైనా చేయదలచుకుంటే సాహసించి ఇప్పుడేచెయ్యి! సమయం దాటినతరువాత అరే, ఎంత బుద్ధితక్కువ పనిచేశాను, ఆ అమ్మాయిని కౌగలించుకోవాలిసింది- పొరపాటైపోయింది, అని ఎంత ఏడ్చినా ఏమీ లాభం ఉండదు.'

ఆ అబ్బాయి చాలా భయస్థుడు. పిల్లదగ్గరకు వెళ్ళి నుంచున్నాడు. ఆపిల్లను మాట్లాడిద్దామనుకొన్నాడు. కాని నోరు పెగలలేదు.

ఆ అమ్మాయి ఏమీ ఎరుగనట్లు అటుతిరిగేఉంది. ఇటు చూడనైనాలేదు. ఈ అబ్బాయికి ధైర్యంలేదు ఆ అమ్మాయితో 'ఓపిల్లా, ఇటుతిరుగూ' అని అనటానికి. ఇల్లాంటి దుర్భరమైనస్థితి వచ్చింది పాపం ఆ అబ్బాయికి!

వెన్నెలకూడా వస్తున్నది. వెలుగు అంతకుముందే పోయింది. అయినా ఆపిల్ల పుస్తకంవంక చూస్తునేఉంది. ఆసంజె చీకట్లో అక్షరాలు కనపడుతున్నట్లు. ఆఅబ్బాయికి ఏమీ తోచ లేదు. ఆపాళంగా ఆ కుర్రవాడు, ఏమీ ఆలోచనలేకుండా ఆపిల్ల రెండుకళ్ళనూ తన రెండు చేతులతోనూ మూశాడు.

ఏంచెయ్యాలా అనే పెద్దప్రశ్న వచ్చింది ఆ అమ్మాయికి. ఆ అబ్బాయిచెయ్యి తన ఒంటిమీద పడేసరికి ఆ అమ్మాయికి ఎంతో కోపము రావాలిసింది.

తనను ముట్టు పెట్టుకొంటే, అతన్ని చెంప చిటుక్కుమని పించటానికి, ఆపిల్ల సిద్ధంగానే ఉంది. అంతవరకే ఆలోచించింది. కాని తన కళ్ళుమూస్తే ఏమిచెయ్యాలో ఆ అమ్మాయి ఆలో చించుకోలేదు. అప్పటికప్పుడు ఏమీ తోచలేదుకూడాను. మహామహావాళ్ళే అలాంటిసమయంలో తల్లకిందులౌతారు. పాపం అథం, శుభం తెలియని ఆ పిల్లకేం తెలుస్తుంది, అందు కని ఆ అమ్మాయి మాట్లాడకుండా ఊరుకొన్నది.

ఆ అబ్బాయి కరస్పర్శ తగిలేటప్పటికి ఆ అమ్మాయికి తమాషాగా వళ్ళంతా ఝల్లుమన్నది. ఆపిల్ల తన శరీరంపైన గగుర్పాటు కలగటం ఎప్పుడూ ఎరుగదు. ఒళ్ళంతా మొగ్గలు తొడిగింది. ఏమిటబ్బా ఇంత హాయిగా ఉందీ అనుకొంటూ ఆ అమ్మాయి ఏమీ చెయ్యలేకపోయింది.

ఆ పిల్లవాడికికూడా ఏదో తమాషాగాఉంది. గుండె కొట్టుకొంటున్నది. వేడిరక్తం శరీరంలో బహువేగంగా ప్రవ హిస్తున్నది.

శ్రీ వేమన గ్రంథాలయము
(కృష్ణా జిల్లా)

నిజం మాటకు అతనికి ఏమీతోచలేదు. ఇల్లా చేయడం వల్ల ఏమి కొంపమునుగుతుందో అన్న భయంకూడా పోయింది. తనకెందుకు అంత హాయిగావుందో అతనూ తెలుసుకోలేకపోయి నాడు.

నిజంసంగతి చెపుతున్నాను. ఇందులో అసత్యం ఏమీ లేదు. ఏమిటంటే అమ్మాయిని ముద్దుపెట్టుకొందామని ఆ అబ్బాయి అంతకుపూర్వం ఎప్పుడూ అనుకోలేదు. ఆ క్షణంలో అతనికి ఆ అమ్మాయిని ముద్దుపెట్టుకొంటే బాగుండునని తోచింది. ఎందుకు అట్లాతోచిందో ఎవ్వరికీ తెలియదు. ఈ రోజుకూ అది రహస్యమే. ఇల్లాగ తోచినవెంటనే అతను ఏమి చేశాడంటే ఆ అమ్మాయిని గట్టిగా కౌగలించుకొని బుగ్గపైన ముద్దు పెట్టుకొన్నాడు. అప్పుడు సరిగ్గా ఎనిమిదీ – ఎనిమిది అయింది ఇండియన్ స్టాండర్డుటైమ్.

కొంతమంది, ఏమంటారు అంటే, ఆ పిల్లను ముట్టుకొని ముద్దెట్టుకోటం ఆ పిల్లవాడి తప్పు అనీ. అదేమి అని అనకుండా నొదలకుండా ఊరుకోటం ఆ పిల్ల తప్పుఅనీ అంటారు.

నేను అనటం ఏమిటంటే ఆ పిల్లది ఏమీ తప్పులేదనే. మొదట కళ్లుమూస్తే యేమిచెయ్యటానికి తోచలేదు. ఆ తరువాత ముద్దెట్టుకొన్నప్పుడుకూడా ఆపిల్ల ఏమీ అనలేక పోయిన మాట నిజమే. ముద్దుపెట్టుకొంటే ఇల్లాగ తమాషాగా, సంతోషంగా, హాయిగా, సుఖంగా, ఆనందంగా ఉంటుందని ఆ పిల్ల ఎప్పుడూ ఊహించలేదు. ఆ సుఖంలో చెంపమీద కొడదామని అనుకొన్నమాటే మరిచిపోయింది పాపం.

ఆ ఒక్కమాటేకాదు. ఆ పిల్ల అన్నీ మరిచిపోయింది. తనఒళ్ళు తనకే తెలియని స్థితిలో ఉండిపోయింది.

ఆ అబ్బాయి ఒక్క బుగ్గపైనే ముద్దులు కురిపిస్తూ ఉంటే ఆ పిల్ల రెండోబుగ్గ అందించగలిగింది. అంతే అంతకంటె పాపం ఆపిల్లకు ఏమీ తెలియలేదు.

అయితే ఆపిల్ల పేరేమిటీ అన్న ఒక్కవిషయం చెప్పటం మరిచిపోయాను. ఆ అమ్మాయిపేరు కాంతం.

23-వ క్రాసు రోడ్

గుంటూరులో బ్రాడీపేటలో ఇరవై మూడవ క్రాసు రోడ్డుమీద మొట్టమొదటి ఇంట్లో ఉంటూన్న ఆ అమ్మాయి ఉన్నదే, ఆమె దక్షిణానై పు కిటికీలోనుంచి ఎప్పుడూ చూస్తూ ఉంటుంది. ఆ అమ్మాయి ఒంటరిగా ఉన్నట్లుంది. పిల్లాజల్లా ఇంకా కలగలేదు. చిన్నపిల్లే.

ఆపిల్లకు అన్నంవండి పెట్టటానికీ సంరక్షించటానికీ, మంచీ చెడ్డా చూడటానికి ముసలమ్మ ఒకావిడ ఉంది. ఆవిడ ఎప్పుడూ ఏవో పనులలో ఉంటూ వీధిగుమ్మంలోకి సాధారణంగా రాదు.

ఈ పిల్లమటుకు అందరికి కనపడుతునే ఉంటుంది. ఈ అమ్మాయి ఇంటిపనులు ఏమీ చేస్తున్నట్టు కనబడదు. ఎప్పుడూ ఆ కిటికీలోనుంచి, దూరానఉన్న చెట్లవైపునకు చూస్తూఉంటుంది.

ఆ దూరాన ఉన్నవి, తాటిచెట్లు. ఈ అమ్మాయి విచారంగా వాటితో ఏమి చెపుతుందో, వాటికి ఏమి అర్థం అవుతుందో, ఏమోగాని, మొత్తంమీద అవి తలలూపుతవి.

ఆ అమ్మాయి విచారంగా ఉన్నదీ అంటే మంచిబట్ట కట్టుకోకుండా, తలదువ్వుకోకుండా కూర్చున్నది అనుకున్నారు గదూ మీరు?

చాలా పొరపడ్డారు. అలాంటిది ఏమీలేదు ఆపిల్ల ఎప్పుడూ చక్కగా కడిగిన ముత్యంలాగ ఉంటుంది. ముఖం కళ కళలాడుతూ లక్షణంగా ఉంటుంది. ఆ అమ్మాయికి ఈకాలపు

పోకళ్ళు ఏమీలేవు. చెవులకు దుద్దులేకాని లోలకులులేవు. మధ్యపాపిట తీస్తుందిగాని పక్కపాపిట తీయదు. వాలుజడ వేసుకోదు. బర్మాముడి వేసుకొని చక్కగా ఒకటి రెండు పూలు పెట్టుకొంటుంది.

ఆవీధిని కాలేజీ కుర్రవాళ్ళు, చిన్నా పెద్దా ముసలీ ముతకా ఎంతమందో వెడుతూఉంటారు. కాని, ఆ అమ్మాయి వాళ్ళను చూస్తున్నట్లుండదు. ఏమిటో ఆలోచిస్తూ, ఆకాశానికే చూస్తుంది.

అప్పుడప్పుడు ఆడపిల్లలు వస్తుంటారు ఆ ఇంటికి. వాళ్ళకు దొడ్లో ఉన్న గులాబీపూలూ ముద్దగన్నేరు పూలూకోసి ఇస్తుంది.

ఎవరో ఒక ఆయన యాభై సంవత్సరాల మనిషి ఇరవై రెండో క్రాసురోడ్డులోనుంచి వచ్చి ఆయింటి ముందుగా వెడుతూ ఉంటాడు.

ఆయనసమటుకు ఆ అమ్మాయిని చూచి నవ్వుతూ తల ఊపి 'ఖలాసాగా ఉన్నావా అమ్మాయీ?' అంటాడు. ఆపిల్ల అక్కడ కూర్చునేఉండి తలఊపి, 'ఆ ఖలాసాగానే ఉన్నాను బాబాయి' అంటుంది.

కాని తమాషా ఏమిటంటే ఆపిల్లకు ఆ ముసలాయన ఎవరో తెలియదు. ఆపిల్ల ఆయింట్లోకి కాపరానికి వచ్చి వారంరోజులు కాలేదు. అందుకని ఆ అమ్మాయి సంగతి ఎవ్వరికి తెలియదు.

ఆముసలాయన ఉన్నది ఆపక్కవీధే అనిచెప్పాను. ఆయన మాట్లాడిస్తాడు. పొరుగువారు ఎవరైతే మనకు ఎందుకని ఊరుకొనే, స్వభావంకాదు ఆయనది.

ఆయన ఒకరోజురాత్రి భోజనానంతరము చుట్ట కాల్చు కుంటూ బైటకు వచ్చేసరికి, తన ఇంటిముందున్న వంతెనపై ఎవరో ఒక కుర్రవాడు కూర్చుని ఉండటం చూశాడు. అతనికి పాతికేండ్లపై గానే ఉన్నవి. చామన చాయలోఉన్నా యవ్వ నంలో ఉండటంమూలాన అందంగా కనిపిస్తాడు.

ఆ అబ్బాయి ఆవంతెనమీద కూర్చుని ఏదో ఆలోచించు కొంటున్నాడు. మనస్సులో చాలబాధ పడుతూ ఉన్నట్లుగా కూడా ఉంది. అందుకనే ఈ ముసలాయన రావటం ఆ అబ్బా యి గమనించలేదు.

ముసలాయనే ఆ కుర్రవాడిని సమీపించి 'ఏ అబ్బాయ్ ఎవరునీవూ? ఇక్కడెందుకు కూర్చున్నావు నాయనా ?' అని అడి గాడు. నిజానికి ఆ అబ్బాయి ఎవరైతే తన కెందుకు? అది పబ్లిక్ రోడ్డుగదా ! ఆ రోడ్డుమీద కూర్చుంటే తనకెందుకూ ?

ఆ పిల్లవాడైనా పెద్దమనిషిలాగ ఉన్నాడుగాని ఒక అల్లరి చిల్లర మనిషిలాలేడు. మరియెందుకూ ఆ అబ్బాయిని నిలవేసి ఆ ప్రశ్నలు అడగటమూ అంటే, అది ఆయనగారి స్వభావం.

ఇంతకూ సంగతి ఏమిటంటే, ఆపిల్లవాడు ఏమీ మాట్లా డకుండా తలవంచుకు కూర్చున్నాడు. ముసలాయన ఊరుకొనే మనిషికాదు. మళ్ళీ అడిగాడు. 'ఏవూరు అబ్బాయ్ మీది !'

ఆ అబ్బాయి 'మాది బందరండీ' అన్నాడు. ముస లాయన అంతటితో తృప్తిపడి ఊరుకోక 'అయితే ఈవూళ్ళో ఎందుకున్నావు' అని అడిగాడు. ఆ కుర్రవాడు కొంచెము

భయపడ్డట్లుచూచి 'ఇక్కడ బంధువులున్నారులెండి' అని తల వంచు కొన్నాడు.

'ఏ వీధిలో ?'

'ఈ పక్కవీధే!' అంటూ ఆపిల్లఉన్న ఇంటివైపు చూశాడు.

'అంటే ఇరవై మూడో క్రాసురోడ్డేనా ?'

'ఆ, అదే................'

'మొదటి డాబాలో ఒక, తల్లీ, పిల్లా ఉన్నారు-అదేనా మీఇల్లు ?'

పిల్లవాడు ఏదో వింతగా భయంగా ఆయనవంకచూచి తడబడుతూ, 'అది గాదులెండి. దానికి కొంచెముపైగా ఉంటుం ది మేమున్న ఇల్లు' అన్నాడు.

ముసలాయనకు ఏదో అనుమానం కలిగింది. ఆ కుర్రవా డిముఖంలో ముఖంపెట్టి చూశాడు. ఆ వెన్నెలలో ఆకుర్రవా డిముఖం బాగానే కనపడ్డది. ఏదో తప్పు పనిచేస్తుంటే పట్టుబడ్డ వాడిలాగా గాభరాగా చూశాడు ఆ పిల్లవాడు.

ముసలాయనకు బాగా అనుమానం కలిగింది. కళ్లు మూసుకొని ఏవో తన జీవితములో ఒక ఇరవై దృశ్యాలను మనో వీధిలోచూచి చప్పున కళ్లుతెరచి నవ్వుతూ అన్నాడు. 'అయితే ఆకిటికీలో కూర్చున్నపిల్ల???'

'అదే అదే!' అంటూ ఆ కుర్రవాడు వంతెనమీది నుంచి చివాలునలేచి వెళ్లిపోయినాడు!

కుర్రవాడు చాలా విసురుగా వెళ్లిపోయినాడు. ఆ అబ్బాయి నడిచిపోవటం కనుపడుతూ ఉన్నంతసేపు, అట్లాగే

చూస్తూ నిలబడిపోయినాడు ఆ పెద్దమనిషి. చూస్తూ ఉండం గానే ఆక్షత్రవాడు వెళ్లిపోయినాడు. ముసలాయన ఆరిపోయిన చుట్టను మళ్ళీ వెలిగించి 'క్షత్రతనం ఇంతేగదా!' అనుకొన్నాడు.

ఆయన మనస్సు వినకర్రలాగా ఊగింది: ఒకసారి ఆపిల్ల వైపు మరొకసారి ఈ పిల్లవాడివైపు.

సాలీడు ఈమూలనుంచి ఆమూలకూ ఆమూలనుంచి ఈమూలకు ఎగురుతుంది. ఆ ఎగరటంలో అది సన్నని దారా లతో ఈ రెండుమూలలను కలుపుతూ ఉన్నది. ఈ రెండు మూలలకు సంబంధాన్ని కల్పిస్తున్నది. అలాగే ఈ తాతగారు తన మనస్సులో ఎవ్వరికీ కనపడని దారాలతో ఈ పిల్లల నిద్దరినీ ముడివేసుకొన్నాడు.

'ఆపిల్ల చాలా చిన్నవయస్సులో ఉండికూడా ఒంట రిగా, విచారంగా ఉంటుంది. ఎందుకా అనుకొన్నాను! పెండ్లయ్యే ఉంటుంది ఆ పిల్లకు. కాని భర్త వదిలేసివుంటాడు. పోనీ తప్పేమీలేదు. ఇప్పుడు తెలిసింది సంగతంతా, ఆయన ఇల్లా అనుకొని నోట్లో చుట్ట విసిరి పారవేసి ఇంట్లోకివెళ్లి గ్లాసుతో నీళ్ళు తెచ్చుకొని పుక్కిలించి ఉమ్మివేసి పోయి పడు కున్నాడు.

ముసలాయనకు నిద్రపట్టలేదు. ఆ అమ్మాయి భర్తృ విహీన అయినమాటనిజమే అయినట్లయితే, ఇప్పుడు జరుగబోయే పని వలన రాబోయే పరిణామం ఏమీలేదు. అట్లాకాక ఆ అమ్మాయి మగనాలి ఏమో! ఇదే నిజముఅయితే ఎంతవంచన ఆ భర్తకు! ఈ ఆలోచన ఆయన ముసలిరక్తాన్నికూడా ఉడికిం చింది. చాలాబాధపెట్టింది. ఆ వంచితభర్త పడబోయే బాధ

అంతా ఆయన పడ్డాడు. విపరీతమైన ఆలోచనలన్నీ వచ్చిపడ్డవి. అవి బాణాలలాగ అతనితలలో గుచ్చుకొనిపోయినవి. ఆయనతల ఒక అంపశయ్య అయింది. భరించలేక పోయినాడు. ఆలోచించి ఆలోచించి చివరకు భార్యను పిలిచాడు.

ఆమె పలకలేదు.

'ఏయ్ నిన్నే ఏమిటా మొద్దునిద్ర! ఏమంత ప్రొద్దు పోయిందని!'

'ఎందుకండీ!' అన్నది ఆవిడ నిద్రకళ్లతో.

'అయితేచూడూ, మన ప్రక్క వీధిలో ఆ మొదటియింట్లో ఉన్నారు చూశావ్, ఒక తల్లీ, పిల్లానూ?'

'ఆ...ఎందుకూ?'

'వాళ్లను నీవు ఎరుగుదువా?'

'ఆ ఎరుగుదును.'

'అయితే ఆ అమ్మాయి ఆముసలమ్మ కూతురేగదూ?'

'ఆ'

'అయితే ఆపిల్లకు మొగుడు ఉన్నాడా?'

'ఎందుకండీ మీకీ సంగతులన్నీ?'

'చాలా వ్యవహారం ఉందిలే! ఆపిల్లకు మొగుడున్నాడా లేడా? ఆసంగతి కొంచెం చెప్పూ?'

'ఉన్నాడండీ...ఊళ్ళో వ్యవహారాలన్నీ మీకే కావాలా' అని ఆమె విసుక్కున్నది. ముసలాయన చాలా ఆశ్చర్యపోయినాడు.

'ఊఁటే.....' అని మాత్రం అని ముసలాయన ఆలోచనలోకి దిగాడు.

'ఏమిటండీ అల్లాగన్నారు?' అని అడిగింది ఆవిడ బాగా మెలకువ తెచ్చుకొని.

'అహ ఏమీలేదుగాని నిజంగా ఉన్నాడంటావా ?'

'నిజంగా ఉండటం ఏమిటండీ ? అబద్ధంగా ఉంటారా ఏమిటి ?'

'ఉంటే మరి...ఇదేమిటి? '

'ఏ మొచ్చింది ?'

'కొంచం వ్యవహారం సాగుతున్నది.'

'చాల్లే ఊరుకోండి. ఆ అమ్మాయి అల్లాంటిదిగాదు. బంగారు తల్లి.'

జరిగిన కథఅంతా ఆవిడకు చెప్పటం ఈయనకు యిష్టం లేదు. అందుకని 'అయితే సరే పడుకో' అని ఆమెగారితో అని తానుమాత్రం ఈ విషయాన్ని ఆలోచించటానికి పూనుకొన్నాడు. పెండ్లి అయినపిల్ల అయిఉండికూడా ఎంతదుర్మార్గం చేయటానికి సాహసిస్తుంది! ఎంత ఆలోచించినా ఆయనకు ఏమి చేయాలిసింది తోచలేదు. ఆ ఆలోచనతోనే ఆరాత్రి గడిచి పోయింది.

మరునాడు ఈ ముసలాయన ఇరవైమూడో క్రాసు రోడ్డు మొదటి ఇంటిముందు నిలబడి ఏదో తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. ఆయనముఖంలో విచారం నాలుగుచెంగులు పరుచుకు కూర్చున్నది. భయము తత్తరపాటు అటు ఇటు పరుగెత్తుతున్నాయి:

ముక్కూ-ముఖం తెలియని వాళ్లింటికి వెళ్లి తలుపు కొట్టి పలుకరించాలంటే ఎవరికైనా బెరుగ్గానే ఉంటుంది.

కాసేపు తటపటాయించి, 'అంతే అయిఉంటుంది.' అనుకొన్నాడు. అంతకు పూర్వం మూడురోజులనుంచీ ప్రతిరోజూ ఆపిల్ల ఆ కిటికీలో కూర్చుని ఉండేది. ఇవ్వాళ కనపడకపోవటం ఏమి? లోపల మనుష్యులున్నట్లు అలికిడికూడా ఏమీలేదు.

అప్పటికీ ధైర్యంచేసి ఒకటిరెండుసార్లు పిలిచాడు ఎవ్వరూ పలకలేదు. 'ఏమిటి ఇది! అనుకున్నంత పని అయిపోయిందా ఏమిటి కర్మం!' అని అనుకొని ఆయన రోడ్డుమీదికి వచ్చి నిలబడ్డాడు.

ఆ యింటికి సరిగ్గా ఎదుటయింట్లో ఉన్న ముసలమ్మ, పాలచెంబుతో వస్తున్నది సరిగ్గా ఆసమయానికే. ఈపెద్దమనిషి రెండు అడుగులు ముందుకువేసి 'అక్కయ్యా ఈయింట్లో ఎవరూలేరా ఏమిటి?' అని అడిగాడు.

ఆ ముసలమ్మ కళ్లకు చెయ్యి అడ్డంపెట్టుకొని చూచి ఈయనను గుర్తించి, 'నువ్వా, ఎవరో అనుకొన్నాను. ఈయింట్లో నిన్నటిదాకా ఉన్నారు ఎవరో ఒకతల్లీ, పిల్లానూ! మరిఇప్పుడు లేరేమో! అయితే ఒకటి. తెల్లవారుజామున ఇక్కడికేదో బండివచ్చింది. ఎవరో ఎక్కి వెళ్లిపోయినారు.' అన్నది.

ఇంక ఆముసలమ్మతో ఆట్టేసేపు మాట్లాడవలసిన అవసరంలేదని ఆయన వెంటనే నిశ్చయించుకొన్నాడు. ఇంకెందుకూ! కావలసినది అయిపోయింది. ఆ రాత్రే జాగ్రత్తపడాలిసింది! ఇప్పుడు ఏమనుకొంటే ఏమి లాభము!

ముసలాయన చాలా వ్యాకులతపొందాడు. ఈ ఘోర కార్యం జరగటానికి తనబాధ్యతకూడా కొంత ఉందనుకొన్నాడు.

ఎప్పుడైతే ఆకుర్రవాడిని అనుమానించాడో, అప్పుడే తగిన జాగ్రత్తపడి ఉన్నట్లయితే ఇందాకా వచ్చేదికాదు.

ఈముసలాయన ఇరవైరెండో క్రాసురోడ్డు వంతెనపై కూర్చుని పళ్లు తోముకుంటున్నాడు. తనను పలుకరించిన వాళ్లతో జరిగినకథఅంతా పూసగ్రుచ్చినట్లు చెప్పాడు. 'చెట్టంత మనిషివి నీవు ఇక్కడ ఉండగానే జరిగిందీ ఈపని !' అని వాళ్లు ఆశ్చర్యాన్ని ప్రకటించి వెళ్లిపోయినారు. ముసలాయన మనస్సు చివుక్కుమన్నది. చచ్చిన చావు అయింది. తనకు ఎంత అపకీర్తి వచ్చింది !

పండంటి కాపురం పాడైపోయింది అని కొందరు విచారపడ్డారు. భార్యను ఇంట్లో కట్టేసుకోలేని ఆ వాజమ్మ ఎవరాఅని కొందరు ఆశ్చర్యపోయినారు. ఎవరేమి అనుకుంటేనేమి ఘోరమైన పాపం జరిగిందని అంతా అన్నారు.

ఇంకోవిశేషం ఏమిటీ అంటే, ఆపిల్ల అల్లాగ కిటికీలో నుంచిచూస్తూ ఉన్నప్పుడే చాలామంది అనుకొన్నారట, ఈపిల్ల కాపురంచేసే పిల్లకాదు, ఎప్పుడో ఒకప్పుడు లేచిపోయేదేనని !!

'ఆ రాత్రి బందరునుంచివచ్చిన కుర్రవాడి మాటలను బట్టే నేను ఇంతపనీ అవుతుందని గ్రహించినాను' అని మన ముసలాయన అన్నాడు అందరితోనూ.

వీథివీథి అంతాకూడా ఈ విషయాన్నిగురించే మాట్లాడటం మొదలుపెట్టారు. ఈ సంగతివిన్న ప్రతివాడికి, మళ్ళ ఆసంగతి ఇంకొకడికి చెప్పేందాకా తోచేదికాదు.

ఆపిల్లదే తప్పుఅని కొందరన్నారు. అకవాళ్లదేముంది ఇటువంటి

విషయాల్లో మగవాడే మోసంచేస్తూ ఉంటాడని కొందరన్నారు. పిల్లలను లేవదీసుకు పోవటాన్ని గురించి చాలాచర్చ జరిగింది.

ప్రపంచంలో ఇల్లాంటివి ఎన్ని జరగలేదు! అయినా ప్రతి సారి ఈ విషయం చాలా క్రొత్తగానూ, ఉత్కంఠాహేతువు గానూ ఉంటూ ఉంటుంది.

ఇద్దరు వ్యక్తులు ఒకరినొకరు ప్రేమించుకొని లేచిపోతే, లోకానికి ఇంత హడావుడి ఎందుకో! లోకం మనకెందుకు అని పట్టించుకోకుండా ఉండకమునగద !

ఈసంగతి మెల్లగా ఒక్కొక్క క్రాసురోడ్డే దాటింది. ఇరవై నాలుగో క్రాసురోడ్డులో జరిగింది జరిగినట్లు చెప్పుకొన్నారు. ఇరవై అయిదో క్రాసురోడ్డులో వాళ్ళిద్దరూకూడా ఆస్తితో వెళ్ళి పోయినట్లు చెప్పుకొన్నారు. తరువాత వీధిలో వారికోసం పోలీసు వారు వెదుకుతున్నట్లు తేలింది. ఇరవై ఎనిమిదో క్రాసురోడ్డులో చెప్పుకోటంలో అది ఆరోజునే జరిగిందన్న విషయం జారిపోయి, ఎవరో బందరునుంచి ఒక చిన్నవాడువచ్చి ఆపేటలోఉన్న ఒక పిల్లను లేవతీసుకపోయినట్లు, వారు కొంతసొమ్ముతో పారిపోయి విజయనగరంలో రాణీపేటలో కాపరం ఉంటూన్నట్లు తేలింది. ఈ విచిత్ర ప్రబంధానికి చివరిరెండు ప్రకరణాలు ఇరవైతొమ్మిది, ముప్ఫై క్రాసురోడ్లవారు, అపూర్వమైన వర్ణనలతో చేర్చారు!

ముప్ఫయో క్రాసురోడ్డులో చెప్పుకొన్న వృత్తాంత ము ఇది. బ్రాడీపేటలో ఉన్న బ్రాహ్మణపిల్లను, ఒక నాయుడు కుర్రవాడు లేవతీసుకుపోయినాడు. ఆపిల్ల కొంత సొమ్ముతో కూడా వెళ్ళిపోయింది. వాళ్ళు విజయనగరంలో రాణీపేటలో

కాపురం పెట్టారు. మొగుడూ పెళ్ళాలమని చెప్పుకొన్నారు. వాళ్ళకు ఒక పిల్లవాడుకూడా పుట్టాడు.—ఇదీ కథ.

ఇది ఎప్పుడు జరిగింది అని ఎవ్వరూ విచారించలేదు. ఇంతపాపం ఎక్కడా జరగలేదనిమాత్రం అంతా అనుకొన్నారు. ఇదంతా జరిగేసరికి బాగా పొద్దెక్కింది తొమ్మిది గంటలై యుటుంది.

ఆసమయానికి కాఫీకని ముసలాయన ఇంటికిచేరి, భార్య యిచ్చిన వెచ్చవెచ్చని కాఫీ త్రాగుతూ అన్నాడు. 'ఏయ్! ఆపిల్ల లేచిపోయింది'

'ఏ పిల్ల?' అని ఆవిడ ఆశ్చర్యపోతూ అడిగింది.

'ఏపిల్లా! రాత్రి నీవు బంగారుతల్లి అన్నావే ఆపిల్లే!' అని అంటూ ఆయన మరికొంచెం కాఫీ గ్లాసులో పోసుకొన్నాడు.

ఆ ముత్తైదువ నిశ్చేష్టురాలై, నిలువునా నిలబడిపోయి, తేరుకొని 'ఛా, ఎవరు చెప్పారండీ! మీకు?' అన్నది. 'ఒకరు చెపితే నేను నమ్మేవాడినిగాదు. ఓ అమ్మగన్న పిల్లపై లేనిపోని మాట అంటానికి నాకు మాత్రం మనస్సు ఒప్పుతుందా!' అని ప్రారంభించి గడిచినరాత్రి కుర్రవాడొకడు కనుపించటం, అతడు ఆపిల్లకోసం వచ్చినట్లు తాను అప్పుడే అనుమానపడటం, ప్రొద్దున్నే చూస్తే ఆపిల్ల ఇంట్లో లేకపోవటం, పిల్చినా ఎవ్వరూ పలకకపోవటం, మొదలైన విషయాలన్నీ పూసగ్రుచ్చి నట్లు చెప్పాడు.

ఆమె చేతిలో గ్లాసు అక్కడే జారవిడిచి పరుగెత్తక పోయినా, అంత వేగంగా వెళ్ళింది ఇరవైమూడో క్రాసురో

ద్దాకు. ఆమె ఆ యింటిముందు ఆగి వెనక్కు తిరిగి చూచింది. ఆమెగారి భర్త ఇరవై గజాల దూరంలో ఉన్నాడు! ఆయన వచ్చినదాకా ఆగింది. ఇరవై మూడో క్రాసురోడ్డుమీదఉన్న మొదటి ఇంటితలుపు తీసేఉంది. ఇది ముసలాయన చూశాడు. చాలా ఆశ్చర్యపడ్డాడు. ఇందాక వేసిఉంది. తాను అనుకొన్నది పొరపాటా అని అనుకొన్నాడు గాని, మళ్లీ అట్లా ఎప్పటికీ కాదనే నిశ్చయానికే వచ్చాడు. పిల్ల లేచిపోతే మరి ఇంట్లో ఎవ్వరున్నట్లు? అదో పెద్ద ప్రశ్న ఏమిటి? ఆముసలమ్మ ఉన్నది అనుకొని నవ్వుకొన్నాడు.

ఆవిడను అడిగితే అన్నిసంగతులు తేలిపోతవి ఎందుకింత గుంజాటన! అని అనుకొని ఇద్దరూ లోపల ప్రవేశించారు.

ముసలమ్మ 'అమ్మాయ్' అని పిలిచింది. గదిలోనుంచి 'ఎవరూ?' అని ఒక స్త్రీ కంఠస్వరం వినిపించింది. ఆపిల్లే అయి ఉంటుంది. ముసలాయన తెల్లపోయినాడు. ముసలమ్మగారు గర్వంగా నవ్వింది. ఇంతలో ఆపిల్ల రానేవచ్చింది.

ముసలాయనకు చాలా ఆశ్చర్యమూకలిగింది, విచారమూ కలిగింది ఆపిల్లమీద అంతగా తాను అనుమానపడ్డందుకు. ఇంతలో ఆ అమ్మాయి వెనకాలే ఒక కుర్రవాడూ వచ్చాడు వెండి కాఫీగ్లాసు చేత్తోపట్టుకొని.

ఎవరు ఆ కుర్రవాడు! రాత్రి తానుచూచిన కుర్రవాడే! వీడి ఇల్లు బంగారంగాను, వీడు ఇక్కడే చేరాడన్నమాట! వీళ్లిద్దరు లోపలఉండే పలుకలేదు తాను పిలిచినప్పుడు! పలకటానికి ధైర్యం ఎట్లాగుంటుంది. అందుకనే తలుపులు వేసుకొని లోపల దాక్కున్నారు. ఇల్లాఅనుకుంటూ నుంచున్నాడుఆయన.

ఆపిల్ల ముసలమ్మగారి దగ్గరకువచ్చి ఎదురుగా నిలబడి 'ఏం బామ్మగారూ ఇల్లా వచ్చారు? వచ్చినా సమయానికి వచ్చారులెండి' అని చాపమీద కూర్చోపెట్టి వెండిగ్లాసుతో కాఫీ ముందు పెట్టింది. 'నేను పుచ్చుకొంటానా తల్లీ? పెద్దాన్ని నేను కాఫీ పుచ్చుకొంటానా! అదిగో మీ బాబాయి కియ్యి' అని భర్తను చూపించి. 'ఇదండి బాబాయిగారూ' అని కాఫీ గ్లాసు ఆయన ముందుపెట్టింది ఆ పిల్ల.

'అమ్మ ఎక్కడుందమ్మా' అని అడిగింది ముసలమ్మ గారు. తెల్లవారుజామున రైలుకు వెళ్ళిపోయింది బామ్మగారూ అన్నది ఆపిల్ల. ఈమాట విన్నతరువాత తాతగారికి ఆ అబ్బాయినిచూస్తే ఒళ్ళుమండిపోయింది. ఈ పిల్ల ఒంటరిగా ఉండటం చూచి, ఎలాగో ఆపిల్లను ఇష్టపరచి, ఇంట్లో ప్రవేశించిన దుర్బుద్ధి అకురవాడు! అందువల్లనే ఆయనకు ఒళ్ళు మండిపోతున్నది. ఆ యింట్లో కాఫీత్రాగటానికికూడా ఆయనకు మనస్సు ఒప్పింది కాదు. అందుకని నిస్సారంగా, ముఖం చిట్లించి అతనివంక చూస్తూ, 'రాత్రి నీవేకదూ మా యింటిముందు వంతెనపైన కూర్చున్నది!' అని అడిగాడు కఠినంగా. ఆ అబ్బాయి 'అవును నేనేనండీ' అన్నాడు వినయంగా.

'ఈ పిల్లకోసమే నీవు తిరుగుతున్నట్లు నాకు రాత్రే అర్థమైంది!!' అని నవ్వాడు ముసలాయన.

'ఉన్న సంగతే అదిగదండీ' అన్నాడు కుర్రవాడు.

'ఎన్ని రోజులుతిరిగావు?' తాతగారికి కొద్దిగానవ్వువచ్చింది.

'మూడురోజులు, నిన్న మూడోరోజు!'

'ప్రసన్నురాలిని చేసుకొన్నావన్నమాట!'

'ఒక విధంగా?' అన్నాడు ఆ కుర్రవాడు తలవంచుకొని.
ఇంకా నయమే సమయానికి వచ్చాను. ఆలస్యం అయితే నేను అనుకొన్నంతపనీ అయ్యేది! ఈ పిల్ల నీకేదో బంధువన్నావుకదూ! ఎందుకు అల్లా అన్నావు?' అన్నాడు ముసిలాయన.

'బంధువేనండి' అని కుర్రవాడు చిరునవ్వు నవ్వాడు.

ముసలాయనకు ఒళ్ళు మండిపోయింది. ఈ పిల్లవాడు ఇలాగ ధైర్యంగా సిగ్గూ బిడియంలేకుండా చెబుతూన్న జవాబు చూచి 'ఏమౌతుంది ఆ అమ్మాయి నీకు?' అని అడిగాడు గట్టిగా. గర్జించాడు భయంకరంగా.

కుర్రవాడు తెల్లముఖంవేస్తాడని అనుకొని ముసలాయన ఆకుర్రవాడివంక తీక్ష్ణంగా చూశాడు. ఆ అబ్బాయి సిగ్గు పడుతూ, ఆపిల్లవంకచూచి 'ఏమౌతావే నాకు నీవు!' అనిఅడిగాడు.

ఆ పిల్ల ముసిముసినవ్వులు నవ్వింది సిగ్గుతో తలవంచుకొని.

ఆకుర్రవాడు ఆయనవంకచూస్తూ 'చిన్నతనంలోనే మాకు పెండ్లి అయింది. అప్పుడు ఈవిడనుచూపి అంతా, 'నీ పెళ్ళాము' అనేవాళ్ళు. నన్నుచూపి ఆవిడతో 'నీమొగుడే!' అనేవాళ్ళు. ఇప్పుడు కాస్త తారుమారు అయింది ఆ వరస. ఆవిడేనాకు మొగుడు అయి కూర్చున్నది. ఆవిడ మొగుడితనం భరించలేకే నేను పోట్లాడి యింట్లోనుంచి వెళ్ళిపోయి, బజార్ల వెంట తిరిగాను ఈ మూడురోజులు. పోయినరాత్రే కాస్త రాజీ కుదిరింది' అన్నాడు.

ముసలాయన, ముసలమ్మకూడా ఒకరిమొగాలు ఒకరు చూచుకొని నవ్వుకొన్నారు. ముసలాయన ఆ అబ్బాయిని కౌగ

లించుకొని హృదయానికి అదుముకొంటూ 'భలేవాడివోయ్!' అన్నాడు.

ముసలమ్మగారు ఆపిల్ల చెక్కిళ్ళు నిమిరి తన కణతలకు నొక్కుకొని, 'చెప్పలేదండీ! మా అమ్మాయి బంగారుతల్లి అని!' అని అన్నది.

ముసలాయన ఆ అమ్మాయి ఇచ్చిన కాఫీ పుచ్చుకొని, ఇరవై మూడో క్రాసు రోడ్డునుంచి ముప్పైరెండో క్రాసురోడ్డు అవతలదాకా నడిచివెళ్ళాడు ఆపిల్లసంగతియెత్తిన ప్రతివాడిని 'ఛా, నోరుమూయ్ ఎవర్రా ఈసంగతిచెప్పింది నీకు!' అని కోప్పడుతూ.

బాపట్ల - టు - బెజవాడ

రైలు నడుస్తూంటే మనలో ఉండే ప్రాణవంతములైన పదార్థాలన్నీకూడా కదిలి మనకు ఉత్సాహాన్ని సంతోషాన్ని కలుగజేస్తాయి.

అందుకనే రైల్లో ప్రయాణంచేస్తున్నప్పుడు ఎక్కువగా మాట్లాడుతాము. కొత్తస్నేహాలు ఏర్పడటాని కీరైలు ప్రయాణాలు ఎక్కువగా తోడ్పడుతవి.

ఇద్దరు పండితులు మాపెట్టెలో ఎదురెదురుగా కూర్చున్నారు: ఏదో భాషావిషయకమైన చర్చజరుగుతూ ఉంది. రైళ్ళు ఇల్లాగ కిక్కిరిసిపోవడానికి కారణాలు ఏమైంది చర్చిస్తున్నారు ఒకమూల. కొందరు ఎన్నికలనుగురించి, చర్చ జరుపుతూ ఉన్నారు. ఆ చివరబెంచీమీద వాళ్ళు, హిట్లర్ స్టాలిన్ చర్చిల్ అన్నమాటలు ఉపయోగిస్తూ రాజకీయాలు క్షామాలు మాట్లాడు కొంటున్నారు.

ఒక బెంచీమీద ఒక బట్టతలఆయన కూర్చున్నాడు. ఆయనకు ఎదురుగా ఒకఅమ్మాయీ ఒకపిల్లవాడూ ఉన్నారు. ఆపిల్లవాడికి అయిదారుయేండ్ల వయస్సు ఉంటుంది. వాడు ఆబట్టతలవంక ఆశ్చర్యంగాచూచి వాళ్ళమ్మను బుగ్గా బుగ్గా పొడిచి, 'అదేమిటి ! ఆయనతలకాయ అట్లా ఉందేమే అమ్మా' అని విసుగులేకుండా అడుగుతున్నాడు. పాపం ఆఅమ్మాయి వాడినోరు గట్టిగామూసింది. ఆపిల్లవాడు తన్నుకొన్నాడు. వాళ్ల అమ్మ వదిలేసింది. వదిలివేయడంతోనే మళ్ళీ ఆప్రశ్న అడిగాడు.

ఆయన తలమీద ఒక్క వెంట్రుకైనా లేకపోవడం వాడి ప్రాణానికి అతి విచిత్రంగా ఉంది. వాడు పుట్టి పెరిగిన తరువాత అంత విచిత్రాన్ని ఎప్పుడూ చూచి ఉండడు. ఆ తల ఒకసారి ముట్టుకోవలెననీ, వీలైతే చంకన పెట్టుకొని ఇంటికి తీసికెళ్ళి దానితో ఆడుకోవలెనని వాడికి ఊహాలు కలిగి ఉంటై. కాని వాళ్ల అమ్మ వాడినోరు నొక్కి అదిమిపెట్టి ఉంచుతూ ఉన్నది.

సరిగ్గా నాముందున్న ఈ ఇద్దరు పండితులూ భాషా విషయక చర్చ బాగా సాగిస్తున్నారు. ఒక చిన్న మాటను ఎట్లా ఉచ్చరించాలె అన్న విషయంపై ఆ యిద్దరూ పెద్ద తగాదా పెట్టుకొన్నారు.

'మధ్యాహ్నము' అన్న శబ్దము ఉచ్చరించటం ఎల్లాగూ అని ప్రశ్న. అక్కడ హాకింద నాఒత్తు ఉన్నా నా కింద హా ఒత్తు ఉన్నట్టుగా పలకాలని ఒకాయన. హా క్రింద నా ఒత్తు ఇచ్చి నా క్రింద హాఒత్తు ఇచ్చినట్లు పలకటం ఏమిటీ, ఇదెక్కడి అన్యాయం, అంటాడు మరో ఆయన. ఈ విషయంమీద వాదన పెరిగి పోయింది.

* మధ్య + అహ్నము = మధ్యాహ్నము అయింది. హా క్రింద నా ఒత్తు ఇచ్చినట్లే పలకాలంటాడు ఈ పండితుడు.

ఆ పండితుడు అల్లాగ పలకటానికి వీల్లేదు అంటాడు. హాను ఉచ్చరించటం కష్టమై, మధ్యః + అహ్నము., మధ్యాహ్నము, మధ్యానహాము, మధ్యాన్హాము అయిందీ అంటాడు. ఆయన వ్యాకరణం ప్రమాణం అంటాడు. ఈయన జనవాక్యం ప్రమాణం అంటాడు.

---

* సవర్ణ దీర్ఘ సంధి.

ఈయన తన వాదాన్ని నిలబెట్టుకోంటానికి అయిదు కారణాలు చూపాడు.

కాని వ్యాకరణరీత్యా ఆయన వాదన ఏమాత్రం నిలవలేదు. భాషా పరిణామ శాస్త్రంలోనుంచి అవతల ఆయన పదికొండు సూత్రాలు వల్లించాడు తన వాదన నిలుపుకోంటానికి.

ఈగొడవ ఏమిటో ఎవరికీ అర్థంకావడంలేదు, అయన గొంతెత్తి మాట్లాడడము మొత్తంమీద చాలా తమాషాగానే ఉంది.

చివరకు ఏమైంది అంటే ఈయన చూపిన అయిదు కారణాలు, ఆయన చూపిన పదకొండు కారణాల ముందూ ఎందుకు పనికిరాకుండా ఎగిరిపోయినయ్. అర్థం కాకపోయినా ఒక వాదన నిలిచిందని, ఒకరివాదన నిలబడలేక పోయిందనీ నేను ఎట్లా గ్రహించగలిగినానని సందేహ పడనక్కరలేదు. నాకు వచ్చిన తర్కశాస్త్రంవల్ల ఆ విషయంలో ఒక నిర్ణయానికి రా గలిగాను. తర్కశాస్త్రరీత్యా అయిదుకంటే పదకొండు పెద్ద అందుకని (గట్టివి) పదకొండు కారణాలు మరితులుగల వాదికే జయము కలిగింది అనుకోటంలో తప్పు ఏమీలేదు.

§ ఒక వస్తువు రెండవదానికంటే పెద్దదైనప్పుడు, రెండవ దానితో సమానమైన వస్తువుకంటే మొదటిదానితో సమానమైన వస్తువు పెద్దది.

§ When one thing is greater than another, that which is equal to the first is greater than that which is equal to the second.

అయితే మొత్తంమీద వైయ్యాకరణికి చాలా కోపం వచ్చింది. భాషా తత్వవేత్తకుకూడా మంచి కోపంవచ్చింది. తెనాలిస్టేషను వచ్చిందాకా కూడా ఇల్లాగ వాద ప్రతివాదాలు పెరిగిపోయినయ్. ఆ స్టేషనులో మధ్యాహ్న పండితుడు దిగి పోతూ మధ్యాన్న పండితుడి వైపు కొరకొర చూసిపోయినాడు. మధ్యాన్న పండితుడు, ఆయన దిగిపోవటంతోనే తలుపు కావన బిగించి వేశాడు కోపంతో.

ఇంతలో రాజకీయాలు మాట్లాడుతూ ఉన్నచోట కాస్త ఘర్షణ సాగింది. అక్కడ మాటలు ఇల్లాగ నడిచినయ్.

'హిట్లర్ లోకాన్ని అంతా జయించాలని ఆశపడ్డాడు. అందుకనే అల్లాగ అతః పాతాళానికి పడిపోయాడు. స్టాలిన్ అలాగ కాదు.'

'అదేమన్నమాటలెండి! ఇప్పుడు స్టాలిన్ మట్టుకు ఏం జేస్తున్నాడు? కమ్యూనిస్టులను ప్రతిదేశంలోనూ లేవదీశాడు. వాళ్ళు అన్నిదేశాలలోనూ తయారైనారు. వాళ్లద్వారా తన పలుకుబడిని వృద్ధిచేసుకోవాలెనని చూస్తున్నాడు.'

'కమ్యూనిష్టులను అతనేమీ లేవదీయటంలేదు. వాళ్ళే లేస్తున్నారు.'

'మరి ఎట్లా పుట్టినై కమ్యూనిష్టు ఉద్యమాలు? వీటి వెనకాల స్టాలిన్ చెయ్యివుండి తీరాలె!'

అలా అనడం చాలా అసమంజసంగా కనపడ్డది ఇవతల ఆయనకు. చాలా విసుగుతో ఇలా అన్నాడు.

'రష్యాలో ఒక చక్కని ప్రభుత్వం ఏర్పడ్డదనీ అల్లాంటి ప్రభుత్వంలో ప్రజలంతా సుఖంగా జీవిస్తారనీ, గట్టి నమ్మకంగల

వాళ్లే కమ్యూనిస్టులు అవుతున్నారు. కాని వాళ్లనందరినీ స్టాలిన్ పురికొల్పుతూ ఉన్నాడు అనడం అన్యాయం. సాయం చేయడానికి వస్తే ఎంతమందికని సాహాయ్యం చేయగలడు? అది సాధ్యమా? '

ఇంతవరకూ ఊరుకొన్న ఆయన ఒకడు రష్యా రాజనీతిని ఇంకో విధంగా సమర్థించినాడు. అదో చిన్న ఉపన్యాసం. మాటలు ఒత్తి పలుకుతూ, పళ్ళు బిగిస్తూ, చేతులు ఆడిస్తూ ఆయన అన్నాడు.

'ఎక్కడైతే, ప్రపదేశంలో అయితే, ఏదేశంలో అయితే, ఏఖండంలో అయితే, ప్రజలు, నోరులేని మూగప్రజలు, బాసిసత్వంలో ఉండి దాస్య శృంఖలాలను తెంచివేసి స్వేచ్ఛకోసం, స్వాతంత్ర్యంకోసం ప్రయత్నాలు ప్రారంభిస్తారో, ఆయా దేశాలలో, ఆయా ప్రజా సమూహానికి దాస్యవిముక్తి కలిగేందుకు రష్యా పూనుకొంటుంది. తత్ ఫలప్రాప్తికై సర్వ ప్రయత్నాలూ చేస్తుంది? ఇందులో తప్పేమిటి? ఇందులో దుర్మార్గం ఏముంది? నీతిబాహ్యమైన పనా ఇది? ధర్మవిరుద్ధమా?'

ఈ భీకరగర్జనలు విని ఎవ్వరూ మాట్లాడలేకపోయినారు. ఒక్కడు నోరెత్తలేకపోయినాడు. చాలామందికి భయంవేసింది. భయపడిపోయి అంతా ఊరుకొన్నారు.

కాని ఒక్క మెల్లకన్ను ఆయనమటుకు ఈవిషయాన్ని అంగీకరించక పెద్దగా అరిచాడు.

'ప్రజలందరూ సుఖంగా ఉండాలనీ స్వేచ్ఛ అనుభవించాలనీ కోరేది ఇగ్లండుకాని రష్యాకాదు. చర్చిల్ కు అలాంటి

భావాలు ఉన్నాయి అనండి ఎవరైనా నమ్ముతారు. పదిమంది మెచ్చుకోదగిన మాట అది ! అంతేకాని రష్యా ఏమిటి? ప్రపంచ కళ్యాణానికై పాటు పడటం ఏమిటి? దాస్యవిముక్తికై రష్యా ఏమిటీ కృషి చేయుటం ఏమిటి? వట్టిమాట ! స్వేచ్ఛ అన్నమాట అసలు ఇంగ్లండులో పుట్టింది.'

'ఓస్. చర్చిల్ మహా పెద్దసహాయ్యం చేస్తున్నాడు కామాలు దాస్యంలో ఉన్నవాళ్ళకు ?'

'ఆ, చేస్తున్నాడు. అపారమైనకృషి చేస్తున్నాడు. అబద్ధమనితోస్తే, అట్లాంటిక్ చార్టరును అడుగు ?'

'అదొక అబద్ధ ప్రబంధము !'

'నీదొక అసందర్భ ప్రలాపము.'

రఘారఘా ఇలాగ అనుకొని వీళ్ళిద్దరూ ఊరుకున్నారు. ఆ తరువాత పెట్టెలో ఉన్నవాళ్ళంతా మాట్లాడారు. 'చర్చిల్ స్వాతంత్ర్యానికై పోట్లాడుతున్నమాట నిజం !' అన్నాడు ఒకాయన. 'ఛా, ఛా, వట్టిమాట. అసలు రహస్యం మీకు తెలియదు. చర్చిల్ చిన్నజాతులకు ఇనుప సంకెళ్లు వేస్తున్నాడు.' అన్నాడు ఇంకొకాయన. 'రైట్ అదీ సంగతి. రష్యా ఒకటే మానవస్వేచ్ఛకై ప్రయత్నిస్తున్నది,' అని మరొకరు. మొత్తం మీద పెట్టెలో ఉన్నవాళ్ళలో, సగంమంది స్టాలిన్ వైపు, సగం మంది చర్చిల్ పక్షం వహించారు. దానితరువాత తీవ్రమైన వాదన జరిగింది.

చర్చిల్ పార్టీవారు అంటే మన మిత్రమండలివారు, ఈ వాగ్యుద్ధంలో మొదట బాగా పురోగమించారు. పిడుగులు

కురిపించారు. శత్రుమండలివారు ఇతోధికంగా తిరోగమించాల్సి వచ్చింద్ది.

తమాషా ఏమిటంటే అపెట్టెలోనేకొందరు ఏపార్టీకీ చెందకుండా ఉన్నవాళ్ళు ఉన్నారు. ఈయుద్ధములో ఎవరికి కాస్త జయముకలుగుతున్నదని తోస్తే వారితోచేరి రెండో పార్టీవారిని చూచి నవ్వటమే వీరిపని. ఈతంతు అంతులేకుండా పొయ్యేదేకాని ఒక అసామికి ఈగొడవంతా చూస్తే చాలా చికాకు గలిగిందో ఏమో, పెద్దగానే కేకపెట్టాడు. 'ఎందుకయ్యా ఇదంతాను. నేనొక్కమాట చెబుతాను వినండి.'

అంతా నిశ్శబ్దంగా కూర్చున్నారు. ఆనిశ్శబ్దతను బద్దలు చేస్తూ అన్నాడు, 'చర్చిల్ పట్టి ఉబద్ధాలకోరు!!'

ఈమాట అనీ అనటంతోనే, స్టాలిన్ పరమదొంగ' అని ఎవరో పోలికేకపెట్టారు దానికి జబాబుగా !

ఈ కేకలువిని అంతా నవ్వారు.

ఈ కేకలతో తనవాళ్ళకందరికే తలవంపులైనట్లు తలచి ఆ బట్టతల ఆయన చాలా ఈసడింపుగా అన్నాడు 'వెధవ చర్చిల్ పోనిద్దురూ' అని.

ఎదురుగా ఉన్న మెల్లకన్ను ఆయన చుట్ట నోట్లోనుంచి తీసి తుబుక్కున ఉమ్మేసి 'వెధవస్టాలిన్ పోనిద్దురూ' అన్నాడు రవీమని దెబ్బకుదెబ్బ కొట్టినట్లు !!.

అందరూ ఊరుకొన్నారుకాని ఈ యిద్దరికే వాదన పెరిగి పోయింది. రపా, రపా మని గుండ్లు పేలినట్లు మాటలు పడి పోయినయ్. ఆ తరువాత సంభాషణ ఇట్లా జరిగింది.

'స్టాలిన్ వట్టి దుర్మార్గుడు'

'చర్చిల్ వొట్టి దుర్మార్గుడు!'

'స్టాలిన్ పక్కా దొంగ'

'చర్చిల్ రెండు పక్కల దొంగ'

'మాటలు మిగులుతున్నావ్ సరిగ్గా రానీయ్'

'నీవే సరిగ్గా రానీయ్'

'ఆ వెధవ స్టాలిన్‌ను, పట్టుకొని ఏదో లోకకళ్యాణం అనీ, రుధిరజ్వాలలనీ, అంటే నాకు ఒళ్ళు మండిపోతుంది.'

'ఆ చవట చర్చిల్‌ను పట్టుకొని వాడేదో మానవ సౌభాగ్యానికి పాటుపడుతున్నాడనీ, స్వేచ్ఛ అనీ, దాస్యవిముక్తి అనీ అంటే నాకూ ఒళ్ళు భగ్గుమంటుంది. వాడో వెధవన్నర!'

'ఇంక చాల్లే ఊరుకోవయ్యా!'

'ఏమిటయ్యా ఊరుకునేది! ఎందుకు ఊరుకోవాలే? మహా డబాయిస్తున్నావే? నిజం మాట్లాడటానికి భయం ఎందుకూ?

'గట్టిగా చెబుతున్నాను విను, చర్చిల్ ఒట్టి బడాచోర్ అంటే పెద్ద దొంగ'

'స్టాలిన్? స్టాలిన్ వట్టి లఫంగు అంటే పెద్దదుర్మార్గుడు.'

రోషాలు పెరిగినయ్.

'సిగ్గులేకపోతేసరి నోరుమూయవోయ్' అన్నాడు మెల్లకన్ను ఆయన. నువ్వునోరుమూయ్— వెధవయ్యఅన్నాడు బట్టతల ఆయన. అని చెయ్యి ఎత్తాడు. చూస్తూ ఉండగానే ఒకరిమీద ఒకరు కలియ బడ్డారు. స్టాలిన్ పార్టీవారు అంతా లే

చారు. నానా గొడవగా ఉంది. అంతా మాట్లాడుతున్నారు. ఒకరిమాట ఒకరు వినిపించుకోటం లేదు.

ఇంతలో ఒకపెద్దమనిషిలేచి 'అయ్యా, తమకు ఐకమత్యం లేకపోవటం ఎంత విషాదకరమైన విషయము' అని గొంతెత్తి పెద్ద పొలికేకలు పెట్టాడు.

ఆ కేకలువిని ఎక్కడివాళ్లు అక్కడే గప్‌చిప్‌గా చతికల బడ్డారు. రోషాలూ, కోపాలూ, నిమిషంలోకి చల్లారినయ్.

అంతా ఆక్రొత్త వ్యక్తివంక విచిత్రంగా చూస్తున్నారు. అంత పెద్ద పోట్లాటా నీటిబుడగలాగ అణిగిపోయింది.

ఆ క్రొత్తమనిషి నుంచుని ఒక చిన్న ఉపన్యాసం ఆరంభించాడు. వేసుకొన్నవి కొద్దిగా మాసిన చొకబారు ఖద్దరు బట్టలు. ఏదో కాస్త గౌరవంగల మనిషిమాత్రం అవును. ఇల్లా చెప్పాడు.

'ఎన్నికలు త్వరలో వస్తూన్నాయి. మనదేశంయొక్క భవిష్యత్తు అంతా మీ ఓటుపైనే ఆధారపడి ఉన్నది.

ఆరోజనమీరు ప్రొద్దున్నే స్నానంచేసి ఇష్టదేవతా ప్రార్థనచేసుకొని, ఆ ప్రాళంగా బయలుదేరిపోయి మీ ఇష్టంవచ్చిన వారికి ఓటును ఇవ్వాలె.

మీరు ఏపార్టీకైనా చెంది ఉండండి. మీఓటు ఎవరికైనా ఇయ్యండి. అదంతా నాకేమీ అవసరంలేదు. కాని 'ఓటుమట్టుకు ఇయ్యటం అవసరము.'

అంతా నిశ్శబ్దంగా వింటూంటే ఆయన బాగా గొంతెత్తి చేతులు ఊపుతూ కళ్ళు ఎగరేస్తూ ఇల్లా ఉపన్యసించాడు.

ఒక్కొక్కప్పుడు ఒక్క ఓటు తక్కువై మన నాయకుడు ఓడిపోవటం కూడా జరుగుతుంది !!

నీవు ఆవోటు ఇయ్యలేదనుకో ! అప్పుడేమన్నమాట ? నీవోటు లేకపోవటంవల్ల ఆ నాయకుడు ఆ రోజున ఓడిపోయినాడు ! నీవు వెళ్ళి ఓటువేసిఉన్నట్లయితే ఆయన గెలిచేవాడు.!!

నీకు కడుపునొప్పిగా ఉంది. అందుకనే నీవు వెళ్ళలేదు. చాలా ప్రయత్నించేశావు వెళ్ళాలని ! ఇంగువ మ్రింగావు ! కాని ఆపాడునొప్పి - తగ్గలేదు !! సాయంత్రం ఆరుగంటలదాకా బాధపడుతునే ఉంటివి !! పాపం, ఏంజేస్తావ్రా?...

అయితేనేం !, ఆరోజు నీవు వెళ్ళకపోవటంవల్ల ఎంత ప్రమాదం జరిగిందో చూడు ! ఆనాయకుడు ఆ రోజున, బండ్లకూ, పెట్రోలుకు, ఎన్నివందలు ఖర్చుపెట్టాడో ! ఎంతశ్రమపడ్డాడో ! ఒక్క వోటుతో పోయిందిగదా ! నీవొక్కఓటు పడకపోవటంవల్లనేగదా అతడు ఓడిపోయింది! అతని ధనవ్యయం అయింది. శ్రమపడ్డాడు కాని అంతా వృధా ! వృధా ! నీమూలంగా వృధా !

అయితే అలాంటి అత్యవసరమైనపని వచ్చినపుడు ఇల్లాంటి కడుపునొప్పి వస్తే బాధపడుతున్నా ఊరుకోవలసిందేనా?

నీవు కోర్టులో పదిగంటలకు హాజరుకావాలె. లేకపోతే ఎక్సుపార్టీ అవుతుంది. కొన్నివేలరూపాయలు నష్టం. కడుపునొప్పి వస్తుంది. వెళ్ళలేవు. ఏంజెయ్యాలె ?"

అంతా జాగ్రత్తగా వింటున్నారు. అతడు ఉద్రిక్తుడై బల్లగుద్దుతూ ఉపన్యాసం సాగించాడు ?

'ఇటువంటి సందర్భాలు అనేకం రావచ్చు! కడుపునొప్పి వల్ల నీవు ఓటువియ్యలేక నీనాయకుణ్ణి ఓడిస్తావా?

ఆ నాయకుడు ప్రభుత్వంలోకి వెళ్లి ప్రజల భావిభాగ్యోదయంకోసం ఎంత పాటుపడేవాడో! దేశానికి ఎంతమేలు జరిగేదో!

కాబట్టి నీ కడుపునొప్పివల్ల భారతదేశానికి రానున్న గొప్ప భాగ్యం శకీమని ఆగిపోతుంది.

ఇలాంటి అసందర్భములైన అకాలములైన కడుపునొప్పులను మనం ఇకముందు ఎదుర్కొనాలిసి ఉంది.

వాటి దుర్మార్గాలను, వాటిదౌర్జన్యాలను మనం సహించకూడదు.

ఇట్టి కడుపునొప్పులు వచ్చినపుడు వెంటనే అణగద్రొక్కి మనం మన ఓటును వినియోగించాలె.

ఓటు ఇవ్వటం మనజన్మహక్కు. దానిని ఏకడుపునొప్పి గాని అడ్డుపెట్టకూడదు. మన జన్మహక్కులను మనం అనుభవించకుండా చేస్తున్న ఈకడుపునొప్పులను ఎదుర్కొనటం ఏలాగా అనేదే ఇప్పుడు మన భారతదేశాన్ని పీల్చి పిప్పిజేస్తున్న సమస్య!

ఈసమస్యా పరిష్కారానికి మనం అంతా ఏకంకావాలె. ఇది అందరినీ పీడిస్తున్నది! కాంగ్రెసు, కమ్యూనిస్టు, ముస్లిమ్ లీగు—అందరినీ పీడిస్తున్నది. జాతి, కుల, మత విచక్షణ లేకుండా అందరినీ కడుపునొప్పి బాధిస్తున్నది.

కడుపునొప్పి బాధకు గురియై, ఏమూడుసంవత్సరము లకో ఒకసారి లభించేటువంటి ఇట్టి అమూల్యమైన, అపూర్వ

మైన స్వర్ణావకాశమును పోగొట్టుకుంటానికి ఏ భారత యువకుడు ఒప్పుకుంటాడు !

ఒప్పుకోడు !

ఇట్టి నీచాతినీచమైన కడుపునొప్పులను నశింపజేయుటానికి ఒకటే రాజమార్గం ఉన్నది.

అది ఏది ?

ఒకే మాట ఒకే బాట ఒకే బాణము.

ఒకటే దేవుడు ! ఒకేమందు.

ఏకమేవాద్వితీయం !

ఆ ఒక్క-మార్గం ఏమిటి ?'

ఈ ఉపన్యాసంతో శ్రోతలంతా నిశ్చబ్దులై పోయినారు. ఆశ్చర్య విస్మయాలలో మునిగిపోయినారు. ఉపన్యాసకుడు గొంతు కొంచెం తగ్గించి మళ్ళీ ఇలా అన్నాడు.

'కడుపునొప్పులను నశింపజేయటానికి మార్గం చెబుతున్నాను వినండి సోదరులారా ! ఈ పొట్లంలో ఉన్న చూర్ణాన్ని, ఒక గ్లాసులోవేసి కాసిని వేడినీళ్ళుపోసి పుచ్చుకోవాలె ! వెంటనే కడుపునొప్పి మాయంఅవుతుంది, ఇది సత్యం ! పొట్లం వెల ఒక అణా !'

'ఈ అమ్మకం నాస్వంతలాభంకోసం కాదు. ఎన్నికలు జయప్రదంగా జరగటానికి, ఎవ్వరుగాని కడుపునొప్పివలన ఆగిపోకుండా ఉండేందుకు, అన్నిఓట్లు పోల్ కావటానికి నేను ఈ పనిచేస్తున్నాను. భారత పుణ్యభూమికి నేను చేస్తూఉన్న సేవ ఇదే !'

ఆకస్మాత్తుగా అందరికీ కడుపునొప్పి వచ్చినట్లు తలాఒక పొట్లం కొనేశారు. గాంధీజీకీ జై అనే నినాదాలతో ఆ దృశ్యం ముగిసింది.

ఇంతలో బెజవాడస్టేషన్ రావటంవల్ల అందరూ పెట్టె బేడాదింపుకొని చాలా సంతోషంతో నవ్వుకొంటూ వెళ్ళిపోయినారు. 'మధ్యాహ్న' పండితుడూ, బట్టతల ఆయనా, మెల్లకన్ను ఆయనా, అంతాకూడా సంతోషంగా దిగిపోయినారు.

'ఇంతేగదా! ఈ ప్రపంచంలోనుంచి వెళ్ళిపోతాము సమయము వచ్చేసరికి! ఈలోపున ఉన్నస్వల్పకాలంలో, రోషాలూ కోపాలు! అన్నైనా క్షణికము! వెళ్ళిపోయేటప్పుడు అంతా మరిచిపోతాము. నవ్వుకుంటూ ఈలోకాన్ని విడిచిపోవాల్సిన రోజు ఎప్పుడోవస్తుంది మన అందరికీ!' అన్నాడొక ముసలాయన.

తీర్పు

మా నాన్న చాలాకాలం స్కూలుమాస్టరీ ఉద్యోగం చేసి రిటైరు అయినాడు. ఆయన పిల్లలకు బహుఓర్పుగా చదువు చెపుతాడు. కాని ఈ ముసలితనంలో ఆయనకు ఓర్పు కాస్త తక్కువై కోపం ఎక్కువైంది.

మా రఘూకు అక్షరాభ్యాసంచేసి కాస్త దారికి తీసుకొని వచ్చింది మా నాన్నే. ఆయన ముఖ్యంగా మనుమడికి లెక్కల్లో మాంచి తరఫీతు ఇచ్చాడు. ఎంతపెద్ద లెక్క అయినా ఇట్టే చేశేసే శక్తి రావాలంటే ముందు భయం ఏమాత్రం ఉండ కూడదు. ఇంత పెద్దలెక్క నేను చెయ్యగలనా అనే అధైర్యం ఉండకూడదు. మా రఘూకు ఈ ధైర్యం ఒకటి కుదిరింది. ఎంత పెద్ద లెక్క ఇచ్చినా అధైర్యపడక నోటితోనే చేసివెయ్యటానికి ప్రయత్నిస్తాడు. అంత అలివిగాకపోతే అప్పుడూ పలకా బలపం తీసుకోటం.

ఎనిమిది తొమ్మిదేండ్ల వయస్సులో పిల్లల మానసికస్థితి బహు విచిత్రంగా ఉంటుంది. తెలిసీ తెలియని వయస్సు. వాళ్ళ ఊహాలుకూడా బహుతమాషాగా ఉంటవి. వాళ్ళ పోకిళ్లు తెలియకపోతే వాళ్ళు వేసేప్రశ్నలు విసుగు పుట్టిస్తయి.

మానాన్న అసలు ఓపికమనిషే కాని ఆరోజున ఎందుకో కోపంవచ్చి పిల్లివాడిని కాస్త కోప్పడి ఒకదెబ్బ వేశాడు. మా ఆవిడ రఘూను మహా గారాబం చేస్తుంది. ఒడిమీద ఈగ వాలితే గిలగిల లాడుతుంది.

ఆరోజున భోజనాలైన తరువాత రాత్రి పదిగంటల వేళ మాకాంతం ఈ ప్రసంగం తెచ్చింది. ఎందుకు కొట్టాలె పసివాణ్ణి, ఎందుకు చెయ్యాలంటూ !!

నేను సర్దిచెప్దామని ఎంతో ప్రయత్నం చేశాను. విషయం మార్చాను. నా ప్రయత్నాలేవీ అక్కరకు రాలేదు. పసివెధవను అనవసరంగా అంతదెబ్బ కొట్టాడని ఆవిడకు కడుపుల్లో బహు ఇదిగా ఉంది.

ఆవిడను శాంతపరచాలంటే సులభంగా లేదు. ఏదో పెద్దవాడు, ముసలాయన ఓదెబ్బవేస్తే ఏంలే, ఆమాత్రానికి నీవు ఊరికే ఇదతావు ఎందుకూ ? అని కోప్పడితే ఆవిడ ఇట్లా అన్నది.

'తప్పుఉంటే ఓదెబ్బ వేయవచ్చు, అట్లాంటప్పుడు నేనే విూటిసను. నాకుమాత్రం ఆమాత్రం తెలియకపోలేదు. కాని ఏమీ తప్పులేనపుడు వాడి చెవులు పట్టుకొని సాగదీయటం ఎందుకు ? చెప్పండీ. చెవులు రెండూ కందగడ్డలైనై.'

ఉద్రిక్తమై ఈమాటలు చెప్పటంవల్ల, ఆవిడ మనస్సు బాగా కష్టపడ్డట్లు తెలిసింది.

కుర్రవాడిని మానాన్న ఎందుకు కొట్టాడో అంతవరకు నాకు తెలీయదు. తెలుసుకోవాలెనని ప్రయత్నమూ చెయ్యలేదు. ఎందుకో.కోపంవచ్చి కొట్టాడులే అనుకొన్నాను. ఆవిడ ఆ విషయమై అంతగా రొష్టు పడుతున్నపుడు నేను పట్టించుకోకుండా తోసేసెయ్యటానికి వీలులేకపోయింది. విషయం అంతా మొదటినుంచి చివరదాకా విని నిజంగా మానాన్న వాడిని అనవసరంగా కొట్టిఉన్నట్లయితే, 'నాన్నా వాడిని మరీ గట్టిగా కొట్టబోకు' అని చెప్పవలసిన అవసరంవస్తే చెపుదాము, అనుకో

న్నాను. అనుకొని కాంతాన్ని నా మంచానికి పక్కనే ఉన్న కుర్చీలో కూర్చోబెట్టి ఆవిడ చుట్టి ఇస్తూఉన్న తమలపాకుల మడుపులు తీసుకొంటూ 'అది సరే, ఆయన అసలు ఎందుకు కొట్టాడు వీడిని, సంగతేమిటో చెప్పు' అన్నాను.

పొద్దున నేను నడవలో కూర్చుని కూరలు తరుక్కొంటున్నాను. తాతా, మనుమళ్ళు హాల్లో కూర్చున్నారు. విరబోసుకొన్న గిరజాలూ, వీడూ వెధవ ముద్దొస్తున్నాడు. ఆ చిన్న మట్టలాగు తొడుక్కొని, తెల్లచొక్కా వేసుకొని బొసినబొట్లు వేసుకొని కూర్చుంటే దొరబాబులాగున్నాడండీ'. ఇల్లా అంటూ ఆవిడ కొడుకును వర్ణించుకోటంలోకి దిగింది, అసలు విషయం వదిలేసి.

నేనుకూడా ఆ ధోరణిలోకి దిగానా, చిన్నప్పటినుంచి వాడుచేసిన అల్లరులూ ముద్దులూ, అవీ చెప్పుకోటంలోకి దిగుతాము. ఇక దానికి అంతు ఉండదు. అసలు సంగతి తేలకమ్మందే తెల్లారుతుంది.

అందుకని నేనే అన్నాను, ఆవిడతో, ఇదిగో చూడూ, దొరబాబుగారినిగురించి వర్ణనలు అనేకం చెయ్యవచ్చుగాని ముందు అసలు విషయం చెప్పు.

నేను ఇల్లాగ అనటంవల్ల ఆవిడ ఉత్సాహానికి భంగం కలిగినట్లు ఆమె ముఖంలో కనపడ్డది. అయినా ఆవిడ పైకేమీ అనక 'అసలు విషయానికేముందిలెండి. ముసలాయన మనుమడిని దగ్గర కూర్చోబెట్టుకొని చదువు చెబుతూఉంటే ముచ్చటగాఉండి నేనూ అక్కడే కూర్చున్నానుచూస్తూ. వింటున్నారా? నిద్రవస్తున్నదా? అంటూ తమలపాకు ఈనె ఒకటి నాపైకి విసిరింది.

'వింటూనే ఉన్నాను చెప్పు' అన్నాను.

మీనాన్న ఏదోలెక్క ఇచ్చాడండీ వీడికి. వీడు వ్రాసుకొన్నాడు. వ్రాసుకొని చెయ్యవచ్చునా. వెంటనే, చెయ్యక అలాగ చూస్తూఊరుకొన్నాడు. మీరెప్పుడైనా ఏదో కథ ఆలోచిస్తూ ఉన్నప్పుడు ఎల్లా చూస్తారో పిచ్చిగా, అంతా సరిగ్గా అల్లాగేచూస్తూ ఊరుకొన్నాడు అని ఆగి నాముఖంలో ముఖంపెట్టి నవ్వింది కాంతం. కాంతం తనకొడుకును నాలోనూ, నన్ను తన కొడుకులోనూ చూస్తుంది. నాకు తెలుసు ఈ సంగతి. అందుకని నేనూ నవ్వాను.

లెక్క అర్థంగాకనే అల్లాగ ఆలోచిస్తూ కూర్చుని ఉంటాడు అన్నాను నేను.

అర్థం గాకపోవటానికి ఏముందండీ ఆలెక్కలో అన్నది కాంతం.

ఏమిటాలెక్క? అని అడిగాను.

వాళ్ళతాతయ్య ఇచ్చిన లెక్కచూడండి అంటూ కాంతం రఘూ పుస్తకం తెరిచి చదవటం మొదలుపెట్టింది.

మనం ఈఇంటిని రు 950_2_3కు కొని రు 520_15_11కు అమ్మినట్లు అయితే, లాభమా నష్టమా, ఎంత? ఇదీలెక్క.

'ఈలెక్క ఏమంత కష్టమైందికాదే! ఒకదాంట్లో ఒకటి తీసివెయ్యటమేగా? '

ఆ సంగతి తెలియవద్దూ! తెలియకేకామాలు ఏదో ఆలోచిస్తూ ఊరుకొన్నాడు.

ఆ అల్లాకాదు. మనం ఉన్నది అద్దెఇల్లుకదా, ఈ ఇల్లు అమ్మటం ఎల్లాగా అని అనుకొని ఉంటాడు.

అవును ఆమాట నిజమే. అమ్మక అమ్మక అద్దెఇల్లు అమ్మటం ఏంధర్మం అండీ?

లెక్కలో ఈఇల్లుకొని అమ్మటం అని ఉంది. అందులో తప్పేమీలేదు.

'కొనక కొనక ఈ యిల్లేనా కొనటం?

ఊరికే లెక్కకోసం అనుకోటమేగా! .

ఊరికే అనుకొనేటప్పుడు ఈయిల్లు కొందాము అనుకోటం ఏమిఖర్మమూ అంటా! కేకేనీమహల్‌లాంటి ఇంటిని కొందాము అనుకొంటే సంతోషం కాదండీ.

నిజమేలే, ఇప్పుడదంతా ఎందుకు అసలు సంగతికిరా.

అదీగాక ఏదో ఒకటి స్వగృహం అంటూ ఏర్పడ్డతరువాత దాన్ని అమ్ముదాము అనుకోటం తప్పు. అమ్ముకోటం అంటూ వస్తే నష్టానికమ్ముకోటం వట్టి తెలివితక్కువ తనం.

ఈగొడవ ఎప్పుడూ ఉన్నదే కాని వాడిని తాతయ్య ఎందుకో కొట్టాడో చెప్పు. అని నేను ఆవలించి రెండు చిటికలువేశాను.

నాకు నిద్రవస్తున్నట్లు గ్రహించి ఆవిడ తొందరగా విషయంఅంతా నాకు చెప్పేద్దామని. ఆదుర్దాగానే ఇల్లా అన్నది.

రఘు అల్లాగచూస్తూ కూర్చుంటే వాళ్ళ తాతయ్య చెయ్యవేంరా లెక్క! అని కోప్పడ్డాడు. వాడు నవ్వుతూ 'ఈలెక్క నోటితోనే చెప్పవచ్చు. అందుకని ఆలోచిస్తున్నాను' అన్నాడు.

మానాన్న ఇచ్చిన తర్ఫీదు అల్లాంటిది. ఆయనదగ్గర చదువుకొన్నవాడికి, ఎంతలెక్క అయినా నోటితో ఇట్టే చేసే శక్తి వస్తుంది' అన్నాను.

'నోటితో చేసి చెప్పగలిగితే ఇంకేం కావాలె చెప్పు చూద్దాము' అన్నారు మామగారు ప్రేమతోనే. వీడు ఆలెక్కను అం సులభంగా చెయ్యగలడా అని ఆశ్చర్యం గలిగి నేనూ చూస్తూ చూస్తూ ఊరుకున్నాను.

రఘూ కొంచెం ఆలోచించాడు. మీలాగ తొందరపడే స్వభావం కాదుగా వాడిది ! అని నవ్వింది.

అవునులే నీలాగ నిదానించే స్వభావమేలే. అన్నాను నేను.

కానీ వాడు అంకెలవంక నిదానించి చూశాడు. చివరకు తలఎత్తి అన్నాడు. ఈ వ్యవహారంలో కొంత నష్టమూ ఉంది. కొంతలాభమూ ఉంది అని.

వాడి మొఖం నష్టమూ, లాభమూ రెండూ ఎల్లాగఉంటై? అన్నాను నేను నవ్వుతూ.

వాళ్ల తాతయ్యా ఆమాటే అన్నారు. 'నష్టమూ లాభమూ ఏమిటిరా పిచ్చివెధవా ఏదో ఒకటే ఉంటుంది చెప్పు' అని కోప్పడ్డాడు.

రఘు కాస్త చిన్నబుచ్చుకొని 'అదికాదు తాతయ్యా, నష్టమూ, లాభమూ కూడా ఉంది.' ఎల్లాగా అంటే, ఇంట రు. 950_2_3కు కొని రు. 520_15_11కు అమ్మాడా, అమ్మితే, రూపాయల్లో కాస్త నష్టం వచ్చినా, అణాల పైసలలో మాంచి లాభంవచ్చింది తాతయ్యా అన్నాడు.

నాకు నవ్వొచ్చింది వాడి తెలివితక్కువ జవాబుకు. నష్ట, రూపాయలు, అణాలు, పైసలు వేటికవి ప్రత్యేకంగా చూశాడు. పిచ్చివెధవ అన్నాను.

మా కాంతం అన్నది: చూశారా, మీరు నవ్వినట్లుగానే ఆయనా నవ్వి ఊరుకొంటే ఎంత బాగుండేది. ఆయన అల్లాగ చెయ్యక వాడి చెవులు మెలేసి ఏడిపించారండీ వాడిని !!

'ఏం ఏడిపిస్తే, మరేం ఫరవాలేదు. పిల్లవాడిని కాస్త ఓ దెబ్బవేస్తే, నీవు ఇంత గిలగిల్లాడకూడదు' అని నేను మా ఆవిడనే కోప్పడ్డాను.

కాంతం ఏమీ తృప్తిపడలేదు. పైగా నావంక చుర చుర చూసిందికూడా ఇది నాకు ఏమీ సబబుగా కనపడలేదు. ఆయనకు పిల్లవాడిమీద ప్రేమలేకపోయిందా ? చదువు రావాలని ఏదోకాస్త ఇల్లా అంటే ఈవిడ మహారాద్ధాంతం చేయటం ఏమిటి !

పోనీ అంతటితో ఊరుకొన్నా కొంత నయమే. కాంతం ఊరుకోక తన కొడుకును ఆయన కొట్టినందుకు విచారపడుతూ, ఊరికే గునుపు సాగించింది, ఎందుకు కొట్టాలె ఎందుకు చెవులు మెలవెయ్యాలె, అంటూ.

ఆ గునుపుకు అంతూపొంతూ కనిపించలేదు. నాకు ఒళ్లు మండుకొచ్చింది. ఆయనకుమటుకు వీడిమీద ద్వేషమా ? ఏదో కాస్త చెవులు పట్టుకొంటే వచ్చిన అవమానం ఏముంది. ఊరుకోమంటే ఊరుకోక వచ్చింది ఈవిడ. చివరకు మా కాంతాన్నే కాస్త కోప్పడటం అవసరమనితోచి ఇల్లాగ అన్నాను.

'ఏమిటా గునుపు, కాకపోయినా, ఏదో పెద్దపుట్టి మునిగిపోయినట్లు ! ఈమాత్రానికి నీ బిడ్డ మరేమీ కందిపోలేదులే ! అయినా పెద్దవాడిని ఆయనను ఏమంటాము ! ఏం జేస్తాము !'

ఈమాటలు కోపంగానే అన్నాను.

ఏమీ అనక ఊరుకొంటారా ఏమిటండి నోరుమూసుకొని పసివాడిని అల్లాగ నలిపేస్తే? అన్నది పౌరుషంగా.

ఊరుకోక చేసేదేమిటో చెప్పు? కాకపోయినా మహా ఎగురుతున్నావులే! అని నేను అంతకంటే ఎక్కువ పౌరుషంగా గట్టిగా కేకవేశాను.

కాంతం ముఖం ఇంతజేసుకొని కొంచెంతగ్గి 'ఎందుకండీ కోప్పడతారూ? పసివాడిని బాధపెడితే నాకు ఎంతకష్టంగా ఉందో మీరు గ్రహించాలి' అన్నది.

నేను కొంచెం తగ్గి అన్నాను, 'మరి ఏంజేస్తాము. పెద్ద వాడిని ఆయనను ఏమంటాము. ఊరుకోవలసిందే! అని నేను నిక్కచ్చిగా చెప్పాను. అంతకంటే ఆ విషయమై వాదన పెరగ కూడదని నా నిశ్చయం.

'నే నూరుకోను' అని కాంతం నిక్కచ్చిగా జబాబు చెప్పింది. 'ఊరుకోక ఏంజేస్తావు? చెప్పు!' అన్నాను.

ఆసొగారు బుడ్డిమూతిపెట్టి తలవంచుకుని నేనూరుకోను అనటంచూస్తే నాకు నవ్వు వచ్చింది.

చెప్పు అని అన్నానేకాని ఆవిడ మాట్లాడుతుందని కాదు నాఉద్దేశం. ఈ విషయమై ఇంత రాద్ధాంతం చెయ్యకుండా మొదటే ఊరుకోవాల్సింది సుమా నీవు అని ఆవిడకు నేను చెప్పటం అది!

కాంతం ఇంకా తలవంచుకొనేఉంది. చదరంగం ఆటలో 'మహా!' అన్నట్లు అయిపోయింది.

కాంతం ఇంకా తలవంచుకొనేవుంది. కొత్తకొత్త సింగా రాలతో, గర్వంగా ఎగురుతూ పరుగెత్తుతూ వచ్చే సెలయేటి ప్రవాహానికి కొండ అడ్డమైనట్లు అయింది.

నేను అధికమైన గర్వంతో ఆవిడను చూస్తున్నాను. కాంతం తలఎత్తి మధురమైన గొంతుకతో అన్నది. 'మాట్లాడు తున్నాను వినండి. నాకొడుకు చెవులుమెలిపితే, నాకెంత బాధగా ఉందో మామగారికి తెలియదు.' అని నావంక నిశితంగా, చురుగ్గా చూసింది. గులాబిపూరేకులలో మధురమైన సువా సన ఎంత రహస్యంగా దాక్కొని తొంగిచూస్తుందో అంత రహ స్యంగా దాక్కొని తొంగిచూస్తున్నది చిరునవ్వు ఒకటి ఆమె పెదవులమధ్యనుంచి. 'నీబాధ ఆయనకు తెలియదే అనుకో. అయితే మటుకు నీవేంచేస్తావు?' అన్నాను.

'తెలిసేటట్టు చేస్తాను' అన్నది ఆవిడ.

'ఎట్లా తెలిసేటట్టుచేస్తావు?' అన్నా నేను.

'ఎట్లాగా? కాజీతీర్పు ఇచ్చి: చెయ్యికి చెయ్యి, కాలికి కాలు అని వాళ్ళసిద్ధాంతం. ఆయన నాకొడుకు చెవులుమెలిపితే, నేను ఆయనకొడుకు చెవులు మెలుపుతాను. అప్పుడు తెలిసి వస్తుంది ఆయనకి, బిడ్డమీద చెయ్యివేస్తే కన్నకడుపుకు ఎంత బాధగా ఉంటుందో అన్నవిషయం' అంటూ కాంతం కుర్చీలో నుంచి లేచింది.

97

ఆంధ్ర ఇన్సూరెన్సు కంపెనీ

అఖండవిజయవంతమైన — మరియొక ఘట్టము.

1945 సం॥ లో

సమకూర్చబడిన వ్యాపారము — ఒక కోటి 25 లక్షలు

పట్టాలయిన వ్యాపారము — ఒక కోటి 5 లక్షలు

అద్వితీయమైన రెన్యూయల్ ఖర్చులరేటు. 10086

ఇట్టి లక్షణములతో కూడిన, దినదినాభివృద్ధి గాంచుచున్న ఈ భీమాసంస్థ ప్రజావిశ్వాసమును జూరగొనినది.

ఏజన్సీకిగాని — భీమా చేయుటకుగాని వివరములకై వ్రాయుడు:—

ఆంధ్ర ఇన్సూరెన్సు కంపెనీ, లిమిటెడ్

హెడ్డాఫీసు — మచిలీపట్నం.

మా ఇతర ఆఫీసులు:—

మద్రాసు, కలకత్తా, నాగపూర్, లాహోర్, అలహాబాద్, జెంషెడ్‌పూర్, గంజాం, అనంతపురం, ఎర్నాకులం, శికింద్రాబాద్, 'డక్కన్' బెజవాడ, గుంటూరు.

రాజరాజేశ్వరి సుభాస్‌చంద్ర సుకుమారబాబు (అర్‌ఫన్‌హోమ్)

అనాధ శరణాలయం, బెజవాడ.

వైవాహిక సంబంధంలో కాక వేరేవిధంగా గర్భము ధరించిన అనాధ స్త్రీలు భ్రూణహత్యలు చేయటం మహాపాపం.

బిడ్డలనుకని మాకు ఇచ్చెయ్యండి. మేము పెంచుతాము. లేకపోతే అట్టి గర్భవతులు మా శరణాలయంలో ఉండి పురుడు పోసుకొని వెళ్లిపోవచ్చు. తల్లి తండ్రులులేని పసి బిడ్డలనుకూడ ఇక్కడ పెంచుతాము. తాముకనిన బిడ్డలను రహస్యముగా వదలి పోవుటకును, ఒరుల కండబడకుండ పురుడు పోసుకొనుటకును, ఏర్పాటుగల మా శరణాలయము బెజవాడకు మూడు మైళ్ల దూరములోనున్న శ్రీనివాసపురములో నిర్మించబడినది. రాత్రి, పగలు ఎల్లప్పుడూ తెరచి యుంచబడును. అనాధస్త్రీలకు బిడ్డలకు తల్లి శ్రీమతి విజయలక్ష్మి ఉత్తర ప్రత్యుత్తరములకు ఈ చిరునామాను గుర్తు ఉంచుకోండి.

మానేజింగు ట్రస్టీలు:- రాజరాజేశ్వరీ సుభాస్‌చంద్ర సుకుమార్‌బాబు, అర్‌ఫన్‌హోమ్.

వి. వి. ఎల్. పంతులు

వి. విజయలక్ష్మి

Co/ సుకుమార్‌బాబు పిక్చర్స్

బెజవాడ

KNR

FAMOUS FILMS CIRCUIT

MOTION PICTURE DISTRIBUTORS

H. O. NELLORE

Branches:—

BEZWADA.
GUNTAKAL.

Tel- "FAMOUS"
Office: BRUNDAVAN.

Book Now

Our latest spectacular masterpieces in Hindi

1. MAHARATHIKARNA
2. PHOOL or FLOWER
3. TARAMATHI.
4. LAILA MAJUNU
5. VILLAGE GIRL
6. BHAIJAN.
7. Ek-din-Ka Sultan.
8. Shama.
9. Ragine.
10. Albeli.
11. Sona Chand.

TELUGE:—

Balaji or Venkateswara Mahathyam.
Dharmapathni.
Krishna Prema.
Bhagya Lakshmi.
Harischandra.
Sarangadhara
Chandrahasa.
Bhale Pelli & Tarumaru
Chitranaliam.
Tulasi.
Kalachakram.

HINDI:—

Age kadam.
Dil-ki-Bhat.

TAMIL:—

హర రమణి.
[illegible].

ఆంధ్ర బ్యాంకు లిమిటెడ్

స్థాపితము 1923

హెడ్డాఫీసు - మచిలీపట్నం.

అధికారము పొందబడిన మూలధనము	రు	1,00,00,000
చందా వేయబడి, జారీచేయబడిన మూలధనము		25,00,000
చెల్లింపబడిన మూలధనము		13,00,000
రిజర్వు ఫండు		2,50,000
అమలులోనున్న వ్యాపారము మొత్తము		3,50,00,000

మదరాసు బ్రాంచి:- బాంబే మ్యూచుయల్ బిల్డింగు 378 ఎస్ప్లనేడు

సికిందరాబాదు బ్రాంచి:- మెహతామహాల్, జేమ్సువీధి.

ఇతర బ్రాంచీలు, సబ్ ఆఫీసులు.

మచిలీపట్టణము, నెల్లూరు, తెనాలి, గుంటూరు, బెజవాడ, ఏలూరు, రాజమండ్రి, కాకినాడ, విశాఖపట్టణము, విజయనగరము, బరంపురం (గంజాం) ఒంగోలు, చీరాల, దుగ్గిరాల, నరసారావుపేట, వినుకొండ, బ్రాడీపేట (గుంటూరు), గవర్నరుపేట (బెజవాడ), గుడివాడ, పాలకొల్లు, భీమవరం, సామర్లకోట, రామారావుపేట (కాకినాడ), పిఠాపురం, తుని, అనకాపల్లి, చికాకోలు (వైజాగ్)

ఫిక్సెడు డిపాజిట్లు:- నూరు రూపాయలకు తక్కువగాని మొత్తములకు 3, 6, 12, 24 మాసములకు అన్ని బ్రాంచీలలోను తీసుకొనబడుచున్నవి.

3. సంవత్సరముల క్యాషు సర్టిఫికెట్లు, యీ బ్యాంకులో ప్రత్యేక సౌకర్యము. అన్నిరకముల చెక్కులు, డ్రాఫ్టులు, డివిడెండు వారంట్లు, హుండీలు, వసూలుచేసి పెట్టబడును.

గవర్నమెంటు పత్రములు, షేర్లు, కొనుట అమ్ముట మొదలగు వ్యాపారములుగూడ చేయబడును.

వివరములు ఏ ఆఫీసులోనైనను తెలిసికొనవచ్చును.

వారణాశి కృష్ణమూర్తి,
ఎం. ఏ., బీ కాం., యల్, యల్, బి, సి. ఏ. ఐ. ఐ. బి.,
జనరల్ మేనేజరు.

101

ప్రచురణ:

సుందరరాం అండ్ సన్సు

తెనాలి.

1946

హక్కులు రచయితవి.

ముందరు

మినర్వా ప్రెస్,

800

ప్రకటనకథ

శాంతమ్మ అత్తగారితో అంటున్నది - "ఎందుకండీ అత్తా! అల్లాగ పొద్దస్తమానమూ కునుస్తూఉంటారు ?"

"నేనేమీ అనలేదే కోడలా! నేనూ పెద్దదాన్ని అయిపోయినాను. నీ కడుపుఫలించి ఒక్క నలుసుపుడితే కళ్లారచూచి ఆనళంగా కాశీ వెళ్ళిపోతాను. నాబాధ వదలాలంటే, నీవు త్వరగా కను."

"నన్నేమి చేయమంటారు! ఆ విశ్వేశ్వరుని ప్రార్థిస్తున్నానండీ" అన్నది శాంతమ్మ.

అత్తగారు ఇట్లాఅన్నది. "మంచిపనే చేస్తున్నావు. దానితోపాటు ఇల్లారా చెబుతా, (చెవిలో) - లోధ్ర పుచ్చుకో. గర్భాన్ని అంటిపెట్టుకొని ఉన్న రోగాలన్నీ పోతవి. నేను చిన్నతనంలో పుచ్చుకొంటేనే బాధలన్నీపోయి వాడు పుట్టాడు"

కోడలు నవ్వుకొని తృప్తిపడి వెళ్ళిపోయింది. ఆ తరువాత 10 నెలలకు అత్తా కోడళ్ళు ఇద్దరూ మళ్లీ ఇల్లాగ మాట్లాడుకొన్నారు.

'అత్తా మీకు నమస్కారము. మనమణ్ణి కనిఇచ్చినా, మీరు గునుపు సాగిస్తూనే ఉన్నారు. మనమణ్ణిచూచి కాశీ పోతామన్నారు పోరాదూ'

అత్త అన్నది 'పోతానమ్మా, వెళ్ళిపోతాను. లోధ్ర పుచ్చుకొంటున్నావా! ఆ రెండోవాడు ఎల్లాఉంటాడో చూడాలని ఉన్నదేపిల్లా! వాణ్ణి కూడా చూచి వెళ్ళిపోతాను'

'ఆః వాణ్ణి చూచినతరువాత మనవరాలను చూచినదాకా ఉంటానంటారు. !

అత్తా కోడళ్ళు నవ్వుకొన్నారు.

(లోధ్ర గర్భాశయ రోగాలకన్నిటికీ అమోఘమైన మందు. ఏదో జబ్బువుండి సంతానం కలగకుండా పోతుంది. అల్లాంటప్పుడు లోధ్రి పుచ్చుకొంటేసరి, ఆ జబ్బులన్నీ పోయి సంతానం కలుగుతుంది.)

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	TPLA124B128
పుస్తకం పేరు	హాస్య కధలు
తారీఖు	29/10/24
ముందు అట్ట	NO
వెనుక అట్ట	NO
మొత్తం పేజీలు	105
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	NO
లేని పేజీలు	NO
తయారు చేసినది	Apsar
పేజీలు విడదీసినది	Yasin
స్కాన్ చేసినది	Uma
పరీక్ష చేసినది	ROHITH
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good